అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 13-12-2023

సంపుటి : 9 | సంచిక : 292 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

కార్పొరేట్లకు మోడీ మెహర్బానీ

ఐదేండ్లలో రూ.పది లక్షల కోట్లు మాఫీ



వివరాలు 11లో



భవిష్యత్తును కాపాడండి

వాతావరణ మార్పులపై శంఖారావం

- కాప్28 వేదికపై 12 ఏండ్ల భారతీయ బాలిక నిరసన

దుబాయ్ : లిసిప్రియ కంజుజామ్...12 ఏండ్ల భారతీయ బాలిక. వాతావరణ మార్పులపై ఉద్యమిస్తున్న కార్యకర్త. దుబాయ్‌లో జరుగుతున్న కాప్28 వాతావరణ సదస్సు వేదిక పైకి సోమవారం ఆకస్మికంగా ప్రవేశించి అందరికీ ఆశ్చర్యపరచింది. 'శిలాజ ఇంధనాలకు స్వస్తి చెప్పండి. మన గ్రహాన్ని, భవిష్యత్తును కాపాడండి' అని రాసిన ప్లకార్డును ప్రదర్శించింది. సభికుల కరతాళ ధ్వనుల మధ్య భద్రతా సిబ్బంది ఆమెను బయటికి తీసికెళ్లారు. తన నిరసనకు సంబంధించిన వీడియోను ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. నిరసన అనంతరం తనను 30 నిమిషాల పాటు నిర్బంధించారని ఆమె తెలిపింది. 'నేను చేసిన నేరం ఏమిటంటే నేడు వాతావరణ సంక్షోభానికి కారణమవుతున్న శిలాజ ఇంధనాలను వినియోగించవద్దని కోరడమే. అందుకే వారు నన్ను కాప్28 సదస్సు నుండి బయటికి గెంటేశారు' అని చెప్పింది. అనంతరం కంగుజామ్ మరో ప్రకటనను పోస్ట్ చేసింది. 'ఈ రోజు వాతావరణ సంక్షోభానికి కారణమవుతున్న బొగ్గు, చమురు, గ్యాస్ ఉత్పత్తి, వాడకాన్ని క్రమేపీ నిలిపివేసే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. ఈ రోజు మీరు తీసుకునే చర్యలు రేపు మా భవిష్యత్తును నిర్ణయిస్తాయి. మనం ఇప్పటికే వాతావరణ మార్పులకు బాధితులమయ్యాము. నా భావి తరాల వారు మరోసారి ఇవే పరిణామాలను ఎదుర్కోవడం నాకు ఇష్టం లేదు. మన నాయకుల వైఫల్యాలకు లక్షలాది మంది అమాయక చిన్నారులను బలి చేయడం ఎట్టి ...11లో

ఇక ప్రక్షాళనే...

పారదర్శకంగా టీఎస్‌పీఎస్సీ నియామకాల ప్రక్రియ

- యూపీఎస్సీ సహా ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నివేదికివ్వాలి : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- సుప్రీం ఆదేశాలకనుగుణంగా చైర్మెన్, సభ్యుల నియామకం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ను ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి చెప్పారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఉద్యోగ నియామకాలు, ఉద్యోగ ప్రవేశ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహిస్తున్న యూపీఎస్సీతోపాటు ఇతర రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరును అధ్యయనం చేసి సవివరమైన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకాలు, నోటిఫికేషన్లకు సంబంధించిన అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి, సీఎం కార్యదర్శి వి శేషాద్రి, డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజీ సీవీ ఆనంద్, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, ఆర్థిక శాఖ కార్యదర్శి టికె శ్రీదేవి, సిట్ స్పెషల్ అధికారి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ న్యూ ఢిల్లీలోని యూపీఎస్సీతోసహా పలు రాష్ట్రాలకు ఉన్నతాధికారుల బృందాన్ని పంపించాలని చెప్పారు. అక్కడి నియామకాల ప్రక్రియపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఉద్యోగ నియామకాలు అత్యంత పారదర్శకతతో చేపట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల నియామకాలకు సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా ఉండే విధంగా తగు మార్గదర్శకాలను రూపొందించాలని ఆయన ఆదేశించారు. టీఎస్‌పీఎస్సీకి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, కావాల్సిన సిబ్బందిని ఇతర సదుపాయాలను వెంటనే కల్పించాలని అధికారులను కోరారు.

నేడు టీఎస్‌పీఎస్సీ సభ్యుల రాజీనామా

టీఎస్‌పీఎస్సీ పాలకమండలి సభ్యులు బి లింగారెడ్డి, కోట్ల అరుణకుమారి, సుమిత్రా ఆనంద్ తనోబా, కారం రవీందర్‌రెడ్డి బుధవారం రాజీనామా చేయనున్నారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పుదుచ్చేరి పర్యటనలో ఉన్నారు. బుధవారం హైదరాబాద్‌కు వస్తారు. ఆమె వచ్చిన తర్వాత రాజ్‌భవన్‌కు వెళ్లి టీఎస్‌పీఎస్సీ సభ్యులు రాజీనామా పత్రాలను సమర్పిస్తారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సచివాలయంలో వారు కలిశారు. రాజీనామా చేయనున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయం, రాజ్‌భవన్ అధికారులకు వారు సమాచారమిచ్చారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ బి జనార్ధన్‌రెడ్డి సోమవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

తప్పు చేయకున్నా తప్పుకుంటున్నా... : ఆర్ సత్యనారాయణ

టీఎస్‌పీఎస్సీ సభ్యుడు ఆర్ సత్యనారాయణ రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం లేఖ విడుదల చేశారు. తాను ఏ తప్పు చేయలేదు.. అయినా తప్పుకుంటున్నానని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమ బాధ్యతలు ...2లో

ఆర్థికాభివృద్ధి ప్రాంతంగా మూసీ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ నది ప్రారంభ ప్రాంతం నుంచి చివరి వరకు ఆ నది పరీవాహక ప్రాంతాన్ని ఉపాధి, అర్థికాభివద్ధి ప్రాంతంగా రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణా సచివాలయంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, శాసన సభ్యులు అక్బరుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు ...2లో

దయచేసి ఆస్పత్రికి రావొద్దు..

ప్రజలకు మాజీ సీఎం కేసీఆర్ విజ్ఞప్తి

- గవర్నర్ తమిళి సై సహా పలువురి పరామర్శ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'నా మీద అభిమానంతో నన్ను చూసేందుకు ఆస్పత్రికి రావొద్దు.. తద్వారా నాతోపాటు వందలాది పేషెంట్లకు ఇబ్బంది కలిగించొద్దు....దయచేసి సహకరించండి...' అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కోలుకుని త్వరలోనే అందరి మధ్యకు వస్తానని ఆయన తెలిపారు. ఇన్ఫెక్షన్లు సోకుతాయనే కారణంతో డాక్టర్లు తనను బయటకు పంపటం లేదనీ, అందువల్ల తనకోసం ఎవరూ ఆస్పత్రి వద్దకు రావద్దని పేర్కొంటూ మంగళవారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. హైదరాబాద్ సోమాజీగూడలోని యశోద ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. తాను ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాననీ, త్వరలో సాధారణ స్థితికి చేరుకుంటానని కేసీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. అప్పటిదాకా సంయమనం పాటించి దవాఖానా వద్దకు రావొద్దంటూ సూచించారు. తన పట్ల అభిమానం చూపుతున్న కోట్లాది మంది ప్రజలకు కృతజ్ఞత తెలుపుతూ గద్గద స్వరంతో చేతులు జోడించి మొక్కారు. 'నన్ను చూడటానికి వస్తున్న మీరూ ఇబ్బంది పడొద్దు.. ఆస్పత్రిలో ఉన్న పేషెంట్లూ ఇబ్బంది పడొద్దు...' అని సూచించారు. మరోవైపు కేసీఆర్‌కు పరామర్శలు ...2లో

బీజేపీకి చరిత్ర తెలియదు

దాన్ని తిరగరాయడమే తెలుసు

- ప్రధాన సమస్యలను తప్పుదోవ పట్టించేందుకే తంటాలు : అమిత్‌షా వ్యాఖ్యలపై రాహుల్ ఆగ్రహం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అమిత్ షా సహ బీజేపీ నేతలకు చరిత్ర తెలియదు. వారికి చరిత్ర తెలుస్తుందని ఊహించనూలేం. దానిని తిరగరాసే అలవాటు మాత్రం ఉంది. అందుకే పదే పదే దాన్ని తిరగరాస్తూనే ఉన్నారు" అని రాహుల్ అన్నారు.. దేశంలో నెలకొన్న ప్రధాన సమస్యల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బీజేపీ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని అన్నారు. "ప్రాథమిక సమస్య కుల ప్రాతిపదికన జనాభా గణన, నిరుద్యోగం, దేశంలోని ధనమంతా ఎవరి చేతుల్లో ఉంది? వీటిపై చర్చించేందుకు బీజేపీ భయపడుతోంది. అందుకే వీటి నుంచి పారిపోతోంది. మేము ఈ సమస్యను ముందుకు ...11లో

అంజనీకుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

కొత్తకోటకు నగర కొత్వాల్ పగ్గాలు

- సైబరాబాద్‌కు అవినాశ్ మహంతి
- రాచకొండకు సుధీర్‌బాబు
- కొత్త సీపీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- నార్కొటిక్ డ్రగ్స్ డైరెక్టర్‌గా శాండిల్య



కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి | అవినాశ్ మహంతి | సుధీర్‌బాబు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్ర పోలీసు శాఖలో భారీ మార్పులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఒకపక్క, రాష్ట్ర మాజీ డీజీపీ అంజనీకుమార్‌పై ఈసీ సస్పెన్షన్ ఎత్తివేయగా, మరోవైపు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలకు కొత్త పోలీసు కమిషనర్లను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా హైదరాబాద్ పోలీసు శాఖ బాధ్యతలను అదనపు డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి అప్పగించటం పోలీసుశాఖలో హల్‌చల్ సృష్టించింది. మరోవైపు, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా అదే కమిషనరేట్‌లో జాయింట్ కమిషనర్‌గా ఉన్న అవినాశ్ మహంతిని నియమించిన సర్కార్.. హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్‌బాబుకు రాచకొండ పగ్గాలను అప్పగించింది. కాగా, హైదరాబాద్ ప్రస్తుత కమిషనర్ సందీప్ శాండిల్యకు నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో డైరెక్టర్‌గా నియమించి, రాచకొండ, సైబరాబాద్ ప్రస్తుత కమిషనర్లు డి.ఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్రలను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

ఐపీఎస్, రాజకీయ వర్గాల్లో చర్చ

1994 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డికి అత్యంత కీలకమైన హైదరాబాద్ కమిషనర్ బాధ్యతలను అప్పగించటం ...11లో



మాయమైపోతున్నారు..

దేశంలో 47 వేల మంది చిన్నారుల అదృశ్యం

- వారిలో 71 శాతం మంది బాలికలే

బేటీ బచావో..బేటీ పడావో అంటున్న మోడీ పాలనలో చిన్నారులు మాయమైపోతున్నారు. కనీసం వారు ఎక్కడ ఉన్నారు..ఎలా ఉన్నారు. అసలు ప్రాణాలతో బతికే ఉన్నారా..లేదో తెలియక తలిదండ్రులు లోలోన కుమిలిపోతున్నారు. తాజాగా ఎన్సీఆర్బీ విడుదల చేసిన నివేదికల్ని పరిశీలిస్తే..ఆ కుటుంబాలు ఎంతగా ఆవేదన చెందుతున్నాయో స్పష్టమవుతోంది.

న్యూఢిల్లీ : దేశంలో 2018 తర్వాత అదృశ్యమైపోతున్న చిన్నారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్బీ) తాజా నివేదిక ప్రకారం 47 వేల మంది చిన్నారుల ఆచూకీ తెలియడం లేదు. వారిలో 71.4 శాతం మంది మైనర్ బాలికలేనని ఆ నివేదిక తెలిపింది. కనిపించకుండా పోయిన బాలబాలికల సంఖ్య 2022తో కలిపి ఐదు సంవత్సరాల కాలంలో బాగా పెరిగింది. 2021తో పోలిస్తే 2022లో వీరి సంఖ్య 7.5 శాతం పెరిగింది. 2020లో కంటే 2021లో 30.8 శాతం పెరిగింది. అయితే 2019తో పోలిస్తే 2020లో 19.8 శాతం తగ్గింది. కానీ 2018లో కంటే 2019లో 8.9 శాతం, 2017తో ...11లో

కదులుతున్న రైలులోనే అఘాయిత్యం

- బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో దారుణం 2లో..

2024లో సెలవులు ఖరారు

సర్కారు జీవో జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

2024 సంవత్సరానికిగాను సాధారణ, ఐచ్చిక సెలవుల జాబితాను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ జాబితాలో 27 సాధారణ సెలవులు ఉండగా, మరో 25 ఆప్షనల్(ఐచ్చిక) సెలవులు ఉన్నాయి. కొత్త ఏడాదిలో జనవరి ఒకటో తేదీన సెలవు ప్రకటించిన సర్కారు, అందుకు బదులుగా ఫిబ్రవరి 10వ తేదీన రెండో శనివారాన్ని పనిదినంగా నిర్ణయించింది. ఈమేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సాధారణ సెలవుల జాబితాలో జనవరి 1, జనవరి 14 (భోగి), జనవరి 15 (సంక్రాంతి), జనవరి 26 (రిపబ్లిక్ డే), మార్చి 8 (మహాశివరాత్రి), మార్చి 25 (హోలీ), మార్చి 29 (గుడ్ ఫ్రైడే), ఏప్రిల్ 5 (బాబూ జగ్జీవన్‌రాం జయంతి), ఏప్రిల్ 9 (ఉగాది) , ఏప్రిల్ 11, 12 (రంజాన్), ఏప్రిల్ 14 (అంబేద్కర్ జయంతి), ఏప్రిల్ 17 (శ్రీరామనవమి), జూన్ 17 (బక్రీద్), జూలై 17 (మొహర్రం), జూలై 29 (బోనాలు), ఆగస్ట్ 15 (ఇండిపెండెన్స్ డే), 26 (శ్రీకష్ణాష్టమి), సెప్టెంబర్ 7 (వినాయక చవితి), ...11లో

రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ

మూడో రాష్ట్రంలోనూ తెరపైకి కొత్త మొఖం

- సంఘ్‌కు సన్నిహితుడు,తొలిసారి గెలిచినా బీజేపీ హైకమాండ్ మొగ్గు
- వసుంధర రాజేకు మొండిచేయి



జైపూర్ : రాజస్థాన్ ఎన్నికలై వారంరోజులయ్యాక..ముఖ్యమంత్రిని బీజేపీ ప్రకటించింది. ఈసారి బ్రాహ్మణ వర్గానికి చెందిన నేతపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, భజన్ లాల్ శర్మను ఆ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిని చేసింది. భరత్‌పూర్ నివాసి భజన్ లాల్ శర్మ చాలా కాలంగా బీజేపీలో పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాలుగుసార్లు పనిచేశారు. పార్టీలోలో కీలక పాత్ర పోషించినందుకు అయనకు ముఖ్యమంత్రి పదవిని బహుమతిగా ఇచ్చారని ఆయన సన్నిహితులు అంటున్నారు.ఇటీవల జరిగిన ...11లో

పార్లమెంట్‌లో సీఈసీ, ఈసీ నియామక బిల్లు

ఈ బిల్లు ప్రజాస్వామ్య పునాదులకే ప్రమాదమన్న ప్రతిపక్షాలు

- రాజ్యసభ నుంచి వాకౌట్
- లోక్‌సభలో రెండు బిల్లులకూ ఆమోదం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సర్వీస్ షరతులు , పదవీకాలం) బిల్లును రాజ్యసభ ఆమోదించింది. ఈ బిల్లు ఎన్నికల సంఘం స్వతంత్రతను తొలగించి ప్రభుత్వ కమిటీగా కుదించిందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశాయి. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలంటూ ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును అధిగమించేందుకు మోడీ ప్రభుత్వం బిల్లు తీసుకొచ్చింది. మంగళవారం రాజ్యసభలో ఈ బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం ఈ బిల్లుపై చర్చ జరిగింది. వివిధ పార్టీల నేతలు మాట్లాడిన తరువాత బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కేంద్ర న్యాయ శాఖ ...2లో

పారదర్శకత ఏదీ?

- ఎన్నికల సంఘాన్ని తన అదుపులో ఉంచడమే లక్ష్యం
- ఎలక్ట్రోరల్ బాండ్ ఎన్నికల కుంభకోణం: సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్



వివరాలు 11లో

పేదల గుడిసెలపై దాష్టీకం

జేసీబీలతో కూల్చివేత

- అడ్డుకున్న గరీబోళ్లు, మహిళలు పోలీస్ స్టేషన్‌కు తరలింపు





నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కురవి గేట్ సమీపంలోని సర్వే నెంబర్ 255/1 ప్రభుత్వ భూమిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు వేసిన గుడిసెలపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, అటవీశాఖ అధికారులు మంగళవారం తెల్లవారక ముందే జేసీబీలతో వచ్చి పేదల గుడిసెలను నేలమట్టం చేసేందుకు ప్రయత్నించారు. భోజనాలు వండుకుంటుండగా దౌర్జన్యంగా గుడిసెలు కూల్చివేయడంతో పేదలు బోరున విలపించారు. అన్నం గిన్నెలు, ఉప్పు, పప్పు, నూనె, చింతపండు వంట సామాగ్రి రోడ్డుమీద పడటంతో పేదలు దిక్కులేని వారయ్యారు. గుడిసెలు కోల్పోయిన పేదలు నిరాశ్రయులయ్యారు. ధర్నా నిర్వహించగా.. ...2లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	61,910	▼	220
22 క్యారెట్లు	56,750	▼	200
కిలో వెండి	77,700	▼	100



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 75
రిటైల్ (లైవ్)	రూ. 97
స్కిన్‌తో	రూ. 141
స్కిన్‌లెస్	రూ. 160

బిజినెస్

మళ్లీ ఎగిసిన ధరలు

- **5.55 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం**



న్యూఢిల్లీ : దేశంలో ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుత ఏడాది నవంబర్‌లో వినియోగ దారుల రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 5.55 శాతానికి ఎగిసిందని మంగళవారం కేంద్ర గణంకాల శాఖ కార్యాలయం ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఇంతక్రితం అక్టోబర్‌లో సిపిఐ 4.87 శాతంగా నమోదయ్యింది. గడిచిన నవంబర్‌లో గ్రామీణ ద్రవ్యోల్బణం 5.85 శాతానికి పెరిగింది. ఇది అక్టోబర్‌లో 5.12 శాతంగా ఉంది. ఇదే సమయంలో ఆహార ద్రవ్యోల్బణం 6.61 శాతంగా ఉండగా.. గడిచిన నెలలో ఏకంగా 8.70 శాతానికి ఎగిసింది. రిటైల్ ద్రవ్యోల్బణం సూచీని 2-6 శాతం మధ్యన కొనసాగేలా ఆర్‌బిఐ లక్ష్యంగా పెట్టుకుంది. మధ్యస్థ కాలానికి 4 శాతానికి కట్టడి చేయాలని నిర్దేశించుకుంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షాలో అంచనా వేసింది.

పెరిగిన పారిశ్రామికోత్పత్తి

ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) 11.7 శాతానికి పెరిగి.. 16 మాసాల గరిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ముఖ్యంగా తయారీ రంగం, గనులు, విద్యుత్ రంగాలు మెరుగైన వృద్ధిని కనబర్చాయని కేంద్ర గణంకాల శాఖ పేర్కొంది. ఇంతక్రితం మాసం ఆగస్టులో ఐఐపి 10.3 శాతంగా చోటు చేసుకుంది. అక్టోబర్‌లో తయారీ రంగం 10.4 శాతం, గనుల రంగం 13.1 శాతం, విద్యుత్ 20.4 శాతం చొప్పున పెరుగుదలను నమోదు చేశాయి.

అంచనా కంటే ద్రవ్యలోటు తక్కువే.. : ఆర్‌బీఐ



న్యూఢిల్లీ : స్థూల జీడిపిలో రాష్ట్రాల విత్త లోటు తక్కువగానే ఉందని ఆర్‌బిఐ తెలిపింది. ఆర్థికంగా రాష్ట్రాలు బలపడుతున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. 2021-22, 2022-23లో జీడీపీలో విత్త లోటు 2.8 శాతంగా చోటు చేసుకుందని పేర్కొంది. రాష్ట్రాలు తమ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధిని కొనసాగిస్తున్నాయని తెలిపింది. వరుసగా రెండో ఏడాది బడ్జెట్ అంచనాల కంటే తక్కువగా ఉందని తెలిపింది. 'స్టేట్ ఫైనాన్స్: ఎ స్టడీ ఆఫ్ బడ్జెట్స్ ఆఫ్ 2023-24' అనే శీర్షికతో రూపొందించిన నివేదిక ప్రకారం.. బలమైన మూలధన వ్యయాలను కొనసాగించడం ద్వారా ప్రధానంగా రెవెన్యూ లోటును తగ్గించడం ద్వారా లోటు తగ్గింపును సాధించగలిగామని ఆర్‌బిఐ పేర్కొంది. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) అమలు వల్ల రాష్ట్రాలకు పన్నుల భారం పెరిగిందని పేర్కొంది. ద్వితీయార్థంలో పన్ను రాబడి మెరుగుపడుతుందన్న అంచనాలతో రాష్ట్రాల ఆర్థిక దక్పథం అనుకూలంగానే ఉందని తెలిపింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో, లాక్‌డౌన్ చర్యల సడలింపు, ఆ తర్వాత వచ్చిన మార్పుల కారణంగా రాష్ట్రాల ఆదాయ వసూళ్లలో గణనీయమైన పెరుగుదల ఉందని ఆర్‌బిఐ పేర్కొంది.

టాటా ఎఐజి నుంచి 'హెల్త్ సూపర్ ఛార్జ్' పాలసీ

ముంబయి : సాధారణ బీమా ప్రొవైడర్లలో ఒకటైన టాటా ఎఐజి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కొత్తగా 5 రెట్ల బీమా రక్షణతో హెల్త్ సూపర్ చార్జ్ పాలసీని ఆవిష్కరించినట్టు ప్రకటించింది. దీన్ని అన్ని ప్రాంతాల వర్గాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్లు పేర్కొంది. టాటా ఎఐజి దేశవ్యాప్తంగా 10వేల హాస్పిటల్స్ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నట్టు తెలిపింది. "జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ పాలసీ మా వినియోగ దారులకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించడంలో మా అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది." అని ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సంతోష్ పూరి పేర్కొన్నారు.

కాగ్నిజెంట్ ఆస్తుల అమ్మకాలు..!

హైదరాబాద్: దిగ్గజ టెక్ కంపెనీల్లో ఒకటైన కాగ్నిజెంట్ పొదుపు చర్యల్లో భాగంగా ఆస్తులను విక్రయించాలని భావిస్తోందని సమాచారం. హైదరాబాద్, చెన్నయ్‌లోని తన ఆస్తులను అమ్మడానికి సిద్ధంగా ఉందని రిపోర్ట్‌లు వస్తున్నాయి. వచ్చే రెండేళ్లలో రూ.3,300 కోట్లను ఆదా చేసే లక్ష్యంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. హైదరాబాద్ గచ్చిబౌలిలోని 10 ఎకరాల క్యాంపస్‌ను, చెన్నయ్ సిరుసేరిలోని 14 ఎకరాల క్యాంపస్‌ను విక్రయించాలని కాగ్నిజెంట్ యోచిస్తున్నట్లు సమాచారం.

ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ రాజీనామా..

న్యూఢిల్లీ : ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నీలంజన్‌రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన 2018 నుంచి తన పదవిలో కొనసాగుతున్నారు. తన వ్యక్తిగత కారణాల వల్ల పదవీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇదే విషయమై ఆ కంపెనీ రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. కాగా.. ఆయన 2024 మార్చి 31 వరకు సిఎఫ్ఒగా కొనసాగనున్నారు.

ఇంటెగ్రా ఎసెన్షియాకు రూ.18 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ : ఎఫ్ఎంసీజీ కంపెనీ ఇంటెగ్రా ఎసెన్షియా లిమిటెడ్‌కు తాజాగా రూ.18 కోట్ల ఆర్డర్ లభించినట్లు ఆ సంస్థ తెలిపింది. తద్వారా కన్సాలిడేటెడ్ ఆర్డర్ బుక్‌ను రూ. 30 కోట్లకు చేరినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్డర్ బుక్, సోర్సింగ్, సరఫరాల ప్రణాళిక ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25 శాతం వృద్ధిని సాధించనున్నట్లు ఆ సంస్థ విశ్వాసం వ్యక్తం చేసింది.

Integra Essentia Limited

చెరుకు రైతులకు 'తీపి' అందేనా?

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో ఆశలు

చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ఎదురుచూపు

- తుప్పు పడుతున్న యంత్రాలు
- అధికారంలోకి రాగానే తెరుస్తామన్న రాహుల్‌గాంధీ



నవతెలంగాణ-మల్లాపూర్

కొత్త ప్రభుత్వంలో తీపి కబురు కోసం చెరుకు రైతులకు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఖ్యాతి పొందిన తెలంగాణ నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ చక్కెర కర్మాగారం పునరుద్ధరణపై కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల ప్రచారంలో ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. అంతేకాకుండా వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లో కూడా చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణపై హామీ ఇచ్చారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో రైతుల చిగురించాయి.

ఎన్‌డీఎస్‌ఎల్ మూతపడి 8ఏండ్లు

రాష్ట్రంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్న నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) కర్మాగారం మూతపడి ఈనెల 22తో 8 ఏండ్లు పూర్తవుతోంది. 2015 డిసెంబర్ 22న అర్ధరాత్రి ఎన్‌డీఎస్‌ఎల్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటన చేసిన మరుసటి రోజు గేటుకు సీల్ వేశారు. నాటి నుంచి కర్మాగారాలు తెరుచుకోలేదు. చెరుకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగుల జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయి. ముత్యంపేట చక్కెర కర్మాగారంలో సుమారు 36 ఏండ్లపాటు నడిచింది. ఎన్‌డీఎస్‌ఎల్ చక్కెర కర్మాగారం పరిధిలో సుమారు 500 మంది పర్మినెంట్ సీజనల్ కాంట్రాక్ట్ వర్కర్లు పని చేసేవారు. ఇందులో సుమారు 300 మంది సీజనల్, 200 మంది కాంట్రాక్ట్ వర్కర్లు ఉండేవారు. 150 లారీల చెరుకును కర్మాగారానికి చేర్చేవారు. మహారాష్ట్రతో పాటు మెదక్, నల్లగొండ జిల్లాలకు చెందిన సుమారు 3000 మంది ఇతర కార్మికులు ముత్యంపేట చక్కెర కర్మాగార పరిధిలో పని చేసేవారు. ప్రతి ఏటా కోట్లలో లావాదేవీలు జరుగుతుండేది. పరిశ్రమ మూత పడటంతో వారంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు.

కర్మాగారాలకు అంకురార్పణ..

1931లో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంతో నిజామాబాద్ జిల్లాలో పంటల సాగుకు అంకురార్పణ జరిగింది. వరితో పాటు చెరకు సాగును ప్రోత్సహించాలని భావించిన నిజాం 1938లో బోధన్‌లో నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని నిర్మించారు. ఆ తర్వాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట, మెదక్ జిల్లా మంబోజిపల్లిలో కొత్త యూనిట్లను ప్రారంభించారు. అప్పటి నుంచి 2015 వరకు ఆ ఫ్యాక్టరీలు నిర్విరామంగా కొనసాగాయి. లే ఆఫ్ విధించాక రూ.కోట్ల విలువ చేసే యంత్రాలు నిర్వహణ లేక తుప్పు పడుతున్నాయి. కంపెనీలో 49శాతం వాటాను కలిగి ఉన్న ప్రభుత్వంగానీ, 51 శాతం వాటా కలిగి ఉన్న డెల్టా యాజమాన్యంగానీ దీనిని పట్టించుకోవడం లేదు. ఎన్‌డీఎస్‌ఎల్ మూసివేతతో చెరుకు రైతులే కాకుండా ప్రత్యక్షంగా పరోక్షంగా కర్మాగారంపై ఆధారపడిన కుటుంబాలెన్నో ఉపాధి లేక కష్టాలు పడుతున్నాయి.

ముచ్చటగా మూడు కమిటీలు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన ప్రయివేటీకరణపై పలు ఆరోపణలు రావడంతో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం 2005లో దేవాదాయశాఖ మంత్రి, బుగ్గారం శాసన సభ్యుడు జువ్వాడి రత్నాకర్‌రావు చైర్మన్‌గా ఎన్‌డీఎస్‌ఎల్‌పై శాసన సభా సంఘం ఏర్పాటు చేసి నివేదిక కోరింది. 2013లో అప్పటి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సునీతా లక్ష్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో ఎన్‌డీఎస్‌ఎల్ నిర్వహణపై కమిటీ వేసి సిఫార్సులు ఇవ్వాలని కోరింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ 2015లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఎన్‌డీఎస్‌ఎల్‌పై మళ్లీ కమిటీ వేశారు. ఫ్యాక్టరీల నిర్వహణపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కర్మాగారాలను సహకార పద్ధతిలో నడిపిస్తామని శాసనసభలో కేసీఆర్ ప్రకటించినా, ముందుకు సాగలేదు. ఎనిమిదేండ్లుగా సమస్య అలాగే ఉండిపోయింది. తాజాగా కాంగ్రెస్ సర్కారు ఏర్పడటంతో ఫ్యాక్టరీలు తెరచుకుంటాయని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

కర్మాగారాన్ని ప్రారంభిస్తే రైతులకు లాభం..



ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ప్రారంభిస్తే రైతులకు లాభం చేకూరుతుంది. ఇక్కడ పండిన పంటను ఇతర జిల్లాల్లో ప్రయివేటుగా అమ్మడం ద్వారా రైతులకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం త్వరలోనే కర్మాగారాన్ని పున్నప్రారంభిస్తుందని ఎదురు చూస్తున్నాం.

నృపనంది లింబారెడ్డి- చెరుకు రైతు

చక్కెర కర్మాగారాలపై త్వరలో కమిటీ



చక్కెర కర్మాగారాలపై రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన త్వరలోనే మంచి నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాం.. ఇటీవల పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడగా సానుకూలం గా స్పందించారు. ప్రత్యేక కమిటీ వేసి చక్కెర కర్మాగారాల స్థితిగతులపై ప్రభుత్వం ప్రత్యేక నివేదిక తయారు చేస్తుందని చెప్పారు. గతంలో చక్కెర కర్మాగారంపై ఎన్నో పోరాటాలు చేశా. చక్కెర కర్మాగారం ప్రారంభమైతే ఈ ప్రాంత రైతులు అభివృద్ధి చెందుతారు.

కిసాన్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యనారాయణ రెడ్డి

కదులుతున్న రైలులోనే అఘాయిత్యం

భోపాల్ : కదులుతున్న రైలులో మహిళపై లైంగికదాడికి పాల్పడిన దారుణం మధ్యప్రదేశ్‌లో జరిగింది. అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు సుమారు 3 గంటలపాటు రైలు కోచ్‌లోనే దాక్కుని ఉన్నాడు. చివరకు రైల్వే మెకానిక్ బృందం తలుపు తెరవడంతో నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడ్ని ఉత్తరప్రదేశ్‌కు చెందిన కమలేష్ కుష్వాహగా గుర్తించారు. ఈ సంఘటన మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. జిల్లాలోని ఉంచెరాకు వెళ్లేందుకు కట్నీ రైల్వే స్టేషన్‌లో 30 ఏండ్ల మహిళ ఒక ప్యాసింజర్ రైలు ఎక్కింది. అయితే ఈ ప్యాసింజర్ రైలు పట్కారియా స్టేషన్‌లో నిలిచిపోయింది. దీంతో వాష్‌రూమ్ అవసరాల కోసం ఆ మహిళ అదే స్టేషన్ లో వేరొక ప్లాట్‌ఫామ్‌పై ఆగి ఉన్న ఒక స్పెషల్ ట్రెయిన్‌లోని ఏసీ కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించింది. ఈ మహిళను వెంబడిస్తూ వస్తున్న కమలేష్ కుష్వాహ కూడా ఆ ఏసీ కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి డోర్ లాక్ చేశాడు. ఆ కంపార్ట్‌మెంట్ అంతా ఖాళీగా ఉంది. ఆ స్పెషల్ ట్రెయిన్ కదలడం ప్రారంభించగానే మహిళపై దారుణానికి ఒడిగట్టా డు. ఈ క్రమంలో మహిళను కొట్టి, చిత్ర హింసలకు గురిచేశాడు. చంపేస్తానని బెదిరించి మరీ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ రైలు సత్నా స్టేషన్‌కు చేరుకోగానే బాధిత మహిళ కిందకు దిగి ఒక ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌కు తనపై జరిగిన దారుణాన్ని తెలిపింది. సిబ్బంది కోచ్ వద్దకు వచ్చే సరికి రైలు బయలుదేరి వెళ్లిపోయింది. మరోవైపు ఆర్‌పీఎఫ్ సిబ్బంది రావడం చూసిన కమలేష్ కోచ్ తలుపులకు తాళం వేసి అందులో దాక్కున్నాడు. దీంతో స్టేసన్ మాస్టర్ తరువాత స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్‌పిఎఫ్ సిబ్బంది కూడా రోడ్డు మార్గంలో బయలుదేరింది. రైలు రేవా స్టేషన్‌కు చేరుకున్న తరువాత అక్కడి మెకానిక్ బృందం సహాయంతో తలుపుల్ని తెరిచారు. దీంతో కమలేష్‌ను అరెస్టు చేసి పోలీసులు కట్నికి తీసుకుని వచ్చారు.

పార్లమెంట్‌లో సీఈసీ, ఈసీ నియామక బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ ఈ బిల్లు సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకం కాదని, ఇది అత్యున్నత న్యాయస్థానం అందించిన సూచనలపై ఆధారపడి ఉందని అన్నారు.

బిల్లులో ఏముంది?

ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కేంద్ర మంత్రితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్లను నిర్ణయించాలని బిల్లు నిర్దేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర మంత్రిని పెట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్‌లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానమైన జీతం, ప్రయోజనాలు లభిస్తాయని ప్రభుత్వం బిల్లులో సవరణ తెచ్చింది. తొలిసారిగా ప్రవేశపెట్టిన బిల్లులో కేబినెట్ సెక్రటరీకి సమానంగా జీతం ఇవ్వాలని నిబంధన పెట్టారు. ఇది ఎన్నికల కమిషనర్ల స్థాయిని తగ్గించినట్లేనన్న విమర్శలు తలెత్తినప్పుడు ప్రభుత్వమే సుప్రీంకోర్టు న్యాయమూర్తికి జీతం చెల్లించేలా సవరణ తీసుకొచ్చింది.

ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్లు తమ విధులను నిర్వర్తిస్తున్నప్పుడు అన్ని క్రిమినల్ , సివిల్ దావాల నుంచి రక్షణను కూడా బిల్లు అందిస్తుంది. జాబితాను సిద్ధం చేయాల్సిన సెర్చ్ కమిటీని కూడా మార్చారు. మొదటి ప్రతిపాదిత బిల్లులో క్యాబినెట్ కార్యదర్శి, మరో ఇద్దరు సీనియర్ అధికారులతో కూడిన సెర్చ్ కమిటీ ఎన్నికల కమిషనర్ పదవికి పరిగణించదగిన వారి జాబితాను సిద్ధం చేయాల్సి ఉంది. సెర్చ్ కమిటీ ఐదుగురిని సిఫారసు చేయవచ్చు. అయితే క్యాబినెట్ సెక్రటరీ స్థానంలో న్యాయశాఖ మంత్రిని సెర్చ్ కమిటీకి అధిపతిగా నియమిస్తూ ప్రభుత్వం సవరణ తీసుకొచ్చింది.

బిల్లుపై ప్రతిపక్షాల చర్చ..

కాంగ్రెస్ ఎంపీ ఐమీ యాజ్ఞిక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘంపై ఎవరిది అధికారమని సూటిగా ప్రశ్నించారు. ఈ బిల్లు మన ప్రజాస్వామ్య పునాదిని కదిలించేలా ఉందని టీఎంసీ ఎంపీ జవహర్ సిర్కార్ అన్నారు. "ప్రజాస్వామ్యం స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలపై ఆధారపడి ఉంది" అని అన్నారు. బిల్లులోని క్లాజ్ 8 మరింత ప్రమాదకరమని అన్నారు. "(ఇది) ఎవరినైనా చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్‌లుగా నియమించవచ్చని చెబుతోంది. మీరు ప్రమాదకరమైన దృష్టాంతాన్ని తెరుస్తు న్నారు!" అంటూ మోడీ సర్కార్ పై విమర్శలు గుప్పించారు. ఈ బిల్లు రిగ్గింగ్‌ను చట్టబద్ధం చేయడానికి దారి తీస్తుందని అన్నారు.

సుప్రీంకోర్టు నిర్ణయాలను బీజేపీ ప్రభుత్వం గౌరవించడం లేదని అని ఆప్ ఎంపి రాఘవ్ చద్దా ఆరోపించారు. "ఈ బిల్లు దేశంలో మిగిలి ఉన్న కొన్ని స్వతంత్ర సంస్థల్లో ఒకటైన ఎన్నికల కమిషన్‌ను నాశనం చేస్తుంది. తద్వారా దేశం నుంచి స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలను తరిమికొడుతుంది" అని చద్దా అన్నారు. ఈ బిల్లు , భారత ప్రధాన న్యాయమూర్తిని అగౌరవపరిచేదిగా ఉందని కూడా పేర్కొన్నారు.

లోక్‌సభలో రెండు బిల్లులు ఆమోదం

కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్మూ కాశ్మీర్, పుదుచ్చేరి అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్‌ను లోక్‌సభ ఆమోదించింది. లోక్‌సభ కేంద్రపాలిత ప్రాంతాల (సవరణ) బిల్లు, జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (రెండవ సవరణ) బిల్లుని మూజువాణి ఓటుతో ఆమోదించింది. అలాగే 2023-2024కి మొదటి బ్యాచ్ - గ్రాంట్స్ కోసం అనుబంధ డిమాండ్లను కూడా లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అదేవిధంగా, కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి నిర్దిష్ట మొత్తాల చెల్లింపులు, 2020-2021కి అదనపు గ్రాంట్ల డిమాండ్‌లను ముజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదించింది.

లోక్‌సభలో మూడు క్రిమినల్ చట్టాల సవరణ బిల్లులు

మూడు క్రిమినల్ లా బిల్లులను మార్పులు చేసిన తరువాత మంగళవారం తిరిగి లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సవరణ బిల్లుల్ని ప్రవేశపెట్టారు. ఆగస్టులో లోక్‌సభలో ప్రవేశపెట్టిన మూడు కొత్త క్రిమినల్ లా బిల్లులను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బిల్లులు ఆగస్టు 18న హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపారు. పార్లమెంటరీ ప్యానెల్ చేసిన సిఫారసులలో కొన్నింటిని చేర్చడం కోసం ఇప్పుడు బిల్లులను ఉపసంహరించుకున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు తెలిపారు. అయితే పునర్నిర్మించిన బిల్లులను మంగళవారం ప్రవేశపెట్టారు.

ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఎ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ)లను మార్చుతూ భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) బిల్లు, భారతీయ సాక్ష్యా అధినియం (బిఎస్) బిల్లు, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) బిల్లుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ "మూడు బిల్లులలో ప్రధాన మార్పులు 3-4 ఉపవిభాగాలలో ఉన్నాయి. ఇతర మార్పులు ప్రధానంగా వ్యాకరణ స్వభావాన్ని కలిగి ఉంటాయి. బిల్లుల మార్పులపై గురువారం 12 గంటల పాటు చర్చ జరుగుతుంది. అప్పుడు సమాధానం చెబుతాం" అని ఆయన పునరుద్ఘాటించారు. బిల్లులను కూలంకషంగా అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

ఇక ప్రక్షాళనే...

(మొదటిపేజీ తరువాయి)

నిర్వర్తించే వాతావరణం లేదని పేర్కొన్నారు. 'కొత్త కమిషన్ ఆధ్వర్యంలోనే నియామకాలు జరగాలన్న ఉద్యోగార్థుల ఆకాంక్షలను గౌరవిస్తున్నాను. ఇప్పుడే కాదు. తన విద్యార్థి జీవిత కాలం నుంచి కూడా తాను నిరుద్యోగుల పక్షమే. ఇక ముందు కూడా నిరుద్యోగుల పక్షమే. మీ అందరి ఆశలు, ఆకాంక్షలు వీలైనంత త్వరగా నెరవేరాలని కోరుకుంటున్నాను. ప్రశ్నాపత్రం లీకేజీ వంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు మీరు ఎంత మానసిక ఆందోళనకు గురయ్యారో అర్థం చేసుకోగలను.

మేము కూడా తీవ్ర మానసిక క్షోభను అనుభవించాం. ఎన్నో నిద్రలేని రాత్రులను గడిపాం. తీవ్ర అనారోగ్యాలకు గురయ్యాం. నేను ఎల్లప్పుడూ మీ పక్షమే. ఎక్కడ ఉన్నా ఉద్యోగార్థులకు మేలు జరగాలనే కోరుకుంటాను. మీ పక్షాన నిలిచి చేదోడు వాదోడు అవుతాను. మీకు మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నా'అని సత్యనారాయణ లేఖలో పేర్కొన్నారు.

జనార్ధన్‌రెడ్డి రాజీనామాను ఆమోదించని గవర్నర్

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ జనార్ధన్‌రెడ్డి రాజీనామాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించలేదు. ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యులెవరో తేలకుండా, నిరుద్యోగులకు న్యాయం జరగకుండానే ఆయన రాజీనామాను ఎలా ఆమోదించాలని ఆమె ప్రశ్నించినట్టు తెలిసింది. రాజీనామాపై సీఎస్‌కు లేఖ రాసి కొత్త ప్రభుత్వ అభిప్రాయాన్ని, న్యాయనిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే అవకాశమున్నది. లీకేజీలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించినట్టు తెలిసింది. లీకేజీ సమయంలోనే టీఎస్‌పీఎస్సీ పాలకమండలికి రద్దు చేయాలంటూ రాష్ట్రపతికి గవర్నర్ లేఖ రాసినట్టు సమాచారం.

దాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ)కి రాష్ట్రపతి భవన్ సిఫారసు చేసినట్టు తెలిసింది. నాటి రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం చెప్పాలని కోరుతూ లేఖ రాశారు. అయితే ఆ ప్రభుత్వం స్పందించలేదని సమాచారం. కోర్టు కేసులు, గతంలో తాను చేసిన సూచన పెండింగ్‌లో ఉండగానే జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేయడంతో గవర్నర్ అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బుధవారం పుదుచ్చేరి నుంచి తమిళిసై సౌందరరాజన్ హైదరాబాద్‌కు వస్తున్నారు. ఆ తర్వాతే టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ రాజీనామాపై నిర్ణయం తీసుకునే అవకాశమున్నది.

దయచేసి ఆస్పత్రికి రావొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతున్నాయి. రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ మంగళవారం యశోదా ఆస్పత్రికి వెళ్లారు. మాజీ సీఎంను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మేఘాలయ సీఎం కోన్రాడ్ సంగ్మా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫోన్ చేసి, కేసీఆర్ ఆరోగ్యం గురించి వాకబు చేశారు. యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ కూడా మరోసారి కేటీఆర్‌కు ఫోన్ చేసి, కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహా, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే లాస్య నందిత, ప్రముఖ క్రైస్తవ మత బోధకుడు కేఏ పాల్, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, టీవీ 9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్, పలువురు జర్నలిస్టులు కేసీఆర్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించిన వేద పండితులు ముంజేతికి కంకణాన్ని కట్టారు.

పేదల గుడిసెలపై దాష్టీకం

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు 10 మందిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది భూ అక్రమణదారులు 255/1 సర్వేనెంబర్ గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారు. ఆ భూమిలో గతేడాది సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. కానీ గత ప్రభుత్వంలోని కొంత మంది అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి 17సార్లు ఆ గుడిసెలను తొలగించి పార్టీ నాయకులు, మహిళలపై అనేక అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారు. ఆ భూమిని కబ్జాచేసి అమ్ముకోవాలని ప్రయత్నం చేశారు. అయినా వెనక్కి తగ్గని పేదలు.. మళ్లీ గుడిసెలు వేసుకున్నారు. కాగా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు ఇండ్ల స్థలాలు దక్కుతాయని పేదల్లో భరోసా ఏర్పడింది. అంతలోనే మళ్ళీ రెవెన్యూ, మున్సిపాలిటీ, ఫారెస్ట్, పోలీస్ అధికారులు జేసీబీ, బుల్డోజర్లతో పేదలు వేసుకున్న గుడిసెలపై దాడి చేసి గుడిసెలను కూల్చివేశారు. దాంతో ఆగ్రహించిన గుడిసె వాసులు, మహిళలు సీపీఐ(ఎం) నాయకులు కూల్చివేతను అడ్డుకొని గంటసేపు నిలువరించారు. దాంతో అధికారులకు, గుడిసె వాసులకు మధ్య వాగ్వివాదం జరిగి ఉద్రిక్తత నెలకొంది. గుడిసె వాసులు అధికారులకు మధ్య వాదోపవాదాలు, నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. దాంతో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్, నాయకులు బానోతు వెంకన్న, బూర్గుల లక్ష్మణ్‌తో పాటు మరో 8 మంది మహిళలు, పురుషులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అధికార యంత్రాంగం ఏకపక్షంగా పేదల గుడిసెలను పూర్తిగా తొలగించి అక్రమ కేసులు పెట్టి వారిని భూమి పైకి రాకుండా చేయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నది, గుడిసెలు తొలగించి భూ కబ్జాదారులకు అప్పగించాలని చూస్తున్నారని గుడిసెవాసులు ఆరోపించారు. ఎన్నిసార్లు నిరుపేదల గుడిసెలను తొలిగించినా ఎన్ని కుట్ర కేసులు పెట్టినా తమ పోరాటం ఆగదని, మళ్ళీ మళ్ళీ గుడిసె వాసుల పక్షాన నిలబడి భూమి దక్కేవారకు పోరాటం కొనసాగిస్తామని సీపీఐ(ఎం) నాయకులు స్పష్టంచేశారు. గుడిసె వాసులు రెండు గంటలపాటు అధికార యంత్రానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు.

ఆర్థికాభివృద్ధి ప్రాంతంగా మూసీ

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మూసీ పరీవాహక ప్రాంతం పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. నది వెంట బ్రిడ్జిలు, కమర్షియల్, షాపింగ్ కాంప్లెక్సులు, అమ్యూజ్ మెంట్ పార్కులు, హాకర్ జోన్ లు, పాత్-వేలను ప్రభుత్వ ప్రయివేటు పార్ట్నర్ షిప్ విధానంలో నిర్మించే విధంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. మూసీ నదిలో కాలుష్యాన్ని తగ్గించి, మురుగు నీరు ప్రవహించకుండా అవసరమైన ప్రాంతాల్లో నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

- **ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో 20మందికి స్వల్పగాయాలు**

నవతెలంగాణ - దామెర

వరంగల్ జిల్లా దామెర మండలం ఒగ్లపూర్ సమీపంలో టీఎస్ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో సుమారు 40 మందికి పైగా ప్రయాణికులు బస్సులో ఉన్నారు. ఇద్దరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా, మరో 20మందికి పైగా స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు అదుపు తప్పి ఒగ్లపూర్ సమీపంలోని పవర్ గ్రిడ్ వద్ద పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న గాయాలవ్వగా.. ఎంజీఎంకి తరలించి చికిత్స అందిస్తున్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె

- పోస్టల్ కార్యాలయాల ఎదుట నిరసన
- నిలిచిన లావాదేవీలు, బట్వాడా

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యల పరిష్కారం కోసం తపాలా ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. ఆసరా పంపిణీ, పోస్టల్ లావాదేవీలు, ఉత్తరాల బట్వాడా నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో స్థానిక పోస్టల్ కార్యాలయంలో ఉద్యోగులు నినాదాలు చేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని సబ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె నిర్వహించారు. రామన్నపేట మండల కేంద్రంలో సబ్‌పోస్ట్ ఆఫీస్ వద్ద రామన్నపేట ఎస్‌ఓ పరిధిలోని గ్రామీణ తపాల ఉద్యోగులు సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.యాదయ్య మాట్లాడారు.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని తపాలాశాఖ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని తపాల కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆదిలాబాద్ డివిజన్ కన్వీనర్ జాదవ్ కిరణ్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. జిల్లా కేంద్రంలో ప్రధాన పోస్టాఫీసు ఎదుట దీక్షలో కూర్చున్నారు. సమ్మెలో చైర్మెన్ గట్టు శ్రీనివాస్, జీడీఎస్బీ కైలాస్‌గౌడ్, మహేష్, దశరథ్, గంగన్న, శ్రీకాంత్, రమేష్, సుశీల పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని రేచిని, మాదారం, తాండూర్ బీపీఎంలు, జీడీఎస్‌లు సమ్మెకు దిగారు. ఖమ్మం జిల్లా కల్లూరు, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో తపాలా శాఖ ఉద్యోగులు విధులు బహిష్కరించి పోస్టు ఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. అశ్వారావుపేటలోనూ ఆందోళన చేశారు.

రైతుకు దన్నుగా నిలవాలి

వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు

- పామాయిల్ సాగును అగ్రస్థానంలో నిలుపుతామని వ్యాఖ్య



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతాంగానికి దన్నుగా ఉండేలా వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆయా శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో ఆ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల పని తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. ఈ రంగంలో అనేక సంస్కరణలు చేపట్టేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తోందని తెలిపారు. ఆ శాఖల పూర్తి సమాచారంతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలనీ ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించాలని సూచించారు. ఉద్యానశాఖకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూముల వివరాలు సమర్పించాలన్నారు. వ్యవసాయ పరిధిలోని అన్ని కార్పొరేషన్ల ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో అన్ని అంశాలపై చర్చిద్దామన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి పనుల కోసం స్థానికంగా ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలోని 197 మార్కెట్ యార్డుల స్థితిగతులు, వాటి పనితీరు, ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర వివరాలు అందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశిం చారు. వ్యవసాయ మార్కె టింగ్ శాఖల్లో సాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై వీడియో రూపంలో సమగ్ర నివే దిక అందిం చాలని సూచిం చారు. ఇప్పటికే మంజూరైన పనులు, మొదలు కాని పనుల వివరాలు జత చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలతో పోల్చి మన రాష్ట్రంలో మార్కెటింగ్ సమస్యలు, క్రయవిక్రయాలు, ధరలు తదితర అంశాలపై పూర్తి వివరాలు సమర్పించాలని కోరారు. ఆరుగాలం కష్టపడి రైతు పండించిన పంటల ఉత్పత్తులను అమ్ముకునే మార్కెట్ యార్డులను వారికి దన్నుగా ఉండేలా తీర్దిదిద్దాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో సమస్యల్ని ఎప్పటికప్పుడు మార్కెటింగ్ అధికారులు పర్యవేక్షించాలని..ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వర్షాలు, ఇతర ఇబ్బందులతో ఎక్కాడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకోసం ఇతర రాష్ట్రాల్లో గొప్పగా పనితీరు కనబరుస్తున్న మార్కెట్లను మోడల్‌గా తీసుకుని ఇక్కడ ఒకటి రెండు మార్కెట్ యార్డుల్ని తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెటింగ్ శాఖలో ఎవరైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారి వివరాలు ఎప్పటికప్పుడు అందించేలా ఉన్నతాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల కార్యదర్శులతో త్వరలోనే టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానన్నారు. రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా మార్కెట్లు బాధ్యతతో పనిచేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులు నష్టాలు మూటగట్టుకోకుండా, యార్డుల్లో పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరాలో ప్రయివేటు కంపెనీల దందాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.

పామాయిల్ సాగుపై ఫోకస్

పామాయిల్ సాగు లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని తుమ్మల ఈ సందర్భంగా చెప్పారు. ఆ వాటి వల్ల రైతులకు నష్టం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులే తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేసి ఇక్కడ అమలయ్యేలా చొరవ తీసుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ఆయిల్ పామ్ విత్తన కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేలా ఉద్యానశాఖ పనితీరు ఉండాలని కోరారు. అశ్వారావుపేటలో 400 ఎకరాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయసాఖ డిప్యూటీ సెక్రటరీ సత్యశారద, మార్కెటింగ్ ఎండీ లక్ష్మీభాయి, ఆయిల్ ఫెడ్ ఎండీ సుధాకర్ రెడ్డితోపాటు ఆయా శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిధులివ్వండి
ప్రజావాణిలో సర్పంచుల సంఘం వినతి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రెండేండ్లుగా నిధులు రావట్లేదనీ, దీనివల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారంనాడిక్కడి మహాత్మా జ్యోతిభా పూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆ సంఘం కన్వీనర్ సుర్వి యాదయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి కొలను శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనీ, డంపింగ్ యార్డులు, స్మశానవాటికలు, నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ నిధుల్ని త్వరగా విడుదల చేయాలని కోరారు. కరోనా వల్ల రెండేండ్లు సర్పంచులు కాలం వృధా అయ్యిందనీ, అందువల్ల వారి పాలనా కాలం గడువును మరో ఏడాది పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థికమంత్రికి ఇంధనశాఖ ఉన్నతాధికారుల అభినందనలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖా మంత్రి మల్లు భట్టి విక్రమార్కను మంగళవారం పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి ఛాంబర్‌లో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మతోపాటు ఆశాఖ ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి మంత్రి భట్టి విక్రమార్కకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ రూపొందించిన 'తెలంగాణా స్టేట్ ఎట్ ఏ గ్లాన్స్' అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధరబాబును కలిసిన టీఎస్‌ఈఈయూ నేతలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (327) నేతలు మంగళవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధరబాబును కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ శ్రీధర్, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్ ప్రభాకర్, టీఎస్-ఎస్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి కే భూపాల్‌రెడ్డి మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల సమస్యలు, ఐటీ ప్రాధాన్యతా అంశాలపై వారు చర్చించారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఆర్టిజన్ కార్మికుల సమస్యలు చేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వాటి పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు.

సీతక్కా..మీరైనా సమస్యల్ని పరిష్కరించండి

మంత్రికి ఐకేపీ వీఓఏల వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'గత ప్రభుత్వం పదేండ్లు వెట్టిచాకిరీ చేయించుకుని సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సీతక్కా..మీరైనా మా సమస్యల్ని పరిష్కరించండి' అని మంత్రి దనసరి అనుసూయ(సీతక్క)కు ఐకేపీ వీఓఏలు విన్నవించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో సీతక్కకు తెలంగాణ ఐకేపీ వీఓఏ సంఘం(సీఐటీయూ) నేతలు వినతిపత్రం అందజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్వీ.రమ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నగేశ్, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ముస్తఫా, లక్ష్మారెడ్డి, సులోచన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మంత్రి సీతక్క దృష్టికి పలు సమస్యల్ని తీసుకెళ్లారు. తాము 20 ఏండ్ల నుంచి సెర్ప్ సంస్థలో వీఓఏలుగా పనిచేస్తున్నామనీ, గ్రామాల్లో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి వారికి తోడ్పాటునందిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో తాము కీలకపాత్ర పోషిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా తమతో వెట్టి చాకిరి చేయించుకుని సమస్యల్ని పరిష్కరించలేదన్నారు. తమ సమస్యల గురించి తెలిసిన మీరు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీసవేతనంతో ఉద్యోగ భద్రత కల్పించాలనీ, రూ.10 లక్షల ఆరోగ్యబీమా కల్పించాలని కోరారు.

చేనేత, పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలి

- సంక్షేమ చర్యలు చేపట్టాలి
- రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలివ్వాలి
- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్



నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

చేనేత సహకార వ్యవస్థ నిర్వీర్యమై ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న చేనేత, పవర్‌లూమ్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నియంత పాలన అంతరించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంపై ముఖ్యమంత్రికి, మంత్రివర్గానికి తెలంగాణ చేనేత కార్మిక సంఘం అభినందనలు తెలియజేస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా.. నిధులు కేటాయించకుండా ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. చేనేత, పవర్‌లూమ్ వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్ వద్ద పేరుకపోయిన బట్టల నిలువలను ప్రభుత్వమే కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని అన్నారు. చేనేత బీమాకు అర్హత వయస్సు సడలించి అందరికీ వర్తింపజేయాలని, సిరిసిల్ల తరహాలో రాష్ట్రమంతగా చేనేత, పవర్ లూమ్ కార్మికులకు వర్క్ షెడ్లు, ఇంటి నిర్మాణానికి ప్రత్యేక కోటా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జియో ట్యాగ్ యాప్‌ను రద్దు చేసి రాష్ట్రంలోని అన్ని మగ్గాలకు, అనుబంధ వృత్తులకు జియో ట్యాగ్ వేసి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. చేనేత రంగానికి బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించాలని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ సిబ్బందికి యూనిఫారాలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు చేనేత వస్త్రాలను బహూకరించి చేనేత పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. చేనేత మిత్రకు ఇస్తున్న నగదు బదిలీని పెంచాలని కోరారు.

చేనేత సహకార సంఘాల, చేనేత కార్మికుల అన్ని రకాల చేనేత రుణాలు మాఫీ చేసి 80 శాతం సబ్సిడీతో తిరిగి రుణాలు ఇవ్వాలని, జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

త్వరలో ముఖ్యమంత్రిని కలిసి చేనేత రంగం సమస్యలపై విన్నవించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కందగట్ల గణేష్, నాయకులు ఏలే శ్రీనివాస్, గడ్డం దశరథ, జల్ల దేవదానం, నల్ల రాంబాబు, రాపోలు వెంకన్న, ఆలుగొండ మధు, వనం రాములు, గంజి నాగరాజు, సూరపల్లి భద్రయ్య తదితరులు ఉన్నారు.

మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్‌కు పనిభద్రత కల్పించాలి

- సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ ప్రొటెక్ట్ యాక్టు-1976ను పునరుద్ధరించాలి
- మందులు, మెడికల్ పరికరాలపై జీఎస్టీ ఎత్తేయాలి
- టీఎమ్ఎస్ఆర్‌యూ ధర్నాలో వక్తలు
- లేబర్ కమిషనర్ ఎమ్ నదీమ్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ ప్రొటెక్ట్ యాక్టు -1976ను పునరుద్ధరించి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్‌లకు పనిభద్రత కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని అంజయ్యభవన్ (రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం) ఎదుట తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్(టీఎమ్ఎస్‌ఆర్‌యూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఎమ్‌డీ నదీమ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ధర్నానుద్దేశించి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, టీఎమ్ఎస్ఆర్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భానుకిరణ్, రాజ్‌భట్ మాట్లాడారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ రిప్రజెంటేటీవ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎమ్ఆర్ఏఐ) ఆధ్వర్యంలో ఈ నెల 20న దేశవ్యాప్తంగా సమ్మె చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెడికల్ రిప్రజెంటేటీవ్స్‌ను అనుమతించకపోవడం సరిగాదన్నారు. రాష్ట్రంలో ఈ నిబంధనను ఎత్తేయాలని కోరారు. మందులు, మెడికల్ పరికరాలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. మందుల ధరలను తగ్గించాలని కోరారు. ఫార్మా కంపెనీల నుంచి దక్కాల్సిన సౌకర్యాలను మెడికల్ రిప్స్‌కు కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాక్టర్ల సలహాలు, సూచనలతో వాడాల్సిన మెడిసిన్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి వాడటం రోగుల ప్రాణాలకే ప్రమాదకరమని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో అమ్మకాలకు అనుమతులివ్వడం వల్ల రాష్ట్రంలో వేలాది మంది మెడికల్ షాపుల నిర్వాహకులు, మెడికల్ రిప్రజెంటేటీవ్స్ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముందని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు సుధాకర్, టీఎమ్ఎస్ఆర్‌యూ రాష్ట్ర నాయకులు అఫ్రోజ్, జగదీశ్వరాచారి, టీపీ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

సీరియల్ కిల్లర్ అరెస్ట్

- గుప్తనిధుల పేరుతో 11మంది హత్య
- గద్వాల జోన్ డీఐజీ ఎల్ ఎస్.చౌహాన్ వెల్లడి



నవతెలంగాణ- కందనూలు

సీరియల్ కిల్లర్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మూఢనమ్మకాలు, బాణామతి, గుప్తనిధుల పేరుతో అమాయకులను నమ్మించి అత్యంత కర్కశంగా 11పైగా హత్యలు చేసిన నిందితున్ని అరెస్టు చేశారు. అతన్ని మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు ఈ సందర్భంగా గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్.చౌహాన్ కేసు వివరాలు వెల్లడించారు.

నాగర్‌కర్నూల్‌లోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన రామటి సత్యనారాయణ యాదవ్ తనకు మంత్రశక్తులు వచ్చని.. గుప్తనిధులు వెలికి తీస్తానని ప్రజలను నమ్మించాడు. వారి నుంచి డబ్బు తీసుకోవడంతోపాటు స్థలాలు రాయించుకునేవాడు. ఆ తర్వాత పూజలు చేయాలంటూ నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి తీర్థం పేరుతో నోట్లో యాసిడ్ పోసి 11 మందిని కిరాతకంగా హత్య చేశాడు. వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, కర్నాటకలోని బలగనూరు, ఏపీలోని అనంతపురంలో ఈ హత్యలు చేశాడు. పోలీసుల కండ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. అయితే, వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకటేశ్ హైదరాబాద్‌లోని బొల్లారంలో నివసించేవారు. నవంబర్‌లో ఆయన నగర శివారులో హత్యకు గురయ్యాడు.

వెంకటేశ్ కుటుంబ సభ్యులతో నిందితునికి కొంతకాలంగా పరిచయం ఉండటంతో.. అతనిపైనే అనుమానం వచ్చి అదే నెల 26న నాగర్‌కర్నూల్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటేశ్ వద్ద డబ్బులు తీసుకున్న అనంతరం క్షుద్రపూజల పేరుతో నిందితుడు నగర శివారుకు తీసుకెళ్లి హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. దీని ఆధారంగా విచారణ చేయగా.. అదే తరహాలో అనేక మందిని చంపినట్టు వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో నిఘా పెట్టి నిందితున్ని అరెస్టు చేశారు.

కారు, మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులు, విష పదార్థాలు, ఎలక్ట్రికల్ డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతని ఆస్తులపైనా దర్యాప్తు కొనసాగుతోంది.

ఈ ప్రాంత ప్రజలు మూఢనమ్మకాలను నమ్ముతున్నారని, అందుకే ఇలాంటి మోసగాళ్ల చేతిలో చిక్కుతున్నారని డీఐజీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసును ఛేదించిన జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్, ప్రత్యేక శ్రద్ధ వహించిన డీఎస్పీ మోహన్ కుమార్, సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ మహేందర్‌ను అభినందించారు.

ఎమ్మెల్సీగా వజ్రేష్ యాదవ్ ?

- యాదవ సామాజిక తరగతికి అవకాశం
- ముఖ్యమంత్రి అనుచరుడిగా గుర్తింపు
- ఎమ్మెల్యే ఎన్నికలలో మల్లారెడ్డికి గట్టి పోటీ ఇచ్చిన వజ్రేష్



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతోపాటు ఆరు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉండటంతో అందుకు ఆశావహుల ప్రయత్నాలు మొదలయ్యాయి. ముఖ్యంగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి ఓటమి పాలైన వారు ముందు రేసులో ఉండి తమ నాయకుల ప్రసన్నం కోసం ఎదురుచూస్తున్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డికి ఎన్నికలలో గట్టి పోటీనిచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌కు శాసనమండలి సభ్యుడిగా అవకాశం ఖాయమనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుంగు అనుచరుడిగా పేరుండటంతోపాటు ఎన్నికలలో బలమైన అభ్యర్థి మల్లారెడ్డితో పోటీ పడి గణనీయమైన ఓటు బ్యాంకు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

వజ్రేష్ యాదవ్ పోడిపోయినా బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డికి గట్టి పోటీనే ఇచ్చారు. ఒక దశలో మల్లారెడ్డి ఓటమి ఖాయమనే సంకేతాలు వినిపించాయి.

మేడ్చల్ ప్రత్యేకం..!

రాష్ట్రంలోనే మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రత్యేకమైందనే చెప్పొచ్చు. దీని పరిధిలో మూడు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాల్టీలు, ఐదు జెడ్పీటీసీలు, ఐదు ఎంపీపీలు ఉన్నాయి. నియోజకవర్గం పూర్తిగా పట్టణం కాదు.. పూర్తి గ్రామీణం కాకుండా ఉంది. అందుకే రాష్ట్రంలో మేడ్చల్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వజ్రేష్ యాదవ్‌కు శాసనమండలి సభ్యునిగా అవకాశం ఇవ్వడం సబబనే సూచనలు కూడా అధిష్టానం వద్దకు వెళ్లాయని సమాచారం.

కలిసొచ్చిన సామాజిక తరగతి..

వజ్రేష్ యాదవ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి మేడ్చల్‌లో మల్లారెడ్డికి దీటుగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా రేవంత్ రెడ్డి ఆలోచన చేస్తున్నట్టు సమాచారం.

అంతే కాకుండా యాదవ సామాజిక తరగతి నుంచి ఎవ్వరూ ఎమ్మెల్యేగా గెలుపొందకపోవడంతో ప్రస్తుతం ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటాలలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాల్లో అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఇలా చేయడం ద్వారా నగర శివారు ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో ఏకపక్ష విజయాలు సాధించేందుకు అవకాశాలు ఉంటాయనేది అధిష్టానం ఆలోచనగా ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు.

నాడు పొంగిపోలేదు.. నేడు కుంగిపోము

- అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా బీఆర్ఎస్ మాత్రం ప్రజల పక్షమే
- మనకు పోరాటాలు కొత్త కాదు.. భవిష్యత్ మనదే
- ఏ కార్యకర్తకు సమస్య వచ్చినా ఒక్క ఫోన్‌కాల్ చేయండి.. గంటలో మీ ముందు ఉంటా
- సంగారెడ్డి, జహీరాబాద్ కృతజ్ఞతా సభల్లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-సంగారెడ్డి/ జహీరాబాద్

ఒకప్పుడు అధికారం ఉన్నదని పొంగిపోలేదు.. నేడు ప్రతిపక్షంలో ఉన్నామని కుంగిపోవట్లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మనకు పోరాటాలు కొత్తేమీ కాదని, భవిష్యత్ మనదేనని, ఎవరూ అధైర్య పడొద్దని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ధైర్యాన్నిచ్చారు. సంగారెడ్డి, జహీరాబాద్‌ల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కృతజ్ఞతా సభలకు హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. సంగారెడ్డిలో టిక్కెట్ ఆశించిన పట్నం మాణిక్యం.. పార్టీ నిర్ణయాలను గౌరవిస్తూ తనకు టిక్కెట్ దక్కనప్పటికీ.. చింతా ప్రభాకర్ గెలుపే తన గెలుపులాగా కృషి చేశారని కొనియాడారు. కార్యకర్తల గురించి ఎంత చెప్పినా తక్కువేనని.. సంగారెడ్డి, జహీరాబాద్‌లలో అద్భుతమైన గెలుపును అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధికారంలో లేదని బాధపడొద్దని.. ఏ సమస్య వచ్చినా తనకు ఫోన్ చేయాలని.. గంటలో వారి ముందు ఉంటానని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో అందరికీ అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు శాతం ఓట్ల తేడాతో మాత్రమే ఓడిపోయామని.. ఎవ్వరూ అధైర్యపడొద్దని చెప్పారు. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా బీఆర్ఎస్ మాత్రం ప్రజల పక్షమే అని అన్నారు. 60 ఏండ్లలో జరగని అభివృద్ధిని.. కేసీఆర్ సారథ్యంలో పదేండ్లలో చేసి చూపించామని చెప్పారు. దమ్మున్న నాయకుడు కేసీఆర్ ఉండగా.. మనకు ఇబ్బందేమీ లేదంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎన్నో విజయాలను సాధించిందని.. అయితే మనకంటే మంచిగా అభివృద్ధి చేస్తారని నమ్మి కాంగ్రెసోళ్లకు ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. అంతేకాకుండా ఇందులో కొంత అసత్య ప్రచారం కూడా పైచేయి సాధించిందన్నారు. ఏది ఏమైనా కొత్త ప్రభుత్వానికి ఓ ఏడాది పాటు సమయం ఇద్దామని.. అప్పటికీ వాళ్లు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. తన ఊపిరి ఉన్నంత వరకు ప్రజా సేవలోనే ఉంటానన్నారు. సంగారెడ్డి గడ్డపై గులాబీ జెండా గెలుపు హరీశ్‌రావుకే అంకితం ఇస్తున్నట్టు చెప్పారు.


సంపాదకీయం

కశ్మీర్(అ)న్యాయం!

"కోర్టులలో జనన్యాయం గొంతునులిమి చంపబడెను"... అని యాభయేండ్ల క్రితమే అన్నాడు చెరబండరాజు. యాభయేండ్ల తరువాత కూడా అదే నిజమవుతుంటే అంతకుమించిన విషాదమేముంటుంది. కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని మోడీ ప్రభుత్వం రద్దుచేయడం సబబేనంటూ సుప్రీంకోర్టు సోమవారం తీర్పునిచ్చింది. ఈ తీర్పు జమ్మూ కాశ్మీర్‌తో పాటు, మొత్తం రాష్ట్రాల హక్కులనే ప్రమాదంలో పడేస్తోందా? మన సమాఖ్య స్ఫూర్తిని బలహీనపరుస్తోందా? అన్న అనుమానాలకు తావిస్తోంది.. ఒక్కసారి భారత యూనియన్‌లో విలీనానికి అంగీకరిస్తూ ఒప్పందంపై సంతకం చేశాక ఇక కాశ్మీర్‌కు ఏ ప్రత్యేకతా, స్వయంప్రతిపత్తీ ఉండబోదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. కానీ ఆ ప్రత్యేకతకు, స్వయంప్రతిపత్తికి హామీ ఇస్తూనే కదా ఒప్పందం కుదిరింది..! ఆ ఒప్పందానికి చట్టబద్ధత కల్పిస్తూనే కదా ఆర్టికల్ 370 రూపొందింది..! ఈ చారిత్రక వాస్తవాన్ని న్యాయస్థానం గుర్తించాలి కదా.. అన్న భావన కలుగుతోంది.

ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఏం మార్పు జరిగింది కాశ్మీర్‌లో...! ఇప్పటికీ వారు "గుర్తుతెలియని వ్యక్తులు", "గుర్తు తెలిసిన మనుషులు" ఇద్దరిచేతా ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. ఆ గుర్తుతెలియని వ్యక్తులు వీళ్ళే అంటూ అమాయక పౌరులను గుర్తుతెలిసిన మనుషులు నిర్దాక్షిణ్యంగా చంపేస్తూనే వున్నారు. కాశ్మీర్ ఓ సుందర ప్రదేశం మాత్రమే కాదు... శాంతికీ అశాంతికీ మధ్య సుదీర్ఘకాలంగా నలిగిపోతున్న ఓ డెబ్బయేండ్ల విషాదం. ఆ విషాదం ఇప్పుడు మరింత తీవ్రమై వేధిస్తోంది....

దేశవిభజన సమయంలో పాకిస్థాన్‌లో చేరకుండా భారత్‌లో విలీనం కావడానికి షరతులతో కూడిన ఒప్పందానికి అంగీకరించారు నాటి కాశ్మీర్ రాజు రాజాహరిసింగ్. ఆ ఒప్పందానికి ప్రతీకగా, కశ్మీరీల ఆకాంక్షలకు ప్రతి రూపంగా రూపుదిద్దుకున్నదే ఆర్టికల్ 370. ఈ ఆర్టికల్ కాశ్మీర్‌కు స్వతంత్ర హోదా కల్పిస్తుంది. రక్షణ, విదేశాంగ వ్యవహారాల్లో మినహా ఈ రాష్ట్రానికి సంబంధించి ఏ చట్టం చేయాలన్నా, ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఆ రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో మాత్రమే చేయాల్సి వుంటుంది. కానీ అలాంటి ప్రక్రియేదీ లేకుండానే కేంద్రం ఏకపక్షంగా ఈ ఆర్టికల్‌ని రద్దు చేసింది. పైగా అక్కడ ప్రజా ప్రభుత్వమేదీ లేని సమయాన్నీ, రాష్ట్రపతిపాలన ద్వారా తమ నియంత్రణ కొనసాగుతున్న సమయాన్నీ ఒక అవకాశంగా తీసుకుని ఈ చర్యకు తెగబడింది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా చేయడానికి సన్నాహకంగానే అక్కడ రాష్ట్రపతి పాలన విధించి ఈ దుర్మార్గానికి ఒడిగట్టింది. కానీ సుప్రీంకోర్టు ఇవేవీ పరిగణనలోకి తీసుకోకుండా అక్కడ ప్రభుత్వమే లేనప్పుడు ఇక అనుమతులకూ అభిప్రాయాలకూ ఆస్కారమే లేదన్నట్టుగా వ్యవహరించడం న్యాయమేనా? ఈ ఆర్టికల్ ద్వారా కాశ్మీర్‌కు కొన్ని ప్రత్యేక హక్కులు కూడా కల్పించబడ్డాయి. అయితే ఇవన్నీ సుప్రీం ధర్మాసనం గమనంలో ఉన్నాయో లేవో తెలియదుగానీ.. ఇకపై దేశంలోని అన్ని రాష్ట్రాల వలనే జమ్మూకాశ్మీర్ కూడా అని తన తీర్పులో వ్యాఖ్యానించింది. దీంతో 371 అధికరణం ద్వారా ఈశాన్య రాష్ట్రాలతోపాటు దాఖలుపడిన హక్కులు కూడా కాశ్మీరీలకు లేకుండా పోతాయా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.



ఈ దేశానికి రాష్ట్రాల ఏర్పాటు కొత్త కాదు గానీ ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడం, అదికూడా రెండు ముక్కలుగా చేయడం కేవలం కాశ్మీర్ విషయంలోనే జరిగింది. దీనికి సంబంధించిన తప్పొప్పులను కూడా సుప్రీంకోర్టు ఉపేక్షించింది. పైగా త్వరలోనే తిరిగి రాష్ట్రహోదాను పునరుద్ధరిస్తామని కేంద్రం తరుపున సోలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారని పేర్కొంటూనే లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేయడాన్ని సమర్థించింది. అంటే పూర్వపు కాశ్మీర్ పునరుద్ధరణ జరగదనీ, కేవలం అందులో కొంత భాగానికి మాత్రమే రాష్ట్రహోదా పునరుద్ధరించ బడుతుందని చెప్పకనే చెప్పింది. 2024 సెప్టెంబర్ 30లోపు జమ్మూ కాశ్మీర్‌కు ఎన్నికలు నిర్వహించాలని కేంద్రాన్నీ ఎన్నికల సంఘాన్నీ ఆదేశించింది. ఇందులో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే... 2024 ఏప్రిల్‌లోనే సార్వత్రిక ఎన్నికలు జరుగనుండగా కాశ్మీర్‌లో మాత్రం సెప్టెంబర్ నాటికి ఎన్నికలు జరిపేందుకు అవకాశమివ్వడం..! అంటే కాశ్మీర్‌పై కేంద్రం తన నియంత్రణను కొనసాగించడానికీ, ఈ అంశాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో తన విద్వేషరాజకీయాలకు ఉపయోగించుకోవడానికీ కావలసినంత సమయమిచ్చింది. ఇలా ఏ కోణం నుండి చూసినా ఈ తీర్పు కలవరానికే గురిచేస్తోంది. ముఖ్యంగా మన రాజ్యాంగ సూత్రాల్లో కీలకమైన ఫెడరల్ స్ఫూర్తి, రాష్ట్రాల హక్కులూ ప్రశ్నార్థకమయ్యేందుకు అవకాశం కల్పిస్తోంది. అంతిమంగా ఈ తీర్పు కేంద్రంలో అధికారపక్షానికి ఆనందం కలిగిస్తోందేమోగానీ, ప్రజాస్వామిక సూత్రాలనూ రాజ్యాంగ నియమా లనూ కాపాడుకోవాలనుకునే వారికీ, కాశ్మీరీ ప్రజలకు మాత్రం ఆందోళననే మిగిల్చింది.

ఒకరకంగా ఈ తీర్పు ద్వారా అధికార బీజేపీకి రాజకీయ ప్రోత్సాహం దొరికినట్టయింది. దాని సమాఖ్య సూత్రాల విధ్వంసానికి ఆమోదం లభించినట్టయింది. అందుకే ఈ తీర్పు ఓ ఆశాకిరణం అని అభివర్ణించారు ఏలినవారు. వారికి బాకాలు ఊదేవారూ ఎలాగూ ఉంటారు. కానీ వాస్తవమేమిటీ..? బాధితుల మాటేమిటీ..? వారి గుండెచప్పుడు వినకుండా సత్యాన్ని ఎప్పుడూ గుర్తించలేం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఏం మార్పు జరిగింది కాశ్మీర్‌లో...! ఇప్పటికీ వారు "గుర్తుతెలియని వ్యక్తులు", "గుర్తు తెలిసిన మనుషులు" ఇద్దరిచేతా ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. ఆ గుర్తుతెలియని వ్యక్తులు వీళ్ళే అంటూ అమాయక పౌరులను గుర్తుతెలిసిన మనుషులు నిర్దాక్షిణ్యంగా చంపేస్తూనే వున్నారు. కాశ్మీర్ ఓ సుందర ప్రదేశం మాత్రమే కాదు.. శాంతికీ అశాంతికీ మధ్య సుదీర్ఘకాలంగా నలిగిపోతున్న ఓ డెబ్బయేండ్ల విషాదం. ఆ విషాదం ఇప్పుడు మరింత తీవ్రమై వేధిస్తోంది....

శాసనసభ్యులకు ఓ విన్నపం...

రాష్ట్రంలో కొత్త శాసనసభ కొలువుదీరింది. ఈ నెల 14న కొత్తగా ఎన్నికైన శాసనసభ తొలి సమావేశాలు గవర్నరు ప్రసంగంతో మొదలు కాబోతున్నాయి. ఈ సందర్భంగా గెలిచిన గౌరవ శాసన సభ్యులకు ఒక విన్నపం. అధికార పక్షంలో మొదటిసారి ఎన్నికైన సభ్యులున్నారు. చాలాకాలం విరామం తరవాత శాసనసభలో అడుగుపెడుతున్న సీనియర్ సభ్యులున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి పదేండ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో కాంగ్రెస్‌లో చాలామంది సీనియర్‌లు కేసీఆర్ ధాటికి తట్టుకోలేక ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. అయితే ఈసారి కాంగ్రెస్ గాలి వీచింది. చాలామంది సీనియర్‌లు మళ్లీ సభలో అడుగు పెడుతున్నారు. గత పదేళ్ల కన్నా ఈ అసెంబ్లీ ఒక నిండుదనాన్ని సంతరించుకుంది. ప్రధానమైన పార్టీలన్నిటికీ సభలో ప్రాతినిధ్యం వుంది. పాలక పక్షానికి ఎవరిమీద ఆధారపడకుండా తగినంత సంఖ్యాబలం వుంది. 39 స్థానాలతో బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. బీజేపీ ఎనిమిది సీట్లతో గతంకంటే ఈసారి బలాన్ని పెంచుకుంది. ఎంఐఎం ఎప్పటిలాగే తన స్థానాలను నిలబెట్టుకుంది.



చాన్నాళ్ల తర్వాత కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం లభించింది. సీపీఐ(ఎం), బీఎస్పీ కూడా ఎన్నికైతే ప్రజాసమస్యలు మరిన్ని చర్చకు వచ్చేవి.

అయితే పదేండ్లు అధికారంలో వున్న పార్టీని ప్రజలు ఓడించారంటే వారిలో తీవ్ర అసంతృప్తి వుందనటంలో సందేహం లేదు. అంటే కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం మీద ప్రజల ఆశలు, ఆకాంక్షలు అంత ఎక్కువగా ఉంటాయన్న విషయాన్ని అధికార పక్షం నేతలు విస్మరించరాదు. శాసనసభ్యులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరిస్తే ప్రజలు వీరిమీద పెట్టుకున్న ఆశలు నెరవేరటానికి వీలుంటుంది. ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలి. ఈ సందర్భంలో శాసన సభ్యుల బాధ్యత ఏమిటన్న విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ప్రాధాన్యతను గుర్తించాలి. ఇందులో మొదటిది వాళ్ళ మనస్సాక్షికి ప్రాతినిధ్యం వహించాలి. ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన వారికి ఈ విచక్షణ మరింత పదునైనదిగా ఉండాలి. అందువలన అంతరాత్మకు వ్యతిరేకంగా వ్యవ హరించరాదు. రెండోది వారిని ఎన్నుకున్న ప్రజల అభిప్రాయాలను తమ గొంతుక ద్వారా చట్టసభలో వినిపించాలి. ప్రజల ఆకాంక్షలు ప్రభుత్వానికి గుర్తుచేస్తూ ఉండాలి. మూడోది ఏపార్టీ టికెట్ మీద ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారో ఆ పార్టీ గౌరవాన్ని పెంచేలా ప్రాతినిధ్యం వహించాలి. నాలుగవది రాజ్యాంగం ప్రకారం నడుచుకునే ప్రతినిధులుగా ఉండాలి.ఈ నాలుగు కోణాలను సరిగ్గా అర్థం చేసుకుంటే మంచి శాసనసభ్యుడిగా ఎదగడానికి అవకాశం ఉంటుంది.

ప్రతి మనిషి తనకి మంచిపేరు రావాలని కోరుకుంటారు. మరీ ముఖ్యంగా రాజకీయంలో ఉన్నవారైతే నిరంతరం ప్రజాసేవలో తప్పనిసరి. అయితే ఇక్కడో చిక్కుంది. ఎన్నికలకు ముందు అన్ని సమస్యలు పరిష్కారిస్తామని చెబుతూనే గెలిచిన తర్వాత వారిని నిర్లక్ష్యం చేస్తుంటారు. వారిచ్చిన హామీలు నెరవేర్చాలనే ఆలోచన లేకపోవడంతో ప్రజలు అసహనానికి గురవుతుంటారు.చూద్దాం..చేద్దాం అనే మాటలు చెబుతూ నాన్చుతూ ఉంటారు. ఏది చేయగలరో, ఏది తమనుంచి అవుతుందో అది క్లారిటీ ఇవ్వడం ద్వారా ప్రజాప్రతి నిధులకు, ప్రజలకు సత్సంబంధాలు మెరుగవుతాయి.ఎంతవరకు నేతల సిఫార్సు అవసరం? ఏ పని సిఫార్సు లేకుండా చేయవచ్చు. ఈ విషయంలో నేతలకు, అధికారులకు సరైన అవగాహన ఉండాలి. నిబంధనల ప్రకారం చేయడానికి వీలుకానిది, ప్రజాసంక్షేమానికి ఉపయోగపడేదైతే సభల చర్చపెట్టాలి. ఈ విషయంలో ముఖ్యంగా సభాధ్యక్షుడు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. అందరికీ మాట్లాడే అవకాశమివ్వాలి.అప్పుడే అనేక సమస్యలు చర్చకు వస్తాయి.

ఎవరూ పాలకపక్షాన్ని కూల్చాలనో, ప్రతిపక్షాన్ని చీల్చాలనో అనుకోవడం అవివేకం, అనైతికం, అనాగరికం! ఈ విధంగా ఆలోచించిన ఆంధ్రా చంద్రుడికి, తెలంగాణా చంద్రుడికి పట్టిన గ్రహణం చూస్తున్నాం కదా! అయినా కూడా, బీజేపీ అపరిపక్వ వ్యాఖ్యలు ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. అసలు బీజేపీ ఇన్ని సీట్లు గెలుస్తుందని ఎవరూ అనుకోలేదు. వాపును చూసి బలుపనుకొని బీజేపీ తెలంగాణలో బోల్తా పడింది. అయినా వాస్తవాన్ని జీర్ణించుకోలేక పోతుంది! ప్రజలు ఎమ్మెల్యేల తీరును గమనించాలి. సభలో వారి తీరు ఏవిధంగా వున్నదో చెప్పగలగాలి. అయితే ఎన్నికలప్పుడేగానీ నేతలు జనం చుట్టూ తిరిగేది. గెలిచిన తరువాత ప్రజలే ఎమ్మెల్యేల చుట్టూ తిరగాలి. అది కూడా పీఏ దయదలిస్తేనే ఎమ్మెల్యే దర్శనం దక్కేది. ఈ ధోరణి మారాలి. ఎమ్మెల్యే ఒక కులానికి, ఒక మతానికో కాకుండా నియోజకవర్గం మొత్తానికి ప్రతినిధి అన్న విషయం మర్చిపోరాదు. ఎన్ని రాగద్వేషాలు ఉన్నా ప్రజల్ని, ప్రతిపక్షాలను కలుపుకుపోవాలి. అభివృద్ధికి సహకరించాలి.

- గుమ్మడిదల రంగారావు

ఉక్రెయిన్ పోరుపై పశ్చిమ దేశాల మల్లగుల్లాలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

'అదిగో పుతిన్ సేనలను తరిమి కొడుతున్నాం.ఇదిగో రష్యా ఆధీనంలోకి వెళ్లిన ప్రాంతాలను తిరిగి తెచ్చుకుంటున్నాం' అని గడచిన 658 రోజులుగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అమెరికా, పశ్చిమదేశాల నేతలు చెబుతూనే ఉన్నారు. పరిస్థితిలో మార్పు లేదు, రష్యా సైనిక చర్య కొనసాగుతూనే ఉంది. తమ ఆధీనంలోకి వచ్చిన ప్రాంతాలతో సహా త్వరలో ఎన్నికలు జరపబోతున్నామని ప్రకటించింది. దీంతో పశ్చిమ దేశాలు మరోసారి ఉక్రెయిన్ మీద దృష్టి సారించాయి.పోతున్న పరువును నిలుపుకొనేందుకు కొత్త ఎత్తుగడల గురించి మల్లగుల్లాలు పడుతున్నాయి.దాన్లో భాగంగానే హడావుడిగా జెలెన్‌స్కీని సోమవారం నాడు వాషింగ్టన్ రప్పించారు.ప్రారంభంలో తగిలిన ఎదురుదెబ్బల తరువాత రష్యా మిలిటరీ కొత్త వ్యూహాలను అనుసరిస్తున్నది. గతంకంటే ఎక్కువగా సైనికులు, క్షిపణులు, మందుగుండును సమకూర్చుకుంది. ఇరాన్ నుంచి పెద్ద సంఖ్యలో యుద్ధరంగంలో వినియోగించే డ్రోన్లను సమీకరించింది. పశ్చిమ దేశాలు మిలిటరీ, ఆర్థికసాయం ఎంత చేసినా ఫలితం లేకపోవటంతో అమెరికా యంత్రాంగంలో ఆందోళన మొదలైంది. సైనిక చర్య వచ్చే ఏడాది కూడా కొనసాగితే అది జో బైడెన్ ఎన్నికల మీద ప్రభావం చూపుతుంది. ఓడిపోతున్న ఉక్రెయిన్‌కు మనమెందుకు సాయం చేయాలని ప్రతిపక్ష రిపబ్లికన్లు ప్రశ్నిస్తున్నారు. దిక్కుతోచని జో బైడెన్ గత వారంలో పార్లమెంటులో మాట్లాడుతూ పుతిన్‌ను గెలవనివ్వకూడదు, అది మన జాతీయ, మన స్నేహితుల అంతర్జాతీయ ప్రయోజనాలతో ముడిపడి ఉంది. ఉక్రెయిన్‌కు మన సాయంలో అంతరాయం ఏర్పడితే పుతిన్ స్థానం బలపడుతుందని వాపోయాడు. వచ్చే ఏడాది జర్మనీలో జరిపే యుద్ధ విన్యాసాల తరువాత కొత్త ఎత్తుగడలకు ఒక రూపం వస్తుందని భావిస్తున్నారు. కొత్త వ్యూహంతో ముందుకు పోనట్లయితే ఓడే అవకాశం ఉందని అమెరికా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 111 బిలియన్ డాలర్ల సాయం చేశామని, అదంతా బూడిదలో పోసిన పన్నీరైనందున ఇంక సాయం అనవసరమని రిపబ్లికన్లు పెదవి విరుస్తున్నారు.ఇచ్చినదానితో సర్దుకొని పోరుసాగించాలి తప్ప ఎక్కువగా ఆశించవద్దని కూడా పరోక్షంగా సందేశాలిస్తున్నారు. ఎంత ఇస్తామనేది పక్కన పెడితే రానున్న సంవత్సరంలో గత రెండేండ్లలో చేసిన మాదిరి సాయం చేసే అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు.

ఆంక్షలతో పశ్చిమ దేశాలు తమ బాంకుల్లో ఉన్న రష్యా సొమ్ము 300 బిలియన్ యూరోలను స్తంభింపచేసినా, అనేక ఆంక్షలను విధించి అమలు జరుపుతున్నా ఇప్పటి వరకు పుతిన్ తట్టుకొని నిలిచాడు. పశ్చిమ దేశాలు వేసిన అంచనాలన్నీ తప్పాయి.చైనాతో సంబంధాలను పెంచుకొని పశ్చిమ దేశాల ఆంక్షలను నిర్వీర్యం చేశాడు. ఆంక్షల కారణంగా గతేడాది ఆర్థిక ఉత్పత్తి 2.1శాతం తగ్గినా ఈ ఏడాది 2.8శాతం పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. జనాభాలో 80శాతం మంది పుతిన్‌కు మద్దతు పలుకుతున్నట్లు సర్వేలు తెలిపాయి. అయితే రానున్న రోజుల్లో ఆర్థిక సవాళ్లను కూడా తక్కువగా అంచనా వేయనవసరం లేదు. తొలిదశలో మాదిరి దూకుడుగా ముందుకు పోకుండా మధ్యలో గట్టిదెబ్బలు కొడుతూ ఉక్రెయిన్‌కు ఊపిరి సలపకుండా రష్యా చూస్తున్నది. అలసిపోయి దారికి రాకతప్పదనే అంచనాలో ఉంది. వచ్చే ఏడాది మార్చినెల 17వ తేదీన జరిగే ఎన్నికల్లో మరోసారి పుతిన్ పోటీ చేయనున్నట్లు వార్తలు వచ్చాయి.

రానున్న రోజుల్లో గట్టి ప్రతిఘటన ఇస్తే వచ్చే ఏడాది చివరికి లేదా 2025లో రష్యాతో సంప్రదింపులకు అర్థం ఉంటుందని, భారం మొత్తం ఉక్రెయిన్ మీద పెట్టే విధంగా అమెరికన్లు మాట్లాడుతున్నారు. ఎత్తుగడలను మార్చకపోతే మొదటి ప్రపంచ యుద్ధంలో 1916లో పెద్ద సంఖ్యలో సైనికులను పోగొట్టుకున్నా సాధించిందేమీ లేనట్లుగా ఉక్రెయిన్ పరిస్థితి ఉంటుందని హెచ్చరించినట్లు న్యూయార్క్‌టైమ్స్ పత్రిక రాసింది. ఎదురుదాడుల పేరుతో ఉక్రెయిన్ ప్రారంభించిన చర్యల్లో పెద్ద సంఖ్యలో మరణించిన, గాయపడిన సైనికులు ఉన్నట్లుగా కూడా పేర్కొన్నది. వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో అమె రికా వైఫల్యం మాదిరి 2023లో ఉక్రెయిన్ పరి స్థితి ఉందని విమర్శకులు పేర్కొన్నారు. చివరి యత్నంగా అమెరికా స్వయంగా తన సీనియర్ కమాండర్లు ఆంటోనియో అగుటో జూనియర్ వంటి వారు ఎక్కువ సమయం కీవ్‌లో, జర్మనీలో ఉండి సమన్వయం చేసేందుకు పంపాలని నిర్ణ యించింది. ఉక్రెయిన్ ఎదురుదాడుల్లో సాధించిం దేమీ లేకపోగా అమెరికా అంచనా వేసిన దానికం టే రష్యా సేనలు బలంగా ఉన్నట్లు తేలింది. అంతే కాదు రష్యా ఎంతగా తన సేనలను బలపరుచుకుంటున్నదన్న అంచనాలో కూడా అమెరికా విఫలమైంది. ప్రస్తుతం ఇరవై శాతం ఉక్రెయిన్ ప్రాంతం రష్యా ఆధీనంలో ఉంది. అక్కడ రష్యా పాతిన మందుపాతరలు 1950 దశకంలో కొరియా యుద్ధం తరువాత మరెక్కడా లేని విధంగా ఉన్నందున ఉక్రెయిన్ సేనలు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. వాటిని తొలగించేందుకు పూనుకున్న ఉక్రెయిన్ సేనలపై రష్యా హెలికాప్టర్లతో దాడులు చేస్తూ ఊపిరిసలుపుకోనివ్వటం లేదు. ఇరాన్, చైనాల నుంచి సేకరించిన రకరకాల డ్రోన్లను రష్యా ఉపయోగిస్తుండటంతో యాంత్రిక యుద్ధ స్వభావంలోనే మార్పు వచ్చిందని అమెరికా నిర్ధారణకు వచ్చింది. రష్యా ఆధీనంలోకి వచ్చిన ప్రాంతాలలో దేనిమీద కేంద్రీకరించాలనే అంశంపై అమెరికా-ఉక్రెయిన్ నిపుణుల మధ్య ఏకాభిప్రాయం లేదని వెల్లడైంది. కోల్పోయిన ప్రాంతాలన్నిటినీ తిరిగి స్వాధీనం చేసుకోవాలని చూడవద్దని అమెరికా అంటోంది. యుద్ధం ముగియాలంటే ఉక్రెయిన్ కొంత భాగాన్ని రష్యాకు కోల్పోవాల్సి ఉంటుందని జెలెన్‌స్కీ రాక సందర్భంగా అమెరికా రిపబ్లికన్ సెనెటర్ జెడి వాన్స్ చెప్పాడు.

త్వరగా ముగియాలని మేము ఎంతగా కోరుకుంటున్నప్పటికీ సమీప కాలంలో ఉక్రెయిన్ పోరు ముగిసేట్లు లేదని, అందుకే ఒత్తిడిని మరింత పెంచాల్సి ఉంటుందని జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ అధికార సోషల్ డెమోక్రటిక్ పార్టీ సమావేశంలో చెప్పాడు. మేం వూరికే వదిలి పెడతామని పుతిన్ అనుకోవద్దని కూడా అన్నాడు. అమెరికా తరువాత ఉక్రెయిన్‌కు అతిపెద్ద మద్దతుదారుగా జర్మనీ ఉంది, భారీ మొత్తంలో ఆయుధాలను అందిస్తున్నది. పాలస్తీనాలోని గాజా ప్రాంతంలో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నందున ఉక్రెయిన్‌కు అమెరికా అదనపు సాయం అందకపోతే ఉక్రెయిన్ గతి ఏమిటని అనేక మంది పశ్చిమ దేశాల విశ్లేషకులు ఆందోళన వెల్లడిస్తున్నారు. మార్చి నాటికి పదిలక్షల ఫిరంగి గుండ్లను అందించాలన్న లక్ష్యం నెరవేరేట్లు కనిపించటం లేదని, మరో వైపు ఉత్తర కొరియా నుంచి అంతకంటే ఎక్కువగా రష్యా పొందవచ్చని చెబుతున్నారు. తమకంటే పది నుంచి 30 రెట్ల వరకు ఫిరంగి గుండ్లు రష్యన్ల వద్ద ఉన్నాయని ఒక ఉక్రెయిన్ సైనికుడు చెప్పినట్లు జర్మన్ పత్రిక డెర్ స్పీగల్ రాసింది. పశ్చిమ దేశాలను మించి రష్యా ఫిరంగి గుండ్లను ఉత్పత్తి చేస్తుండగా ఉత్తరకొరియా నుంచి వస్తున్నవి అదనమని, పశ్చిమ దేశాల రాజకీయాల్లో ఉన్న అనిశ్చితి కారణంగా ఉక్రెయిన్ నిలబడగలదా అంటూ, అమెరికా సాయం లేకుంటే ఐరోపా మద్దతు కుప్పకూలిపోతుందని ఎకానమిస్ట్ పత్రిక రాసింది.

ఆంక్షలతో పశ్చిమ దేశాలు తమ బాంకుల్లో ఉన్న రష్యా సొమ్ము 300 బిలియన్ యూరోలను స్తంభింపచేసినా, అనేక ఆంక్షలను విధించి అమలు జరుపుతున్నా ఇప్పటి వరకు పుతిన్ తట్టుకొని నిలిచాడు. పశ్చిమ దేశాలు వేసిన అంచనాలన్నీ తప్పాయి.చైనాతో



సంబంధాలను పెంచుకొని పశ్చిమ దేశాల ఆంక్షలను నిర్వీర్యం చేశాడు. ఆంక్షల కారణంగా గతేడాది ఆర్థిక ఉత్పత్తి 2.1శాతం తగ్గినా ఈ ఏడాది 2.8శాతం పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. జనాభాలో 80శాతం మంది పుతిన్‌కు మద్దతు పలుకుతున్నట్లు సర్వేలు తెలిపాయి. అయితే రానున్న రోజుల్లో ఆర్థిక సవాళ్లను కూడా తక్కువగా అంచనా వేయనవసరం లేదు. తొలిదశలో మాదిరి దూకుడుగా ముందుకు పోకుండా మధ్యలో గట్టిదెబ్బలు కొడుతూ ఉక్రెయిన్‌కు ఊపిరి సలపకుండా రష్యా చూస్తున్నది. అలసిపోయి దారికి రాకతప్పదనే అంచనాలో ఉంది. వచ్చే ఏడాది మార్చినెల 17వ తేదీన జరిగే ఎన్నికల్లో మరోసారి పుతిన్ పోటీ చేయనున్నట్లు వార్తలు వచ్చాయి.

సరిగ్గా జెలెన్‌స్కీ వాషింగ్టన్ పర్యటనకు వెళ్లినపుడే తాము నిర్మిస్తున్న అణు జలాంతర్గాములలో రెండింటిని మిలిటరీకీ అప్పగించినట్లు ప్రకటించారు. మొత్తం ఎనిమిదింటిని రష్యా నిర్మిస్తున్నది. రాజధాని కీవ్ నగరం మీద మంగళవారం తెల్లవారు జామున డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణుల కంటే వేగంగా ప్రయాణించే ఎనిమిది ఖండాంతర దీర్ఘ శ్రేణి క్షిపణులను రష్యా ప్రయోగించింది. వాటిని మధ్యలోనే కూల్చివేయటం ఎంతో కష్టం. ఉక్రెయిన్‌కు మద్దతుగా బ్రిటన్ రెండు నౌకలను నల్లసముద్రంలోకి పంపుతున్నట్లు ప్రకటించింది. సముద్రంలోనూ భూమి మీద ప్రయాణించే సాయుధ శకటాలను కూడా అది పంపుతున్నది. ఇటీవలి కాలంలో పుతిన్ రక్షణ ఖర్చును భారీగా పెంచుతున్నట్లు ఎకానమిస్ట్ పత్రిక పేర్కొన్నది. వచ్చే ఏడాది జిడిపిలో ఆరుశాతానికి పెంచనున్నారని, ఇది సోవియట్ యూనియన్ కూలిన తరువాత ఎక్కువ అని పేర్కొన్నది. రష్యా వృద్ధిరేటు ఈ ఏడాది ప్రారంభంలో ఒక ఒకశాతం ఉండగా మూడుశాతానికి పెరుగుతుందని రేటింగ్ సంస్థలు పేర్కొన్నాయి.

ఉక్రెయిన్ పోరు ప్రారంభంలో పశ్చిమదేశాల ఆర్థికవేత్తలు వేసిన అంచనాలన్నీ తలకిందులయ్యాయి.విధించిన ఆంక్షలు పని చేయటం లేదు, ఈ స్థితిలో రష్యాను ఎలా దారికి తేవాలా అన్నది పశ్చిమ దేశాలకు తోచటం లేదు. ఇటీవల బెర్లిన్‌లో జరిగిన ఐరోపా యూనియన్ సమావేశంలో జరిగిన సమీక్షలో డజనుకుపైగా చైనా కంపెనీలు రష్యా మిలిటరీకి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. చైనాను వారేమీ అదుపు చేయలేరు. తొలి రోజుల్లో ఆంక్షలు పని చేసినట్లు కనిపించినా తరువాత కాలంలో వాటిని అధిగమించినట్లు నిర్ధారణకు వచ్చారు.

త్వరగా ముగియాలని మేము ఎంతగా కోరుకుంటున్నప్పటికీ సమీప కాలంలో ఉక్రెయిన్ పోరు ముగిసేట్లు లేదని, అందుకే ఒత్తిడిని మరింత పెంచాల్సి ఉంటుందని జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ అధికార సోషల్ డెమోక్రటిక్ పార్టీ సమావేశంలో చెప్పాడు. మేం వూరికే వదిలి పెడతామని పుతిన్ అనుకోవద్దని కూడా అన్నాడు. అమెరికా తరువాత ఉక్రెయిన్‌కు అతిపెద్ద మద్దతుదారుగా జర్మనీ ఉంది, భారీ మొత్తంలో ఆయుధాలను అందిస్తున్నది. పాలస్తీనాలోని గాజా ప్రాంతంలో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నందున ఉక్రెయిన్‌కు అమెరికా అదనపు సాయం అందకపోతే ఉక్రెయిన్ గతి ఏమిటని అనేక మంది పశ్చిమ దేశాల విశ్లేషకులు ఆందోళన వెల్లడిస్తున్నారు. మార్చి నాటికి పదిలక్షల ఫిరంగి గుండ్లను అందించాలన్న లక్ష్యం నెరవేరేట్లు కనిపించటం లేదని, మరోవైపు ఉత్తర కొరియా నుంచి అంతకంటే ఎక్కువగా రష్యా పొందవచ్చని చెబుతున్నారు.

నాటో సభ్యరాలు టర్కీ, కజకస్తాన్, ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు రష్యాకు అన్ని విధాలుగా సహకరిస్తున్నాయి. అమెరికా తయారీ మందుగుండు కూడా రష్యాకు చేరుతున్నట్లు సమావేశంలో వెల్లడైంది. కజకస్తాన్ వంటి దేశాల దిగుమతులు పెరిగిన తీరు చూస్తే మూడవ దేశాల ద్వారా ఐరోపా కంపెనీల యంత్రాలు, విడిభాగాలు రష్యాకు చేరుతున్నట్లు అనుమానిస్తున్నారు.హంగరీ, ఎస్తోనియా వంటి ఐరోపా దేశాలు రష్యాతో సంబంధాలను కలిగి ఉన్నట్లు సమీక్షలో పేర్కొన్నారు.గతంలో సోవియట్ మాదిరి ఇప్పుడు రష్యా తనకు అవసరమైన మిలిటరీ పరికరాలను నూటికి నూరుశాతం సమకూర్చుకోగలిగిన స్థితిలో ఉందని కొందరు నిపుణులు చెబుతున్నారు.ఆంక్షలను ఉల్లంఘించినట్లు ఒకవైపు చెబుతూనే అలాంటి కంపెనీలపై తీసుకున్న చర్యలేమిటో చెప్పలేని స్థితిలో ఐరోపా సమాఖ్య ఉంది.దాదాపు పదహారు వందల ఐరోపా కంపెనీలు రష్యాలో లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. కొన్ని మధ్యం కంపెనీలు రష్యా నుంచి వెలుపలికి వచ్చినట్లు ప్రకటించినా వాటి ఉత్పత్తులు అక్కడ దొరుకుతున్నాయని ఐరోపా సమాఖ్య అధికారులు వాపోతున్నారు. ■


విద్యుత్ సంస్కరణలు - రైతులపై పెనుభారం



డా విజూకృష్ణన్

నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం, విద్యుత్ రంగ సంస్కరణలతో, అత్యంత వేగంగా ముందుకు సాగుతోంది. రైతాంగం ఆందోళనతో 2021 నవంబర్‌లో, వ్యవసాయ చట్టాలను అనివార్యంగా వెనక్కు తీసుకోవలసిన పరిస్థితి మోడీ ప్రభుత్వానికి ఏర్పడింది. ఆ సందర్భంగా రైతుల ప్రయోజనాలకు భిన్నంగా విద్యుత్ సవరణ బిల్లును అమలు చేయనని ఆయన హామీ ఇచ్చారు. అయితే, దొడ్డిదోవన ఆ విధానాలనే అమలులోకి తెచ్చా రు. ఫలితంగా మరో పోరాటం అనివార్యమైంది. నిజానికి ఈ విధానాలకు బీజేపీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి హయాంలోనే బీజం పడింది. 1948 నుండి అమలవుతున్న విద్యుత్ చట్టం వ్యవసాయ అభివృద్ధికి అధిక రాయితీలు ఇవ్వడం, దేశ ఆహార భద్రతను, పేదలకు రాయితీతో కూడిన విద్యుత్తును అందించే లక్ష్యంగా ఉండే. దీంతో పాటు, వినియోగదారులకు సరసమైన ధరలకు, విద్యుత్‌ను అందించడానికి ఉపకరించేది. ఈ విధానాన్ని అమలు చేయడానికి అవసరమైన ఖర్చును ఇతర మార్గాల ద్వారా తిరిగి పొందుతుంది. అయితే, బీజేపీ ప్రభుత్వాలు విద్యుత్‌ను కార్పొరేట్లకు అప్పచెప్పాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాయి. వ్యవసాయ చట్టాలతో సహా అనేక చట్టాల మాదిరిగానే, తీవ్రమైన కరోనా మహమ్మారి, కఠినమైన లాక్‌డౌన్‌తో ప్రజలు కొట్టుమిట్టాడుతున్న సమయంలో, గుత్త పెట్టుబడిదారుల ఆదేశానుసారం, లేబర్ కోడ్స్ తీసుకువచ్చారు. 17 ఏప్రిల్ 2020, తిరిగి 8 ఆగస్టు 2022న విద్యుత్ రంగంలో కూడా కార్పొరేట్లకు అనుకూలంగా బిల్లును ప్రవేశపెట్టారు. విద్యుత్, ఇతర సరుకుల కంటే భిన్నంగా ఉంటుంది. ప్రజలు తమ అవసరాల కోసం, విద్యుత్తును నిల్వ చేయడం సాధ్యం కాదు. అందువల్ల వినియోగదా రులను పూర్తిగా గుత్తాధిపత్యంపై ఆధారపడేలా చేస్తుంది. కాలి ఫోర్నియా, ఇతర ప్రాంతాలలో విద్యుత్ రంగంలో గుత్తాధిపత్యం అనే ప్రయోగం, సంస్కరణల ఉద్దేశం ప్రభుత్వ రంగానికి పోటీగా ఉండడమే. హోల్‌సేల్ విద్యుత్ మార్కెట్‌లో, ప్రయివేటు పవర్ జనరేటర్ల గుత్తాధిపత్యానికి సంబంధించిన ఈ కసరత్తు ద్వారా విద్యుత్‌ను ఒకవైపు యుటిలిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు విక్రయిస్తారు. మరొకవైపు రిటైల్ మార్కెట్లో విద్యుత్‌ను అంతిమ వినియోగదారులకు ప్రయివేటు సర్వీస్ ప్రొవైడర్‌కు విక్రయిస్తారు. ఈ రంగంలో వేగవంతమైన మార్పులు, వినియోగదారుల జీవితాలలో గందరగోళానికి దారితీస్తాయని హెచ్చరించడానికి కారణం లేకపోలేదు. విద్యుత్ సంస్కరణలు ప్రతిఘటనలను ఎదుర్కొంటున్నందున భారతదేశంలోని పాలకవర్గాలు మొదట కేంద్రపాలిత ప్రాంతాల్లో సంస్కరణలను అమలు చేయడానికి ప్రయత్నించాయి. దాదర్, నగర్ హవేలీలోని ఆస్తులన్నీ గుజరాత్‌కు చెందిన టొరెంట్ కంపెనీకి బదిలీ చేశారు. మహా రాష్ట్రలో అదానీలకు, చండీగఢ్‌లో ఆర్.పి గోయంకా గ్రూప్‌కు, జమ్మూకాశ్మీర్, పాండిచ్చేరిలలో ప్రయివేటు కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలను, విద్యుత్ కార్మికులు, వినియోగదారులు ఐక్య పోరాటాల ద్వారా విజయవంతంగా ప్రతిఘటించారు. అదానీలు, అంబానీలతో పాటు, టాటాలు కూడా విద్యుత్ రంగంలోకి పెద్దఎత్తున ప్రవేశించారు. అదానీ ప్రయివేట్ లిమిటెడ్ తన సైట్‌లో 13,650 మెగావాట్ల సామర్థ్యంతో, యన్‌టిపిసి తరువాత రెండవదిగా, తమది భారతదేశంలోనే అతి పెద్ద థర్మల్ పవర్ ఉత్పత్తిదారుగా పేర్కొంది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కూడా పునరుత్పాదక ఇంధన రంగంలో అతి పెద్ద భాగస్వామిగా ఉంది.

వ్యవసాయ వినియోగదారులు, రైతులకు లభించే సబ్సిడీలపై ప్రజల్లో వ్యతిరేక అభిప్రాయాన్ని కలిగించడం భారత కార్పొరేట్ల, పాలక వర్గాల లక్ష్యంగా ఉంది. కార్మికులు, కర్షకుల ఐక్య పోరాటాల ద్వారా తమకు ఎదురైన నష్టాల నుండి బయట పడేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. స్మార్ట్ మీటర్లు దీనిలో భాగమే. అది ప్రీపెయిడ్ మీటర్లకు నాంది పలికింది. వీటికి అంగీకరించకపోతే దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన వంటి పథకాలు, ప్రభుత్వ స్కీములలో, సబ్సిడీలతోపాటు నిధుల కేటాయింపుల్లో కూడా కోతలు విధిస్తామని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను బెదిరిస్తోంది. స్మార్ట్ మీటర్లను ప్రతి ఆరేండ్లకు ఒకసారి మార్చాల్సి వస్తుంది. ఫలితంగా సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల భారీ వ్యయం రాష్ట్రాల పైన, వినియోగదారులపైనా పడుతుంది. అదే సమయంలో విద్యుత్ రంగంలోని దిగ్గజ కంపెనీల ఖజానాలు నిండుతాయి. ప్రీ పెయిడ్ మీటర్లు సున్నాకు చేరుకుంటే, అది తక్షణం వినియోగం నుండి తొలగించాల్సి ఉంటుంది. తిరిగి కనెక్షన్ పొందడానికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది.



ప్రధానంగా వేసవి, కరువు పరిస్థితులలో పంటలకు నీరందాల్సిన సమయంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడితే ఎలా ఉంటుందో ఊహించండి. ఈ విధానాన్ని అమలు చేసిన కాలిఫోర్నియాలో గడ్డకట్టే చలికాలంలో, హీటర్ల వాడకం తప్పనిసరైన వేళ ప్రజానీకానికి విద్యుత్ సరఫరా చేయడానికి కంపెనీలు నిరాకరించాయి. రేట్లు ఎక్కువగా పెంచి అదనంగా చెల్లించిన వారికే కరెంటు ఇచ్చారు. లాభాలను ఆర్జించాలనే ఉద్దేశంతో మాత్రమే నడిపే కంపెనీలు, ప్రజల సమస్యలపై కనీసం ఆందోళన చెందవు. ఇది తీవ్రమైన పరిస్థితులకు దారితీయవచ్చు. వినియోగదారులు అనివార్యంగా, అదనంగా చెల్లించే విధంగా చేస్తారు. ఇవే విధానాలు కొనసాగితే, మన దేశంలోనూ అటువంటి పరిస్థితి ఏర్పడదని గ్యారంటీ ఏమీ లేదు.

ప్రధానంగా వేసవి, కరువు పరిస్థితులలో పంటలకు నీరందాల్సిన సమయంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడితే ఎలా ఉంటుందో ఊహించండి. ఈ విధానాన్ని అమలు చేసిన కాలిఫోర్నియాలో గడ్డకట్టే చలికాలంలో, హీటర్ల వాడకం తప్పనిసరైన వేళ ప్రజానీకానికి విద్యుత్ సరఫరా చేయడానికి కంపెనీలు నిరాకరించాయి. రేట్లు ఎక్కువగా పెంచి అదనంగా చెల్లించిన వారికే కరెంటు ఇచ్చారు. లాభాలను ఆర్జించాలనే ఉద్దేశంతో మాత్రమే నడిపే కంపెనీలు, ప్రజల సమస్యలపై కనీసం ఆందోళన చెందవు. ఇది తీవ్రమైన పరిస్థితులకు దారితీయవచ్చు. వినియోగదారులు అనివార్యంగా, అదనంగా చెల్లించే విధంగా చేస్తారు. ఇవే విధానాలు కొనసాగితే, మన దేశంలోనూ అటువంటి పరిస్థితి ఏర్పడదని గ్యారంటీ ఏమీ లేదు. 2025 ఏప్రిల్ నాటికి వ్యవసాయ ఫీడర్లన్నిటినీ వేరు చేయడం, బీజేపీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. గడువులోగా దానిని చేరుకోవడానికే బెదిరింపులకు పాల్పడుతోంది. వారి బెదిరింపులకు లొంగని రాష్ట్రాలకు, కేటాయింపుల్లో, సబ్సిడీలలో కోత విధిస్తుంది.

ఈ విధానాల వల్ల రైతులకు ఒరిగేదేమిటి? అన్ని గొట్టపు బావులు, నీటిపారుదల మోటార్లు, స్మార్ట్ మీటర్లతో అనుసంధానిస్తారు. మీటరును మార్చడానికి ప్రతి ఆరేండ్లకు ఒకసారి పునరావృతమయ్యే ఖర్చు రూ.15 వేలు వినియోగదారులపై పడుతుంది. ఇది రైతులకు, పేదలకు ఇచ్చే ఉచిత విద్యుత్ శాశ్వత రద్దుకు దారితీస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం ఈ ఉచ్చులో చిక్కింది. ఈ విధానం వ్యవసాయానికి, ఆహార భద్రతకు మరణ శాసనం అవుతుంది. ఇది అన్ని వర్గాలు ఏకమై ప్రతిఘటించాల్సిన విషయం. కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం టోటెక్స్ (టోటల్ ఎక్స్ పెండీచర్ మోడల్) నమూనా, స్మార్ట్ మీటర్లను నిరోధించడానికి మార్గాన్ని చూపింది. రైతులు, వినియోగ దారులపై ప్రతికూల ప్రభావం పడే విధానాలను అనుమతించబోమని కేరళ ప్రభుత్వం తేల్చిచెప్పింది. కేంద్రప్రభుత్వం నిర్దేశించిన రోడ్ మ్యాప్‌తో రహస్యంగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఉన్నతాధికారుల బుకాయింపులను, మోసం చేసే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను సిఐటియు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సకాలంలో బయట పెట్టాయి. ఇటువంటి ప్రతిఘటనలు మరెన్నో రావాలి. విధ్వంస చర్యలకు, మోసంతో కూడిన కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా అందరం ఏకం కావాలి. ■



కార్మికుల పక్షాన పోరాడే 'సీఐటీయూ'ని గెలిపించండి

- ఎస్‌సీఈయూ రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు

- జేవీఆర్, కిష్టారం ఓసీల్లో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-సత్తుపల్లి

నిత్యం కార్మికుల పక్షాన పోరాడే సీఐటీయూని ఈనెల 27న జరిగే గుర్తింపు సంఘ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజారిటీతో కార్మికులు గెలిపించుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎస్‌సీఈయూ) రాష్ట్ర కార్యదర్శి మందా నరసింహారావు కోరారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం సత్తుపల్లిలోని జేవీఆర్, కిష్టారం ఓసీలో నరసింహారావు సీఐటీయూ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించడం ద్వారా కార్మికుల సొంతింటి కలను నెరవేరుస్తామన్నారు. ప్రతి కార్మికునికి 250 గజాల ఇంటిస్థలంతో పాటు రూ. 3లక్షలు సింగరేణి యాజమాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాజర్, వెంకటేశ్వరరావు, సమ్మయ్య, కొలికపోగు సర్వేశ్వరరావు, పిట్ కార్యదర్శి ప్రకాశ్, మంగరాజు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ- కామేపల్లి

ఇటీవల అనారోగ్యంతో మతి చెందిన పోలే పంగు వీరయ్య కుటుంబాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, గ్రామ శాఖ నాయకులు పరామర్శించారు. అనంతరం పొన్నెకల్లు గ్రామశాఖ తరపున 10వేల రూపాయల ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, నాయకులు నాగండ్ల వెంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు వల్లభనేని అశోక్, పంచాయతీ పాలకమండలి సభ్యులు శిలా సాగర్, నాగేశ్వరరావు, కుర్ర శ్రీకాంత్, దండుగుల నాగయ్య, బంక నాగేశ్వరరావు పాల్గొన్నారు.



క్రీడలతో మానసిక దృఢత్వం

శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్ చైర్‌పర్సన్ హృదయ మేనాన్

నవతెలంగాణ-ఖమ్మం

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్ చైర్‌పర్సన్ హృదయ మేనాన్ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని పోలీస్ హెడ్ అవరణలోని శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలను స్కూల్ చైర్‌పర్సన్ జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. నేటి కాలంలో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అదే స్ఫూర్తితో క్రీడల పట్ల దృష్టి సారిస్తే మానసికోల్లాసం, చురుకుదనం, సమయస్ఫూర్తి, పోరాట పటిమ, క్రమశిక్షణ, వంటి లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. మంగళవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి ముగింపు సందర్భంగా బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.



అసంక్రమణ వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ- ఎర్రుపాలెం

అసంక్రమణ వ్యాధులకు గురి కాకుండా ప్రతిరోజు శారీరక శ్రమ వ్యాయామం యోగా వంటి వాటితో పాటు సమతులిత ఆహారం తీసుకోవాలని వీటిపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ పుష్పలత ఆశ కార్యకర్తలకు సూచించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పుష్పలత ఆధ్వర్యంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా అసంక్రమణ వ్యాధుల నివారణలో భాగంగా 30 సవంత్సరాల వయస్సు పైబడిన వారందరికీ బిపి, షుగర్, క్యాన్సర్ వంటి పరీక్షలు నిర్వహించి ఈ వ్యాధులతో ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశిపూర్ణ, వెంకట్ లాల్, సిహెచ్ఓ కాంతమ్మ, పిహెచ్ఎన్ రాణి, సూపర్‌వైజర్లు జె.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, పద్మావతి, హెల్త్ అసిస్టెంట్లు శాయిరెడ్డి, సుధాకర్, అశోక్, వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



శివుడికి అన్నాభిషేకం

2500 మందికి మహా అన్నదానం

నవతెలంగాణ-కల్లూరు



కార్తీకమాసం ముగింపు సందర్భంగా భక్తుల సహకారంతో కల్లూరు సమీపంలోని కాశ్మీర మహాదేవ క్షేత్రం (శివాలయంలో) మంగళవారం 108 కేజీల అన్నంతో అర్చకులు మద్దుకూరి సురేష్ శర్మ, పొద్దుటూరు శివ, ఆధ్వర్యంలో శివుడికి అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం సుమారు 2500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో ఆలయం మేనేజర్ ఎస్‌డివి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, బిఆర్ఎస్ నాయకులు పెద్ద బోయిన నారాయణ, పెద్దలు కిష్టం శెట్టి నరసింహారావు, కిష్టం శెట్టి కొండలరావు, కాగితం పఠ్ణి, వీరయ్య మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నవంబరు నెల పెన్షన్ వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ- ఖమ్మం



రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల నవంబరు నెల పెన్షన్ ఇప్పటి వరకు ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల పెన్షనర్లు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.గోపీచంద్, కల్యాణం నాగేశ్వరరావులు అన్నారు. పెన్షనర్ల ఇబ్బందులను తెలియజేస్తూ జిల్లా ఖజానా అధికారి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకొని వెంటనే పెన్షన్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వీరబాబు, యేశోబు, రాములమ్మ, మాధవరావు, స్వామి, భారతి, బీబి శ్రీధర్, మధు, రవికుమార్‌లు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తాను

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ- ఖమ్మం



అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరగడానికి కృషి చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. మంగళవారం అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర నాయకులు కూనంనేని సాంబశివరావును ఖమ్మంలో కలిసి తెలంగాణ రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అగ్రిగోల్డ్ బాధితులు అందరికీ డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని, అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించడానికి ప్రయత్నం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షు రాలు గుడిమెట్ల రజిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులు 5 లక్షల మంది ఉన్నారని, అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తుల విలువ సుమారుగా రూ.1000 కోట్లు ఉంటుందని, అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించాల్సిందని, కేవలం 500 కోట్లు మాత్రమేనని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను స్వాధీనం చేసుకుని బాధితులకు డబ్బులు చెల్లిస్తుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను స్వాధీనం చేసుకుని బాధితులకు డబ్బులు చెల్లించే విధంగా చూడాలని, అగ్రిగోల్డ్ సమస్యను నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర నాయకులు నల్లబోలు సునీత, ఎన్.అనసూర్య, పుష్ప, రాజకుమారి, మునగంటి వీరబ్రహ్మాచారి, పుచ్చకాయల రాంబాబు, ఎస్.డి. పాషా, వి.రాజు, కె.కష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కూనంనేనికి ఘన స్వాగతం

రఘునాథపాలెం: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుకు వి.వెంకటాయపాలెం గ్రామంలో సిపిఐ, కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కొత్తగూడెం శాసన సభ్యులుగా ఎన్నికైన కూనంనేని సాంబశివరావు విజయోత్సవ ర్యాలీ, అభినందన సభ మంగళవారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నుంచి అభినందన సభకు వస్తున్న కూనంనేని సాంబశివరావుకు వి. వెంకటాయపాలెం గ్రామం వద్ద సిపిఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి రావెళ్ల సురేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఐ నాయకులు కిలారు వెంకటరమణ, కుతుంబాక సీతారాం, గరిడి రాంబాబు, అమరనేని వెంకటేశ్వర్లు, కిషోర్, శాఖమూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యంపేట గ్రామ సమస్యలను పరిష్కరిస్తా

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్

- గ్రామస్తులతో ఎమ్మెల్యే సమావేశం

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యంపేట గ్రామ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. మంగళవారం గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అక్కడి ప్రజలు, అధికారులతో సమావేశం జరిపారు. ఇచ్చిన మాట ప్రకారం గెలిచిన 9రోజుల్లోనే గ్రామానికి రావడం జరిగిందన్నారు. 15యేండ్లుగా సత్యంపేట వెనుకబడి ఉండటం శోచనీయమన్నారు. ఇప్పటి వరకు గ్రామం రెవెన్యూ పరిధిలో లేకపోవడం గత ప్రభుత్వాల వైఫల్యమన్నారు. మా ఇంటి తలుపులు 24 గంటలు తెరిచే ఉంటాయని, ఫోన్‌చేసి కూడా సమస్యలను చెప్పవచ్చని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అన్నారు. గ్రామస్తులు వెలిబుచ్చిన సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికక్కడే గ్రామ సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. సీసీ రోడ్లు, అంగన్వాడీ భవనం, విద్యుత్ లైన్ల ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాల పంపిణీ, బాసారం నుంచి సత్యంపేట గుడి వరకు రహదారి నిర్మాణం, సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్స్ వల్ల ఏర్పడుతున్న సమస్యలు, రేషన్ కార్డులు ఇలా అనేక సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ రోజున సత్యంపేట ఓటర్లు ఓట్లు వెయ్యకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆందోళన చేసినప్పుడే మీ ఆవేదన మాకు అర్థమైందన్నారు. ఆరోజు చెప్పిన విధంగా ఎమ్మెల్యేను, అధికారులను తీసుకొని మీ ఊరికి వచ్చానన్నారు. వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని, గ్రామ సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని ఆయన గ్రామస్తులకు తెలిపారు. ఈ సమావేశంలో రుద్రాక్షపల్లి సర్పంచ్ చిలకమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నాగజ్యోతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివా వేణు పాల్గొన్నారు.



జేవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 'ఇండస్ట్రియల్' టూర్

- కాకతీయ సిమెంట్స్ అండ్ షుగర్ ఫ్యాక్టరీ సందర్శన

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల థర్డ్ బీఎస్సీ (బోటనీ) విద్యార్థులు పారిశ్రామిక సందర్శన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కల్లూరులోని కాకతీయ సిమెంట్స్ అండ్ షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. చక్కెర ఉత్పత్తి చేస్తున్న విధానాల్లోని క్రషింగ్, జ్యూసింగ్, క్రిస్టలైజేషన్ (స్ఫటికీకరణ), ప్యాకింగ్ తదితర దశలను విద్యార్థులు అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చక్కెర పరిశ్రమలోని వ్యర్థాలైన మొలాసిస్, ఫిల్టర్ కేక్, బ్రౌన్ షుగర్ వంటి వాటి ఉపయోగాలను అధ్యయనం చేశారు. పాఠ్యాంశంలోని ఆర్థిక వృక్షశాస్త్రంలోని చక్కెర ఉత్పత్తి సాగు వ్యర్థాలు, విద్యుత్ ఉత్పత్తిలోని చక్కెర పరిశ్రమ వ్యర్థాల గురించి చదివిన వాటిని విద్యార్థులు ఈ టూర్ ద్వారా క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. ఇలాంటి క్షేత్రస్థాయి సందర్శనల వల్ల విద్యార్థుల్లో పాఠ్యాంశాల పట్ల ఎక్కువ ఆసక్తిని చూపుతారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే విజయకుమార్ అన్నారు.

ఎస్‌బీఐటీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం ఎస్‌బీఐటీలో ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సియస్‌సి మొదటి సంవత్సరం విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదుకు దీటుగా తమ కళాశాలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పలు బహుళజాతి కంపెనీలతో యమ్.ఒ.యు. ఒప్పందాలను కుదుచ్చుకొని ఆయా కంపెనీలతో విద్యార్థులు ప్లేస్మెంట్లు సాధించేందుకు అవసరమైన శిక్షణలు, అవగాహనా కార్యక్రమాలతో పాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం ఎస్బిఐటిలో కళాశాల విద్యార్థులు గత సంవత్సరం ఇటువంటి విధానాల వల్ల రికార్డు స్థాయిలో ప్లేస్మెంట్లు సాధించటం గర్వకారణం అన్నారు. తమ కళాశాలలో విశేష అనుభవం కలిగిన అధ్యాపకులను ఏర్పాటు చేసి విద్యాబోధన గావిస్తునట్లు పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో స్థిరపడేందుకు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలన్నారు. దీనితో పాటు కళాశాలలో మంచి స్నేహితులను ఎంచుకొని వారి సలహాలు, సూచనలతో పాటు సీనియర్లతో సత్సంబంధాలు కలిగి వారి సలహాలు, సూచనలు కూడా తీసుకోవాలన్నారు. అదే విధంగా కళాశాలకు విధిగా హాజరవుతూ అధ్యాపకులు బోధించే అంశాలను నేర్చుకోవాలన్నారు. తద్వారా తల్లిదండ్రుల కలలను నెరవేర్చే విధంగా విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవచ్చని సూచించారు. తమ కళాశాలలో నూతన సాంకేతికతకు అనుగుణంగా భవిష్యత్తులో కూడా పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణం రూపొందించామని తెలిపారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో స్థిరపడేందుకు యాజమాన్యం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షకు అనుగుణంగా వారి పిల్లలను తయారుచేసేందుకు యాజమాన్యం కృషి చేస్తుందని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు సమాజంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులకు ప్లేస్మెంట్స్ లక్ష్యంగా తమ కళాశాలలో బోధన జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.అమిత్ బింధాజ్, ఎకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ జె.రవీంద్రబాబు, డాక్టర్ యస్.శ్రీనివాసరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు మైనారిటీ గురుకుల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-కొణిజర్ల



అండర్14 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు మండల పరిధిలోని మైనార్టీ గురుకులానికి చెందిన విద్యార్థి షేక్ ముబీన్ ఎంపికైనట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సైదులు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల క్రీడలు అండర్ 14 విభాగంలో ఈ నెల7, 8, 9 హన్మకొండలో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని డిస్కస్ త్రో అండ్ షాట్‌పుట్‌లో బంగారు పతకాలను సాధించి 14, 15, 16, 19 తేదీలలో లక్నో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఎంపికైనట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ముబీన్‌ని ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలో సైతం ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎల్సి(ఖమ్మం) ఎంజె అరుణ కుమారి, విజిలెన్స్ ఆఫీసర్స్ సీతారాములు, జమీల్ పాష, పిఇటి వి.హరీష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ - బోనకల్

తుఫానుతో మండలంలో మిర్చి, పత్తి, వరి రైతులు నష్టపోయారని తక్షణమే అధికారులు క్షేత్రస్థాయిలో పంటల నష్టతీవ్రతను అంచనా వేసి నష్టపరిహరం కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు జిల్లా వ్యవసాయ అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని రైతులను సిపిఐ, రైతు సంఘం నాయకులు పరామర్శించి పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కొత్తగా ఏర్పడ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే తుఫాన్ బాధిత ప్రాంతాలలోని నష్టపోయిన రైతులకు ధైర్యం కల్పించే దిశగా నష్టపరిహర చర్యలు చేపట్టి, రైతులను ఆదుకోవాలని కోరారు. బ్రాహ్మణపల్లి గ్రామాన్ని ఇంతవరకు వ్యవసాయ అధికారులు సందర్శించకపోవడం బాధకరమన్నారు. మధిర ఏడి కొంగర వెంకటేశ్వరరావుతో రైతుల సమక్షంలో చరవాణి ద్వారా మాట్లాడారు. తక్షణమే అధికారులను పంటలను పరిశీలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు పారుపల్లి నరసింహరావు, రైతు నాయకులు వూట్ల కొండలరావు, చెరుకూరి వెంకటేశ్వరరావు, ఏలూరి రమేష్, మడుపల్లి వెంకటేశ్వర్లు, చావా నరసయ్య, చావా వీరభద్రం, వంగాల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ- బోనకల్

మండల కేంద్రంలో 108 వాహనంను హైదరాబాదుకు చెందిన ఆడిటర్ కిషోర్, జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ భూమ నాగేందర్, జిల్లా ఈఎంఈ ప్రణయ్, భద్రాచలం ఈఎంఈ సాయికుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది పనితీరును ప్రశంసించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదే విధంగా సిబ్బంది ఈఎంటి నంద్రు మనోహర్, పైలట్ మర్రి వంశీని అభినందించారు.

మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ- ఖమ్మం



రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిదని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం టిటిడిసిలో మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలపై స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కేంద్ర బిందువుగా చేసుకొని మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా, సమాజంలో, ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం కావాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో స్వయం సహాయక సంఘాల పాత్ర కీలకమని ఆయన అన్నారు. వయస్సు, ఆర్థిక తేడాలు లేకుండా మహిళలందరూ ఉచితంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణం చేయవచ్చన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలి, విద్యావంతులు కావాలనే ప్రభుత్వ సంకల్పమని ఆయన తెలిపారు. చదువు, నైపుణ్యం, తెలివితేటలు ఉండి, ఉన్న ఊరులో సరైన ఉపాధి దొరకక, దూర ప్రాంతాలకు వెళ్లి రవాణా ఖర్చులకు భయపడి ఉపాధికి దూరం అవుతున్నారని, ఉన్నత చదువులకు రవాణా భారం భరించలేక దూరం అవుతున్నారని, ఈ పథకంతో ఈ ఇబ్బందులు పూర్తిగా తీరనున్నాయని ఆయన తెలిపారు. మహిళల లేబర్ ఫోర్స్ రోజు రోజుకు తగ్గుతుందని, పది సంవత్సరాల క్రితం 40 శాతం ఉంటే, ఇప్పుడు 21 శాతానికి చేరుకుందని ఆయన తెలిపారు. మహాలక్ష్మి పథకం మహిళల లేబర్ ఫోర్స్ పెరుగుతుందని, దీనితోనే అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. చేయూత క్రింద ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల రూపాయల నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం క్రింద 10 లక్షల రూపాయలకు పెంచినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని టి హబ్‌లో 115 రకాల పరీక్షలు చేపడుతున్నట్లు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానల్లో నమూనాలు సేకరించి, జిల్లా కేంద్రంలోని టి హబ్‌కు పంపుతారని, పరీక్షల రిపోర్టులు ఫోన్లకు వస్తాయని ఆయన అన్నారు. వైద్య రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో విద్యాచందన, ఆర్టీసీ ఆర్ఎం సిహెచ్. వెంకన్న, జిల్లా సంక్షేమ అధికారి సుమ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మాలతి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, డీఆర్డీఏ ఏపీఎం, డిపిఎం, ఏసీ లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకులు కమల్ మృతి

నవతెలంగాణ-కామేపల్లి

బర్లగూడెం గ్రామంలో యూత్ కాంగ్రెస్ నాయకులు జల్ల కమల్ (29) మృతి చెందారు. కమల్ భౌతికదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి, పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి వారి కుటుంబ సభ్యులు ను ఓదార్చి, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాలోత్ సరిరామ్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బానోతు బాబు నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు దేవుళ్ళ రామకృష్ణ, నా గళ్ళ వెంకటేశ్వరరావు, భూక్య బాలు నాయక్, భూక్య కిషన్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ జల్లా శ్రీనివాస్, బానోతు చిన్నానాయక్, మాజీ సొసైటీ డైరెక్టర్ బానోతు సంతు నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు, వల్లభనేని అశోక్, మాలోత్ ప్రేమ్ కుమార్ శిలా సాగరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గెలుపు ఓటములు సహజమే

- గెలిచినా ఓడినా ప్రజల పక్షాన ఉండి పోరాటాలు చేసేది ఎర్రజెండా పార్టీ సీపీఐ(ఎం)
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ

నవతెలంగాణ-కామేపల్లి

రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేసి ఒక బలమైన పార్టీగా నిలబడింది ఒక్క సీపీఐ(ఎం) మాత్రమేనని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ అన్నారు. పార్టీ కామేపల్లి మండల జనరల్ బాడీ సమావేశం మండల కేంద్రంలోని గుండా బిక్షమ్మరెడ్డి భవనంలోని బాగం నాగయ్య మీటింగ్ హాల్లో సీనియర్ నాయకులు వింజం నాగభూషణం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన దుగ్గి కృష్ణ మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమేనని, ప్రజలపక్షాన నిలబడి పోరాటాలు చేసేది నిలబడేది ఎర్రజెండా పార్టీ సిపిఎం ఒక్కటేనన్నారు. మతోన్మాద పార్టీ బిజెపిని గద్దె దించడమే సిపిఎం ధ్యేయం అన్నారు. పార్టీ కార్యకర్తలు నీతి నిజాయితీకి కట్టుబడి నిబద్ధతగా పనిచేశారని అన్నారు. వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు. ఎవరు కూడా అధైర్యపడవలసిన అవసరం లేదని అందరికీ అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కామేపల్లి మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, మండల కమిటీ సభ్యులు గుండా వెంకటరెడ్డి, బాధాతు శ్రీను, అడప ఉపేందర్, కిన్నెర రామచంద్రయ్య, బాలకృష్ణ, ఉపతల వెంకన్న, కాటినేని కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మా ఉపాధ్యాయుడు మాకే కావాలని విద్యార్థుల ధర్నా

పాఠశాల గేటు ముందు ఎండలో కూర్చొని ఆందోళన

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుడు తిరిగి తమ పాఠశాలకు రావాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కాకరవాయి పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కాకరవాయి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన శివరాంమ్ అనే ఉపాధ్యాయుడ్ని పైనంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేరని మూడు నెలల క్రితం డిప్యుటేషన్ వేశారు. ప్రస్తుతం పైనంపల్లి ఆ పాఠశాలకు ఓ టీచర్ ను కేటాయించినప్పటికీ ఆ టీచర్ మెడికల్ లీవ్ పెట్టి వెళ్లడంతో డిప్యూటేషన్ మీద వెళ్లిన కాకరవాయి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు శివరామ్ ను పైనంపల్లి పాఠశాలలో అలాగే కొనసాగిస్తున్నారని ఇప్పుడు కాకరవాయి పాఠశాలకు ఉపాధ్యాయుడు లేడని ఆ పాఠశాల విద్యార్థులు సోమవారం తరగతులకు వెళ్లకుండా తల్లిదండ్రులతో కలసి పాఠశాల ముందు ఆందోళన చేశారు. పాఠశాలను పరిరక్షించాలని, మా చదువులు కొనసాగించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 200 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తెలుగు సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులు లేరని 10వ తరగతి బోర్డ్ ఎగ్జామ్ ఇంకా మూడు నెలలు ఉండటంతో తమ పాఠశాల ఉపాధ్యాయుడని పైన పల్లిలో డిప్యూటేషన్ పై కొనసాగిస్తే తమ చదువులు ఎలా కొనసాగుతాయని, మా ఉపాధ్యాయుడు మాకే కావాలంటూ పాఠశాల గేటు ముందు ఎండలో కూర్చొని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఎండ తీవ్రతకు విద్యార్థులు సొమ్మసిల్లిపోతున్నారని విద్యాశాఖ పై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురిపై ఫోక్స్ కేసు నమోదు

నవతెలంగాణ-కల్లూరు

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తితోపాటు అతని తల్లిదండ్రులపై ఫోక్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పీ.రఘు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం కిష్టయ్య బంజర గ్రామానికి చెందిన యువతని పెళ్లి చేసుకుంటానని చెప్పి అదే గ్రామానికి చెందిన నాగబాబు అనే వ్యక్తి శారీరక సంబంధం పెట్టుకొని చివరికి పెళ్లి చేసుకోమంటే నిరాకరించడంతో యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగబాబు పాటు అతని తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ..వ్యక్తి మృతి

నవతెలంగాణ- ఖమ్మంరూరల్

ఓ ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో వాహనదారుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కరుణగిరి వద్ద గల మున్నేరు వంతెనపై మంగళవారం చోటు చేసుకుంది.రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంనగరం దానవాయిగూడెం ప్రాంతానికి చెందిన మద్దెల ఉపేందర్(39) ఖమ్మంలోని కూరగాయల మార్కెట్లో రిక్షాతోలుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ద్విచక్రవాహనంపై మార్కెట్ నుంచి కరుణగిరి వైపు వెళ్తుండగా మార్గమధ్యలో కరుణగిరి మున్నేరు వంతెనపై వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఉపేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.ప్రమాదంపై మృతుని భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షాకిర్ తెలిపారు.

సారథినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వెంటనే ఉపయోగంలోకి తేవాలి

కలెక్టర్‌కు మంత్రి తుమ్మల ఆదేశం

నవతెలంగాణ-ఖమ్మం

గతంలో తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిర్మాణం పూర్తైన సారథినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి కొన్ని రాజకీయ కారణాల వలన ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదని, తిరిగి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఎన్నికల ప్రచారంలో సారథినగర్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా నేడు రైల్వే అండర్ బ్రిడ్జిని వెంటనే ఉపయోగంలోకి తేవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన అండర్ బ్రిడ్జి అందుబాటులోకి రానున్నడంతో సారథినగర్ ప్రజలు హర్షాతిరేఖాలు వెలిబుచ్చారు.

నేటి నుండి తపాలా ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-వైరా



తపాలా శాఖలోని ఏఐజీడీఎస్‌యు (ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్) ఎన్‌యుజిడిఎస్ (నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ల) ఆధ్వర్యంలో జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో బాగంగా వైరా మండలంలోని 25 గ్రామాలలో గల బ్రాంచి పోస్ట్ ఆఫీసు లలో సంపూర్ణంగా సమ్మె చేస్తున్నట్లు ఎఐజిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 12, 24, 36 సంవత్సరాల సర్వీసు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, ఇన్సెంటివ్ మీద చేస్తున్న అన్ని పనులను అదనపు పని భారం అని గుర్తించాలని, గ్రూపు ఇన్స్యూరెన్స్ సౌకర్యం 5 లక్షలు ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని, గ్రాడ్యూటి 5 లక్షలకు పెంచాలన్న డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె మహమ్మద్, ఎస్.వెంకట రెడ్డి, మేడూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూలీల కొరత



- ఇప్పటికే అకాల వర్షానికి తడిసిన పత్తి
- కూలీల కోసం రైతులు వెతుకులాట
- తీరిక లేదంటున్న కూలీలు
- చేనులో పత్తి పంట
- భారంగా మారిన వ్యయసాయం

నవతెలంగాణ-ముదిగొండ

ఆరుగాలం చెమటొచ్చి రైతులు పంటలు పండించడం ఒక ఎత్తైతే, సాగు చేసిన పంటలను రక్షించుకోవడం రైతులకు మరో ఎత్తు అవుతుంది. ఈ ఏడాది వర్షాకాలం పంటల సీజన్లో సమృద్ధిగా వర్షాలు పడక రైతులు పంటలు సాగు అష్ట కష్టాల మధ్య మొదలైంది. అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు అరా కోరాగా సాగు చేసిన పత్తి ఆశాజనకంగా లేదు. రైతుల మెట్ట పొలాలలో వర్ష ఆధారంపై పండే పత్తి పంటలు మండలంలో ప్రతి పల్లెలో రైతులు సాగు చేశారు. ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు మాసాలలో వర్షాలు పడక ఎండలు విపరీతంగా పెరిగి రైతులు సాగు చేసిన పత్తి పంటలు వాడిపోతుండగా వ్యవసాయ బావులు ఉన్న రైతులు మోటార్ల ద్వారా పత్తికి తడి కట్టి పత్తి సాగును బతికించారు. వర్షాధారంపై పండే పత్తి పంట ఎండిపోయింది. సెప్టెంబర్, అక్టోబర్, మాసాలలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పత్తి కొంత మేరకు సాగయింది. మండలంలోని గ్రామ, గ్రామాన రైతులు సాగుచేసిన పత్తి చేలలో పత్తిని తీసేందుకు కూలీలు కొరత ఏర్పడటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి రైతులు పత్తిని పండించగా మార్కెట్లో పత్తికి కనీస మద్దతు ధర కూడా లేదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి అన్నదాతలు పత్తిని సాగు చేస్తే పత్తి తీతకు కూలీలు కొరత ఉండటంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో మరో తుఫాన్ ప్రభావంతో అకాల వర్షాలు కురిసి చేతి కందిన పత్తి తడిసిపోవడంతో రైతులు లబోదిబోమన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో రైతుల పొలాల్లో ఉన్న పత్తిని తీసేందుకు కూలీలు కొరత ఉండటంతో సమీప గ్రామాల్లోకి వెళ్లి రైతులు కూలీల కోసం వెతుకులాట ప్రారంభించారు. కూలీలు తీరిక లేదంటూ రైతులకు సమాధానం చెప్పడంతో రైతులు ఏం చేయాలో తెలియక నిట్ట నిలువన ఉన్న పత్తి చేలు, పత్తి తీయకుండా అలానే దర్శనమిస్తున్నాయి. పత్తితోపాటు, మండలంలో రైతులు మిర్చి, వరి, మొక్కజొన్న పంటల సాగు చేశారు. మండలంలో ఇటీవల కురిసిన మిగ్ జామ్ తుఫాన్ దెబ్బకి పంటలు మొత్తం తడిసి అన్నదాతలకు తీవ్రనష్టం వాటిల్లింది. నోటి కాడికి వచ్చిన పంటలు నోటి కందకుండా పోవడంతో రైతులు దిగాలుగా పొలాల దగ్గరికి వెళ్లి పంటల వైపు దీనంగా చూస్తూ కూలీల కోసం ఎదురుచూస్తున్నారు. సాగు చేసిన పంటలను రక్షించుకోవడం కోసం సమయానుకూలంగా కూలీలు రాకపోవడంతో రైతులు నరకయాతన పడుతున్నారు. పత్తి, మిర్చి తీతలకు కూలీల కొరత ఉండటంతో వ్యవసాయం, వ్యయసాయంగా మారి రైతులకు పెను భారంగా మారింది. రానున్న కాలంలో కూలీల కొరత ఇలానే ఉంటే వ్యవసాయం చేయడం కష్టమేనని పలువురు రైతులు వాపోతున్నారు.



చల్లా రంగయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ మాజీ ఎంపీపీ చల్ల రంగయ్య(65) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. పార్థివ దేహాన్ని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మంగళవారం సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్న రంగయ్య ఎస్ఎఫ్ఐలో డీవైఎఫ్ఐలో ప్రజానాట్యమండలిలో పనిచేసే పార్టీలో వివిధ పదవుల్లో పూర్తి కాలం కార్యకర్తగా పనిచేశారన్నారు. 1995 నుండి 2000 సంవత్సరం వరకు తల్లాడ మండల ప్రజా పరిషత్ అధ్యక్షునిగా మండల ప్రజలకు ప్రజాప్రతినిధిగా సేవ చేశారని, తన చివరి వరకు పార్టీ అభివృద్ధి కోసం పని చేశారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీ కోసం కృషి చేసిన చల్లా రంగయ్య మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం పనిచేయటమే ఆయనకు ఇచ్చే నిజమైన, నివాళి అన్నారు. రంగయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మాచర్ల భారతి, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, తాతా భాస్కరరావు, తాళ్లపల్లి కృష్ణ, అయినాల రామ లింగేశ్వర రావు, నల్లమోతు మోహన్ రవు, షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వరరావు, పులి కృష్ణయ్య, వెంకట నర్సయ్య, శ్రీనివాసరావు, రాజబోయిన సైదులు ఏలూరు కోటిరెడ్డి, తదితరులు, నివాళులు అర్పించారు.

కుష్టు వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు

నవతెలంగాణ-కామేపల్లి

కుష్టు వ్యాధి బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కామేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసిబ్బందికి, ఆశాలకు, ప్రజలకు ప్రభుత్వ వైద్య అధికారులు డాక్టర్ నెల్లూరు చందన, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలి : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం



జిల్లాలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ రహదారులు, ఇరిగేషన్, మూడవ రైల్వేలైన్ భూసేకరణ, పనుల పురోగతిపై కలెక్టర్, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఇంకా పూర్తి చేయవలసిన పనులు, పరిహారం చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ, కెనాల్ పనులు, రైతులకు పరిహారం చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మూడవ రైల్వేలైన్ భూసేకరణ, రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణంకు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీకి సంబంధించి రేజర్ల, కిష్టారం, ఎర్రగుంట గ్రామాలలో భూసేకరణ పూర్తి చేసి సింగరేణి సంస్థకు అప్పగించాలన్నారు. పెండింగ్ భూసేకరణ నోటిఫికేషన్ అవార్డు, పరిహారం చెల్లింపు ప్రక్రియకు చర్యలు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం, కల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు జి. గణేష్, యస్. అశోక్ చక్రవర్తి, ఖమ్మం జాతీయ రహదారుల శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి. దుర్గాప్రసాద్, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏ.డి. శ్రీనివాసులు, రైల్వే శాఖ డిప్యూటీ సీ.ఈ. నాయుడు, రహదారులు, భవనాల శాఖ ఇ.ఇ. శ్యాంప్రసాద్, నేషనల్ హైవేస్ ఇ.ఇ. యుగంధర్, సింగరేణి జనరల్ మేనేజర్ సాలెంరాజు, తహశీల్దార్లు, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ బి.రంజిత్ కుమార్, నేషనల్ హైవేస్, ఇరిగేషన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని చింతపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం...చింతపల్లి గ్రామానికి చెందిన అక్కినపల్లి హేమంత్(15) తనికెళ్లలోని ఓ పాఠశాలలో వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం జ్వరం వచ్చిందని కుటుంబ సభ్యులు హేమంత్‌ను ఇంటికి తీసుకొచ్చి ఆసుప్రతిలో చికిత్స చేయించారు.సోమవారం హస్టల్‌కు వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పడంతో తండ్రి రామకృష్ణ ఖమ్మం వరకు కుమారుడు హేమంత్‌తో కలిసి వచ్చాడు. ఖమ్మం నుంచి హేమంత్ హస్టల్ కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తరువాత ఏం జరిగిందో తెలియదు...మంగళవారం ఉదయం ఖమ్మంలోని వినోద సినిమాహాల్ సమీపంలో వంతెనపై అపస్మారక స్థితిలో పడుకొని ఉన్న హేమంత్‌ను స్థానికులు చూసి వెంటనే 108కి సమాచారం ఇవ్వడంతో వారు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తరువాత పాఠశాల నుంచి హేమంత్ తల్లిదండ్రులకు మీ బాబు ఇంకా పాఠశాలకు రాలేదని ఫోన్ చేసి చెప్పారు. వెంటనే హేమంత్ కుటుంబ సభ్యులు తమ కుమారుని అచూకీ కోసం వెతికేందుకు ముందుగా పాఠశాల వద్దకు వెళ్లగా హేమంత్ పాఠశాలకు వచ్చి మళ్లీ కటింగ్ చేయించుకుంటానని చెప్పి బయటికి వెళ్లాడని హేమంత్ స్నేహితులు తెలిపారు. అక్కడి నుంచి ఖమ్మంలో వెతుకుతూ వినోద సినిమాహాల్ సమీపంలో హేమంత్ ఫొటో చూపించి ఆచూకీ తెలుసుకోగా ఉదయం ఓ బాలుడు ఇక్కడే ఉంటే 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించామని అక్కడి వారు బదులిచ్చారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి చూడగా హేమంత్ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు.మెరుగైన వైద్యం కోసం ఓ ప్రయివేటు అసుపత్రికి తీసుకెళ్తుండగా హేమంత్ మృతి చెందాడు. హేమంత్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



రబీ సీజన్లో సాగు వివరాలను నమోదు చేయాలి

ఏవో మందుల రాధ

నవతెలంగాణ-ముదిగొండ

రబీ సీజన్లో రైతులు సాగు చేసే పంటలు వివరాలను నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారిని మందుల రాధ అన్నారు. ముదిగొండ రైతువేదికలో మంగళవారం మండల వ్యవసాయ విస్తరణ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఈవోలు ఏడు క్లస్టర్ పరిధిలో ఉన్న గ్రామాలలో వారిగా రైతులు సాగు చేసే మొక్కజొన్న సాగుతోపాటు ఇతర పంటల నమోదు చేయాలన్నారు. నూతనంగా రైతుబంధుకు దరఖాస్తు చేసుకునే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చేంత వరకు అవకాశం లేదన్నారు. గ్రామాల్లో ఈ విషయాన్ని ఏఈవోలు రైతులకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఏఈవోలు వి.వంశీ, పి.రఘు, పవన్ కళ్యాణ్, మౌనిక, దివ్యమనిషా లిఖిత, ఇందుభవాని పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి మచ్చలను ప్రాథమిక దశలో గుర్తించాలి

నవతెలంగాణ-వైరా

కుష్టు వ్యాధి మచ్చలను ప్రాథమిక దశలో గుర్తించి సమయానుకూలంగా వైద్యం అందిస్తే వ్యాధిని అరికట్టవచ్చని రాష్ట్ర డిప్యూటీ పిఎంఒటి సకలారెడ్డి అన్నారు. రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణా బృందం మంగళవారం వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మొద్దు బారిన కుష్టు వ్యాధి మచ్చలను ప్రాథమిక దశలో గుర్తించి ఎండిటి (మల్టీ డ్రగ్ తెరఫీ) అందించినట్లయితే అంగ వైకల్యం కలగకుండా రోగిని కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో లోకందర్, నరసింహారెడ్డి, అరుణ, జిల్లా డిప్యూటీ పిఎంఒవిఎస్ ఆర్ కె శాస్త్రి, పిఎంఓ బోజ్యా నాయక్, వైరా పిహెచ్‌సి డాక్టర్ ఉదయ లక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ఆల్ గా రిథం పోటీలు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండల పరిధిలో మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఖమ్మం రీజియన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఆల్ గా రిథం- 2023 పోటీలను మంగళవారం నిర్వహించారు. జిల్లా ఇంచార్జ్ ఆర్సీఓ సీహెచ్ జ్యోతి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల మధ్య ఏ పోటీ అయినా స్నేహ పూర్వకంగా ఉండాలన్నారు. గురుకుల పాఠశాలలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఝాన్సీరాణి, వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్ళు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రులకు జర్నలిస్టుల సంఘం అభినందనలు

నవతెలంగాణ-ముదిగొండ



మండల కేంద్రమైన ముదిగొండలో మంగళవారం జర్నలిస్టుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నూతన ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, మంత్రులకు ప్రత్యేక అభినందనలను తెలియజేశారు. మంత్రులుగా మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికైన సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆవుల రామారావు (నవతెలంగాణ), కందిమళ్ళ వీరస్వామి(సాక్షి), యన్.వి రమణ (వి6, వెలుగు), వనం కృష్ణకాంత్ (నమస్తే తెలంగాణ), ఉప్పు కోటేశ్వరరావు (ఆంధ్రప్రభ), దిగుట్ల లక్ష్మణ్ (ఏబిఎన్), గోగుల వెంకటకృష్ణ (వార్త), గొల్లపల్లి అప్పారావు (జనంసాక్షి), కందుకూరి రాకేష్ (దిశ), కటారి క్రాంతి (సూర్య), గద్దం వెంకట్ (నిజం), గుంజులూరి నరేష్ (వార్తమిర్రర్) పాల్గొన్నారు.



ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాం

అధికారులను అభినందించిన కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

అసెంబ్లీ సాధారణ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని, అధికారులు తమ విధులు సమర్థవంతంగా నిర్వర్తించారని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో, కలెక్టర్ ఎన్నికల అనుభవాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరిగాయని, అధికారులను అభినందించారు. ఏ ఏ పనులు బాగా చేశాము, ఏ ఏ పనుల్లో పొరపాట్లు జరిగాయి అనేది ఆలోచన చేసి, తదనుగుణంగా భవిష్యత్తులో ఉపయోగపడేలా డాక్యుమెంట్ చేసుకోవాలన్నారు. జరిగిన పొరపాట్లు ఇకముందు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సువిధ, సి విజిల్ యాప్ లు, వెబ్ కాస్టింగ్ ప్రక్రియ చక్కగా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో వారి వారి అభిప్రాయాలు, ఏ విధంగా విధులు చేపట్టింది, ఇబ్బందులు ఎదుర్కొంది, ఇబ్బందులు ఇకముందు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూలంకషంగా చర్చించారు. వచ్చే ఎన్నికలు ఇంకా బాగా నిర్వహించుటకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఆర్డీవో లు జి. గణేష్, అశోక్ చక్రవర్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ

- ఎమ్మెల్యే జారే



నవతెలంగాణ-దమ్మపేట

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హామీ ఇచ్చినట్టు జిల్లా ఎస్‌పీడీసీఎల్ 327 అధ్యక్షులు రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ శివరంజని తెలిపారు. మంగళవారం వారు అశ్వరావుపేట సబ్ డివిజన్‌కి వచ్చారు. గండగలపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో జారే ఆదినారాయణని మర్యాదపూర్వకంగా కలినట్టు వారు తెలిపారు. ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలు అయిన తర్వాత తప్పకుండా అశ్వరావుపేట సబ్ డివిజన్లో ఉన్న విద్యుత్ కార్మికుల సమస్యల మీద మాట్లాడి పరిష్కరించుకుందామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్రి వెంకటేశ్వరావు, ఓఅండ్ఎమ్ కార్మికులు, ఆర్టిజన్ కార్మికులు, అండ్ మ్యాన్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్వాలకు పలువురి అభినందనలు



నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు పట్ల పలువురు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వైస్ చైర్మెన్, కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావును అభినందించారు. మంగళవారం పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు శాలువా, బొకేలతో సన్మానించారు. యువకులు కొత్వాలను కలిసి గజమాలతో సత్కరించారు. ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

మల్టీపర్పస్ వర్కర్లు పనులు చేయాల్సిందే

- ఎంపీఓ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-పినపాక

గ్రామపంచాయతీలో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లు ప్రభుత్వం నిర్ణయించిన సమయాలకు అనుగుణంగా పని వేళల్లో పనులు నిర్వహించాలని ఎంపీఓ వెంకటేశ్వరావు తెలియజేశారు. మంగళవారం పిరపాక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్లో మల్టీపర్పస్ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వర్కర్లు ఉదయం 6 గంటల్లోపు విధులకు ఒక హాజరై ఉదయం 11 గంటల వరకు పనిచేయాలని, మరల మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు తమకు కేటాయించిన విధుల్లో మరల హాజరు కావాలని తెలియజేశారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ సెక్రటరీలు, మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

అక్రమ కేసులను బేషరత్‌గా ఎత్తివేయాలి

- డీఆర్ఓకి సంయుక్త కిసాన్ మోర్చా సమన్వయ కమిటీ వినతి



నవతెలంగాణ-పాల్వంచ

మోడీ ప్రభుత్వం రైతు నాయకులపై మోపబడిన అక్రమ కేసులను బేషరత్‌గా ఎత్తివేయాలని సయుంక్త కిసాన్ మోర్చా సమన్వయ కమిటీ డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతాంగ ఉద్యమం సందర్భంగా ప్రభుత్వం రైతు నాయకులపై అక్రమంగా మోపబడిన కేసులను రద్దు చేయాలని, యద్వీర్ సింగ్ ప్రయాణాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా రాష్ట్రపతికి జిల్లా కలెక్టర్ల ద్వారా విజ్ఞాపన పత్రం అందజేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓకి సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మోడీ లిఖితపూర్వకంగా రాసి ఇచ్చిన హామీలను సైతం తుంగలోతొక్కి రైతాంగం పట్ల మొండిగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తూ వినతి అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, జిల్లా అధ్యక్షులు బానోతు ఊక్లా, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కుంజా కృష్ణ, జిల్లా నాయకులు వల్లోజ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

15 మందిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త చార్వాక



నవతెలంగాణ-కొత్తగూడెం

క్షుద్ర పూజలు, గుప్త నిధుల పేరుతో 15 మంది అమాయకులను హత్య చేసిన నిందితుడు సత్యం యాదవ్‌ను కఠినంగా శిక్షించాలని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త చార్వాక డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో గుప్త నిధుల పేరుతో ప్రజలను నమ్మించి క్షుద్ర పూజలు చేసి ఆరోగ్యాలను బాగు చేస్తానని మోసం చేస్తూ బాధితుల నుండి లక్షల రూపాయలు కాజేసి, 15 మందిని హత్య చేసిన నిందితుడు సత్యం యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ నిందితుడిని కఠినంగా శిక్షించాలని, అమాయకులైన ప్రజలను మోసం చేస్తున్న భూత వైద్యులను, దొంగ స్వాములను ప్రభుత్వం గుర్తించి అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని, హత్యకు గురైన బాధితులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని చార్వాక డిమాండ్ చేశారు. ప్రజల్లో మూఢనమ్మకాల పట్ల చైతన్యవంతమైన కార్యక్రమాలు ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

సొంత గూటికి చేరిన గద్దల రమేష్

- కండువా కప్పి ఆహ్వానించిన పొదెం



నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో పాల్వంచ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్ గద్దల రమేష్ సొంత గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన కన్నతల్లి లాంటి పార్టీ అని కొత్తగూడెం నియోజక వర్గంలో జరిగిన కొన్ని అనివార్య పరిణామాల నేపథ్యంలో కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టు నిర్ణయం తీసుకోవడం చాలా బాధగా అనిపించినా పార్టీని కాపాడుకోవడం కోసమే అహర్నిశలు కష్టపడుతూ పనిచేశామని గద్దల రమేష్ అన్నారు. జాతీయ పార్టీ పొత్తులో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గం సిపిఐ పార్టీకి కేటాయించడం జరిగిందని కొంతమంది పార్టీ నాయకులు స్వలాభం కోసం సొంత నిర్ణయాలు తీసుకుంటూ పార్టీ క్యాడర్ను పట్టించుకోకుండా ప్రవర్తించిన తీరు బాధగా అనిపించి పార్టీని వీడడానికి నిర్ణయం తీసుకోవడంతో ఎంతో మనో వేదనకు గురయ్యానని అన్నారు. నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు కాంగ్రెస్ పార్టీ తోనే నా జీవనం సాగుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగు మందుతాగి యువకుడు బలవన్మరణం

గుండాల తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన ఓ యువకుడు క్రిమిసంహారకం సేవించి బలవన్మరణం పొందిన ఘటన గుండాల మండలంలో చోటు చేసుకుందని ఎస్సై కె.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గుండాల మండలం కొడవటంచ గ్రామానికి చెందిన ఈసం జనపరాజును (28) తండ్రి బాబు ఆదివారం మందలించాడు. అదే రోజు రాత్రి జనపరాజు పురుగుమందు సేవించాడు.

అది గమనించిన కుటుంబ సభ్యులు గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తనని తరలించారు. సోమవారం తెల్లవారు జామున పరిస్థితి విషమించడంతో జనపరాజు మృతి చెందాడని ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజశేఖర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై ఇల్లందు పట్టణంలో మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించారు.

ఎమ్మెల్యే తెల్లంను సన్మానించిన విశ్రాంత ఉద్యోగులు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం స్థానిక శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట రావును రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సంద్భంగా డాక్టర్ వెంకట్ రావు మాట్లడుతూ మీ అందరి సహకారంతో నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనాని, నేనే మీ కార్యాలయానికి ఈ నెల 31వ తారీఖున వస్తానని మీ అందరితో కొంత సమయం గడుపుతాను అని తెలియచేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ వారి అభిమానానికి కృజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులు డాక్టర్ గోళ్ల భూపతి రావు, కార్యదర్శి వెంకన్న, ఖాదర్, రామచందర్ రావు, శేఖర్, మాణిక్య కుమారి, కన్నయ లాలు, కృష్ణ, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ముక్కోటి అధ్యయనోత్సవాలు

ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న భద్రాద్రి

- 22న తెప్పోత్సవం, 23న ఉత్తర వైకుంఠ ద్వార దర్శనం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

నేటి నుండి జనవరి రెండో తారీకు వరకు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ముక్కోటి ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు సాయంకాలం మిథుల స్టేడియం వద్ద సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. రోజు ఒక రూపంలో సీతారామ చంద్రస్వామి వారు అవతారాలను దాచి భక్తులకు దర్శనం ఇయ్యనున్నారు. నేటి నుండి సీతారాముల నిత్య కళ్యాణం కూడా ఆలయ అధికారులు నిలిపివేసి ఉన్నారు. ముక్కోటి ఉత్సవాలకు భద్రాద్రి మొత్తం సుందరంగా అలంకరించిన ఆలయ అధికారులు ఆధ్యాత్మిక శోభ వెలుపడే విధంగా ప్రత్యేక శ్రద్ధగా తీసుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకల ఏర్పాట్లు చేపట్టారు. ముక్కోటి ఉత్సవాలకు ఆహ్వానాన్ని పలుకుతూ పట్టణంలోని ప్రముఖులతో పాటు వివిధ ప్రాంతాల ప్రముఖులను ఇప్పటికే రామాలయ అధికారులు ఆహ్వానాలు అందించారు. ముక్కోటి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 22వ తారీఖున స్వామివారు హంస వాహనంపై సాయంత్రం నాలుగు గంటల నుండి గోదావరి నదిలో విహరించే తెప్పోత్సవం, 23వ తారీఖున వైకుంఠ ఉత్తర ద్వార దర్శన కార్యక్రమాన్ని రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుండి భక్తులు వేల సంఖ్యలో హాజరై దర్శించుకోనున్నారు. ముక్కోటి అధ్యయనోత్సవాలలో భాగంగా నేడు మత్స్య అవతారం, 14న కూర్మావతారం, 15న వరాహావతారం, 16న నరసింహ అవతారం, 17న వామనావతారం, 18న పరశురామ అవతారం 19న శ్రీరామ అవతారం, 20న బలరామ అవతారం, 21వ తారీఖున శ్రీకృష్ణ అవతారంలో సీతారామచంద్రస్వామి వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అనంతరం జరిగే అతిపెద్ద ఉత్సవం ముక్కోటి ఏకాదశి ఉత్సవం కాగా అంతటి ప్రాధాన్యత గల ముక్కోటి అధ్యయనోత్సవాలకు విచ్చేయున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లను చేపట్టారు. పట్టణంలోని పురవీధులలో స్వాగత ద్వారాలతో పాటు రామాలయ పరిసర ప్రాంతాలు మొత్తం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే విధంగా అలంకరించారు. స్వామివారిని వివిధ రూపాల అవతారాలలో అలంకరించేందుకు వైదిక సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. మరోపక్క సీతారాముల తెప్పోత్సవానికి హంస వాహనాన్ని సిద్ధం చేస్తూనే గోదావరి నది ప్రాంతంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను చేస్తున్నారు.

జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా 'నాగ సీతారాములు'

- క్రీడా సంఘాలు అభినందనలు



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా మాజీ క్రీడాకారుడు నాగ సీతారాములు ఎన్నికయ్యారు. మంగళవారం కొత్తగూడెం తెలంగాణ రాష్ట్ర అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పి.కాశీ హుస్సేన్ పర్యవేక్షణలో జరిగిన జిల్లా ఆమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కమిటీ సమావేశంలో సభ్యులంతా నాగ సీతారాములును గౌరవ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ క్రీడాకారుడైన నాగ సీతారాములు ఈ పదవిలో రెండు సంవత్సరాలు కొనసాగుతారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్‌కు గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన నాగ సీతారాములు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రెజ్లింగ్ క్రీడ అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారాలు అందిస్తూ, జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాగ సీతారాములు ఎంపికైన సందర్భంగా జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ కె.కృష్ణారావు, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ.మొగిలి, జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధి సదానందం, జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.నిహారిక పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు సత్కరించి శుభాకాంక్షలు తెలియ చేశారు.

ప్రకృతి ప్రకోపం.. పట్టించుకోని ప్రభుత్వం

- రైతు వెతలు ఇంతింత కాదయా..



నవతెలంగాణ-అశ్వారావుపేట

చేతికందిన పంట నోటి కందని దీనస్థితి రైతుది. ఆరుగాలం కష్టం చేసినా, ఆర్థికంగా నష్టపోయినా రైతు పై అటు ప్రకృతి ప్రకోపం చూపిస్తే ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి కానరావడం లేదని సన్న చిన్న కారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మీచౌంగ్ తుపానుకు ఉద్యాన పంటలుతో పాటు ఆహారం ధాన్యం పంటలు వరద తాకిడికి గురయ్యాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో సామాన్య రైతు ఆందోళనకు గురి అవుతున్నాడు. కోతకు వచ్చిన వరి ధాన్యం కోసి నూర్పిడి చేసి రాసులుగా సిద్ధంగా ఉంచి నప్పటికీ కొనుగోలు చేసేవారు లేక రోడ్లు పైనా, గృహ పరిసరాల్లో కొందరు ఆర పెడుతుండగా స్థలంలో లేని రైతులు స్మశానంలో ఆర బెట్టడం విచారకరం. అశ్వారావుపేట వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో అశ్వారావుపేట, ఊట్లపల్లి, జమ్మి గూడెం, మద్ది కొండ, అచ్యుతాపురంలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామని చెప్తున్నప్పటికీ నేటి వరకు ఒక్క గింజ అయినా కొనుగోలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ ఐదు పంచాయతీల పరిధిలో ఇప్పటికే సుమారుగా 90 ఎకరాల్లో పంటను కోసి ధాన్యం రాసులుగా ఉంచారు. వాస్తవానికి కొనుగోలు కేంద్రం ప్రాంగణంలోనే ఈ ధాన్యం ఆర పెట్టడానికి, తాలు తొలగించడానికి, అకాల వర్షం సంభవిస్తే రక్షణగా కప్పడానికి ఏర్పాట్లు చేయాలి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఇలాంటి సౌకర్యాలు, వసతులు లేకపోవడంతో రైతులే వారి గృహ పరిసరాల్లో, రహదారులు పై, ఎక్కడా వెసులు బాటు ఉంటే అక్కడ ధాన్యం నొన్ను చేసుకుంటున్నారు. మంగళవారం నవతెలంగాణ పలు పంచాయతీల్లో ధాన్యం రాశులను పరిశీలించి, రైతులు బాధలు అడిగి తెలుసుకుంది. జమ్మి గూడెంలోని పలువురు గిరిజన రైతులు వారికి సరైన స్థలం లేక పొలం సమీపంలోని స్మశానంలోనే ఆర పెట్టుకుంటున్నట్లు దానవు వెంకన్న అనే రైతు తెలిపారు. మరికొందరు రైతులు రోడ్డు పై ఆరబోతకు ఉంచారు. ధాన్యం కొనుగోలు జాప్యం పై ఏఓ నవీన్ వివరణ కోరగా ధాన్యం సేకరణ, కొనుగోళ్ళు వ్యవసాయ పరపతి సంఘాలు చూస్తున్నాయని తెలిపారు. అశ్వారావుపేట పీఏసీఎస్ సీఈఓ విజయం బాబును వాకబు చేయగా వ్యవసాయ శాఖ సిబ్బంది తేమశాతం నిర్ధారించి, మాకు సిఫార్స్ చేస్తే మేము కొనుగోలు చేస్తామని అన్నారు. అటు ప్రకృతి అనుకూలించక, ఇటు ప్రభుత్వం పట్టించుకోకపోతే మా గతి ఏమిటని రైతులు మనోవేదనను వ్యక్తం చేస్తున్నారు.



ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్మించటమే

కామ్రేడ్ చంద్రావుకిచ్చే నివాళి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య
- ఎవరు అధికారంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాడుతాం
- గోదావరి ముంపు నుండి శాశ్వత పరిష్కారం చూపించాలి
- రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా
- అమరజీవి కామ్రేడ్ బండారు చంద్రావు 38వ వర్థంతి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించడమే అమరజీవి కామ్రేడ్ బండారు చంద్రావుకు మనం ఇచ్చే ఘన నివాళి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. భద్రాచలం డివిజన్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరు అమరజీవి కామ్రేడ్ బండారు చంద్రావు 38వ వర్థంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముందుగా బండారు చంద్రావు స్తూపం వద్ద జెండాను పార్టీ జిల్లా కార్యదర్శి కనకయ్య ఆవిష్కరించారు. చందర్ రావు చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్, జీఎస్ శంకర్రావు, బిబిజి తిలక్, ఎం.వి.ఎస్ నారాయణలు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం డివిజన్‌లో ఆదివాసీలు, ఇతర శ్రామిక ప్రజల హక్కుల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ధన్యజీవి కామ్రేడ్ బండారు చంద్రావు అని అన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో 8సార్లు సీపీఐ(ఎం) గెలుపొందిందని, సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధులు కృషి ఫలితంగానే మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధికి నోచుకున్నాయని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సీపీఐ(ఎం) ఓడినా, ఓటింగ్ శాతం తగ్గిన కుంగిపోయేది లేదని, ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా పోరాటం నిర్వహించడం ద్వారానే ఎర్రజెండాను ముందుకు తీసుకుపోవాలని ఆయన అన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్‌లు మాట్లాడుతూ అధికారంలో ఎవరు ఉన్నా ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన పోరాడుతామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన జిల్లా మంత్రులు భద్రాచలం వచ్చిన సందర్భంలో భద్రాచలం ప్రజల ఆకాంక్షకు అనుకూలంగా మాట్లాడకపోవటం ఇబ్బంది కలిగిందని, అయినా ఎన్నికల సమయంలో వివిధ సభలలో వారు వాగ్దానం చేసిన హామీలను అమలు చేయాలని, ప్రధానంగా గోదావరి ముంపు నుండి భద్రాచలం పట్టణం రక్షణకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆయన అన్నారు. రామాలయం అభివృద్ధి భద్రాచలం పట్టణ అభివృద్ధికి నేడు ఎన్నికైన ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో సాగు నీరు తాగునీరు సమస్యలు పరిష్కారానికి ప్రయత్నించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి, కే.బ్రహ్మచారి జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, సున్నం గంగా పార్టీ సీనియర్ నాయకులు జి.శంకర్రావు, బిబిజి తిలక్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, కుంజా శ్రీనివాస్, చుక్కా మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూకి ఒక్క అవకాశం ఇవ్వండి



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి ఎన్నికలలో సిఐటియును గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం పివి కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ డిసెంబర్ 27వ తేదీన జరుగుతున్న సింగరేణి సంస్థలో గుర్తింపు ఎన్నికల్లో ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటు వేసి సిఐటియును గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి కార్మికుడికి రూ.30 నుండి 60 వేల పెరిక్స్ మీద ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ ఇప్పిస్తామని వాగ్దానం చేశారు. సింగరేణి కార్మికులకు సొంతింటి కలను నెరవేరుస్తామని 250 గజాల ఇంటి స్థలాన్ని ఇంటి నిర్మాణానికి సింగరేణి సంస్థ నుండి రూ.30 లక్షలు వడ్డీ లేని రుణాన్ని ఇప్పిస్తామని అన్నారు. గుర్తింపు ఎన్నికల్లో సిఐటియుని గెలిపించాలని కార్మికులను కోరారు. మూడుసార్లు గెలిచిన ఏఐటీయూసీ రెండుసార్లు గెలిచిన టీజీబీకేఎస్ ఒకసారి గెలిచినా ఐఎన్టీయూసీ సింగరేణి సంస్థలో కోల్ ఇండియాలో జరిగిన వేతన ఒప్పందాలను ఎందుకు అమలు చేయలేకపోయాయో కార్మికులకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఏఐటీయూసీ, ఐఎన్టియుసి, టిజిబికేఎస్ సంఘాలు సింగరేణి సంస్థలు ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకోలేకపోయాయని విమర్శించారు. సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఎన్నికల ప్రచార జనరల్ బాడీ సమావేశానికి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు మణుగూరు బ్రాంచ్ ఉపాధ్యక్షులు మాచారపు లక్ష్మణరావు అధ్యక్షత వహించగా సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బీ.మధు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.బ్రహ్మచారి, ఏజే రమేష్, పినపాక నియోజకవర్గం కన్వీనర్ గద్దల శ్రీను, మండల సిఐటియు కన్వీనర్ ఉప్పుతల నరసింహారావు, సిఐటియు మండల నాయకులు సత్ర పల్లి సాంబశివరావు, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు మణుగూరు బ్రాంచ్ నాయకులు టీ.లక్ష్మణరావు, కొడిశాల రాములు, రామ్మూర్తి, విల్సన్, సుమన్, తాళ్లూరి ప్రభాకర్ రావు, ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం



నవతెలంగాణ-మణుగూరు

అన్నదానం మహాదానమని దానధర్మ ట్రస్ట్ నిర్వాహకురాలు గంటా రాధా అన్నారు. మంగళవారం దానధర్మ ట్రస్ట్ నిర్వాహకురాలు ఘంటారాధ మండలంలోని వందపడకల ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు వారి సహాయకులకు దాదాపు 120 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్టు ట్రస్టు రాధా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మనతోపాటు ఉన్న చాలా మందికి కనీసం తినడానికి అన్నం లేక ఇబ్బంది పడుతున్నారని, వారికి ఒక్కపూట అన్నం పెట్టే అవకాశం రావడం మా అదృష్టమని తెలియజేశారు. యువతీ, యువకులు సైతం సేవా కార్యక్రమాల్లో విరివిగా పాలుపంచుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

16న పరుగు పందెం ఛాంపియన్ షిప్ పోటీలు

నవతెలంగాణ- కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగుడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం, అంకంపాలెం గ్రామము, ఆశ్రమ గర్ల్స్ హై స్కూలు గ్రౌండ్స్ నందు జిల్లా క్రాస్ కంట్రీ (పరుగు పందెం) ఛాంపియన్షిప్ నిర్వహిస్తామని భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె.మహీధర్ తెలిపారు. ఈ పోటిలు పురుషులు, మహిళలకు 10 కిలో మీటర్ల పరుగు పందెం, 20 ఏండ్ల లోపు బాలురకు 8 కిలో మీటర్లు, బాలికలకు 6, 18 ఏండ్ల లోపు బాలురకు 6, బాలికలకు 4, 16 ఏండ్ల లోపు బాల బాలికలకు 2, కిలో మీటర్లు పరుగు పందెం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు బహుకరిస్తారని, ప్రతిభ చూపినవారిని ఈ నెల 23వ తేదీ కామారెడ్డిలో జరుగు రాష్ట్ర క్రాస్ కంట్రీ చంపియన్షిప్‌కు పంపుతామని తెలిపారు. కావున జిల్లా లోని అథ్లెట్లు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 3 గంటలకు పిఈటి రవి కుమార్, ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్ 8897648486 రిపోర్టు చేయలని, వివరాలకు పి.నాగేందర్, జిల్లా అథ్లెటిక్ కోచ్ 9963659598ను సంప్రదించాలని తెలిపారు.

ఐఎన్‌టీయూసీని గెలిపించండి



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలిపించాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రచారంలో భాగంగా ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు మణుగూరు ఏరియా జీఎం ఆఫీస్‌లో పనిచేస్తున్న అన్ని డిపార్ట్మెంట్‌లో గల కార్మికులను కలిసి తమ ఓటును గడియారం గుర్తుకు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. డా.సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఐఎన్‌టీయూసీ గుర్తింపు సంఘంగా బాధ్యతలు తీసుకున్న తరువాత మ్యానిఫెస్టోలో ఉన్న ఆరు గ్యారంటీలను సత్వరమే అమలు పరుస్తామని హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ వెలగపల్లి జాన్, కృష్ణ చేతన్, శివ, రవి కుమార్ పాల్గొన్నారు.



మతసామరస్యాన్ని చాటిన ఉర్సు ఉత్సవాలు

- ఒంటెలు, గుర్రాలు బద్దీలతో వైభవంగా జూలుస్
- తరలివచ్చిన భక్త జనసందోహం



నవతెలంగాణ-ఇల్లందు

21వ ఉర్సు ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. హిందూ ముస్లింలు ఐక్యతతో ఆరాధిస్తున్న ఏకైక దైవం ఇల్లందు నెం.2బస్తీలో హజరత్ ఖాసిం దుల్హా దర్గా, అనుసంధానంగా ఉన్న సత్యనారాయణ పురంలోని హజరత్ నాగుల్ మీరా మౌలా చాన్ దర్గహ్. 21వ ఉర్సు ఉత్సవాలు సోమవారం ప్రారంభం కాగా మంగళవారం జూలుస్ నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్దయెత్తున పాల్గొన్నారు. భక్తులు తెల్ల దుస్తులతో ముస్తాబై సందల్ ఊరేగింపులో పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు నెంబర్ 2 బస్తీలోని హజరత్ ఖాసిం దర్గాకు చేరుకున్నారు. అక్కడి నుండి జూలుస్ ప్రారంభమైంది. పట్టణంలోని వివిధ కూడళ్ళ గుండా ప్రదర్శన సాగింది. ఒంటెలు,గుర్రాలు బద్దీలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. భక్తులు తీసుకువచ్చిన ప్రసాదాలను నాగుల్ మీరాకు సమర్పించారు. 2గంటలకు దావతే హజరత్ నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు సలామి నిర్వహించారు. దీంతో ఉర్సు ఉత్సవాలు ముగిశాయి.ఉర్సు ఉత్సవాలు మత సామరస్యాన్ని చాటాయి.



రాజకీయాలకతీతంగా సింగరేణిలో హెచ్‌ఎంఎస్‌ని గెలిపించాలి

- మణుగూరు ఏరియాలో రియాజ్ అహ్మద్ ప్రచారం

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో రాజకీయాలకు సంబంధం లేకుండా ఎన్నికల నిర్వహించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. మణుగూరు ఏరియాలో ఈనెల 27న జరిగే సింగరేణి ఎన్నికల్లో హెచ్ఎంఎస్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. పీకే ఓ సీటు మణుగూరు సింగరేణి ఏరియా ఆసుపత్రిలో పెట్ మీటింగ్ పాల్గొని మాట్లాడారు. సింగరేణి రావాల్సిన బిల్లులు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షురాలు కోడిపల్లి శ్రీలత, బ్రాంచ్ కార్యదర్శి చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బోళ్ల కుమారస్వామి, ఓసి టు ఫిట్ సెక్రటరీ ఓ.రాములు తదితరులు పాల్గొన్నారు.



తుఫాను వలన నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-దమ్మపేట

మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపడ రైతులందరికీ నష్టంపరిహారం ఇవ్వాలని తిరిగి రబీ పంటలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఉచితంగా ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, రైతుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కి అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి ప్రజా పంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము మాట్లాడారు. డిసెంబర్ మొదటి వారంలో సంభవించిన తుఫాను వల్ల పంటలు నష్టపడ్డ రైతాంగాన్నికి అన్ని విధాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వరి, మొక్కజొన్నలకు ఎకరానికి రూ.25 వేలు, పత్తికి రూ.50000, మిర్చి ఎకరానికి లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తాటి సత్యం, కుర్సం ముత్యాలరావు, తామ రాముడు, సోయం సీతారాములు, సున్నం జగన్నాథం, పూజల సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.



స్తంభించిన గ్రామీణ తపాలా సేవలు

నవతెలంగాణ-అశ్వారావుపేట

గ్రామీణ తపాల ఉద్యోగుల అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం సమ్మెబాట పట్టారు. దీంతో మండలంలోని 17 బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లు మూసివేశారు. ఉత్తరాల బట్వాడా, వివిధ పొదుపు పథకాల లావాదేవీలు, ఇన్సూరెన్స్, ఉపాధి హామీ సొమ్ములు లావాదేవీలు నిలిచిపోయాయి. నారంవారిగూడెం, ఊట్లపల్లి, వినాయకపురం, ఆసుపాక, అనంతారం, నారాయణపురం తదితర 17 గ్రామీణ పోస్ట్ ఆఫీసులలో సేవలు నిలిచిపోయాయి. 8 గంటల పని విధానం ప్రయోజనాలతో సహా కల్పించాలని,ఇన్సెంటివ్ విధానాన్ని రద్దుచేసి పని భారం తగ్గించాలని, తదితర సమస్యలతో ఉద్యోగులు సమ్మెబాట పట్టారు.



పల్లెల్లో నిలిచిన తపాలా సేవలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం:

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో పల్లెల్లో తపాల సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. యూనియన్ నాయకులు విద్యాసాగర్ మాట్లాడుతూ తపాల ఉద్యోగులకు కనీస వేతన సవరణ చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్‌వి కోట రెడ్డితో పాటు అన్ని పోస్ట్ ఆఫీస్ ల బీపీఎంలు పాల్గొన్నారు.

మా జీవనోపాధి ఎట్లా...

- ఆటో కార్మికులు ఆవేదన

నవతెలంగాణ-చర్ల

పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పుట్టి చాలీచాలని దైనందిక స్థితిలో జీవనం గడుపుతున్న మా జీవన ఉపాధి ఎట్లా అని శ్రీ గణేష్ ఆటో యూనియన్ ఆటో కార్మికులు తమ ఆవేదనను వెలబుచ్చుకుంటున్నారు. నూతన ప్రభుత్వం మహిళలకు బస్సు పాస్ ఫ్రీ పథకాన్ని పెట్టడం వలన కనీసం జీవనం సాగించే పరిస్థితి నానాటికి కోల్పోతున్నామని వారు వాపోతున్నారు. ఈ మేరకు వారు మంగళవారం శ్రీ గణేష్ ఆటో యూనియన్ ఆటోలు మొత్తం నిలుపుదల చేసి అధ్యక్ష, కార్యదర్శులు పామారు బాలాజీ, ధనసరి సంపత్ నేతృత్వంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, సీఐ బి.రాజగోపాల్‌లకు మెమోరాండం ఇచ్చి తమ ద్వారా నూతన ప్రభుత్వ పాలన నాయకులకు



ఆటో కార్మికుల వేదలను తెలపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు మచ్చా రామారావు, శ్రీ గణేష్ ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు రాచ కొండ సంజీవరావు, జాయింట్ సెక్రెటరీ వల్లే పోగు విజయ్, యూత్ ప్రెసిడెంట్ కంచర్ల సతీష్, స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు దొంతు ప్రసాద్, పొగాకు నాగేంద్ర, సీతారాములు తోపాటు పెద్ద మొత్తంలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.



సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలి

- ఎస్సీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ-మణుగూరు

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం సిఐటియు తరపున సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు సింగరేణి సంస్థలో పనిచేస్తున్నారని వీరి సమస్యలు పరిష్కారం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను వహించాలని మధు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పి.వి కాలనీలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో బి.మధు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి సంస్థకు వచ్చే లాభాల్లో పర్మనెంట్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా వాటా చెల్లించాలని, లేదంటే చట్ట ప్రకారం 20% బోనస్ చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల శ్రమతోటి సింగరేణి సంస్థ లాభాల బాటలో నడుస్తుందని పేర్కొన్నది. సింగరేణి సంస్థ నుండే నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని అలా చెల్లించడం ద్వారా సింగరేణి సంస్థకు సంవత్సరానికి రూ.50 లక్షల ఆదా అవుతుందని దీనివల్ల కార్మికులకు చట్టబద్ధంగా అందించవలసిన అన్ని రకాల సౌకర్యాలను కూడా అమలు చేయవచ్చని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు పేర్కొన్నది. సింగరేణి సంస్థలు పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ కోల్ ఇండియా హై పవర్ కమిటీ వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి, సిఐటియు మణుగూరు మండల కన్వీనర్ నరసింహారావు, మండల నాయకులు సత్రపల్లి సాంబశివ రావు, సిఐటియు నాయకులు మాచారపు లక్ష్మణరావు, సింగ రేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



జారేకి టీఎస్‌యూటీఎఫ్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-దమ్మపేట

అశ్వారావు పేట నియోజక వర్గ శాసనసభ సభ్యునిగా నూతనముగా ఎన్నికైన జారే ఆదినారాయణని వారి స్వగృహం గండుగులపల్లి నందు టీఎస్ యూటీఎఫ్ దమ్మపేట, అశ్వారావుపేట జిల్లా భాద్యులు ఆర్.రమేష్ కుమార్, డి.కృష్ణారావు, ఎం.రాజేశ్వరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల బాద్యులు ఆర్.ప్రసాద్, ఎం.రామారావు, పి.గోవిందరాజు, కె.కొండలరావు, ఎం.నాగరాజు, ఎం.ఆదినారాయణ, పి.సాయిబాబు, జి.శ్రీనివాసరావు, జవహర్ బాబు, ఎం.భాస్కరచారి, ఎం.వి.ఎల్. తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-ములకలపల్లి

అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ...ఇటీవల కురిసిన భారీ తుఫాను వల్ల వరి, పత్తి, మిరప, వేరుశనగ, పంటలు తడిసి ముద్దయిందని రైతులు బారీగా నష్టపోయారని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. పంటచేతికొచ్చే సమయంలో అకాల వర్షం కారణంగా పంటనష్టం వాటిల్లిందని లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట తుపాను రూపంలో ఒక్క రోజుల్లోనే నాశనం అయ్యిందని వెంటనే పంటనష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రేషన్ కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తుదారుడుకి రేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పోడియం వెంకటేశ్వర్లు, గౌరీ నాగేశ్వరరావు, ఊకంటి రవికుమార్. ఆదినారాయణ, మాలోతు రాజా, నిమ్మల మధు, కుంజా రామ్మూర్తి, కీసరి వెంకట్రావు, పద్దం తిరుపతమ్మ, గడ్డం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఏఐటీయూసీని గెలిపించండి

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సింగరేణి రక్షించుకోవాలంటే ఏఐటీయూసీని గెలిపించాలని బ్రాంచ్ సెక్రెటరీ వై.గోపాల్ పిలుపునిచ్చారు. సింగరేణి కాలరిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మనుగురులోని పీకే ఓసి2లో ఫిట్ మీటింగ్లో పాల్గొని మాట్లాడుతూ టీబీజీకేఎస్ సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత నూతనంగా ఒక్క బొగ్గు బావిని కూడా ప్రారంభించలేదని అన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 63,000 మంది సింగరేణి కార్మికులు ఉండగా ఇప్పుడు 39000లకు చేరుకున్నారని, దీనికి అంతటికి టీబీజీకేఎస్ వైఫల్యమ్ అని అన్నారు. తెలంగాణ ఏర్పడితే 100 బొగ్గు బావులు తీసి లక్ష మందికి ఉపాధి కలిగిస్తామని చెప్పి గెలిచిన తర్వాత మోసం చేశారని అన్నారు. మణుగూరు ఏరియాలో అరాచక పాలన కొనసాగుతుందని అన్నారు. కార్మికులు తమ సమస్యలు నోరు విప్పి చెప్పుకోలేని విధంగా ఉంది అంటే అర్థం చేసుకోవాలని అన్నారు. మణుగూరులో ప్రైవేటీకరణ శర వేగంగా జరుగుతుందని అన్నారు. ఓసి 4లో సర్ఫేస్ మైనర్ను ఏఐటియుసి వ్యతిరేకిందని, అలాగే ఓసీ2 లో ప్రైవేట్ డ్రిల్‌కి వ్యతిరేకంగా ఉద్యమం చేసిందని గుర్తు చేశారు. వేజ్ బోర్డు ఒప్పందంలో జాతీయ సంఘాలను కలుపుకొని ఏఐటియూసి పెద్దన్న పాత్ర పోషిస్తూ దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని విధంగా 5 సంవత్సరాల కాల పరిమితితో లాభదాయకమైన వేతన ఒప్పందం చేసిందని అన్నారు. కార్మికులందరికీ డబల్ బెడ్ రూమ్ వసతి కలిగిన క్వాటర్స్ నిర్మింపజేసి ఇస్తామని అన్నారు. డిసెంబర్ 15వ తేదీ శుక్రవారం సాయంత్రం పివి కాలనీ కమ్యూనిటీ హాల్ నందు జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని కార్మికులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గెలిచినా ఓడిన నిత్యం కార్మికుల పక్షాన ఉండి కార్మికుల హక్కుల రక్షణ సింగరేణి సంస్థ పరిరక్షణ కొరకు అహర్నిశలు పోరాడే ఏఐటీయూసీ సంఘంని డిసెంబర్ 27వ తేదీన జరిగే ఎన్నికలలో మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామ నరసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు, ట్రెజరర్ ఆవుల నాగరాజు, ఆఫీస్ పెరల్స్ గోలి గంగాధర్ రావు, సుభాని, సురేందర్, ఫిట్స్ సెక్రటరీలు కోడి రెక్కల శ్రీనివాస్, బండారి రవికుమార్, గుంపెన శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ జానకి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మన్నెం యోహాన్, గణపతి, కోడిగుడ్ల రమణ, కౌన్సిల్ సభ్యులు గోవిందుల కుమారస్వామి, మధుబాబు, బొక్క శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఏఓ కార్యాలయం ఎదుట ప్రజాపంథా ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ

గతవారం రోజుల కింద కురిసిన భారీ వర్షాల వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ అనుబంధ అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో పాల్వంచలో ప్రదర్శన, ఏఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి అనంతరం వ్యవసాయ అధికారికి డిమాండ్స్‌తో కూడిన మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పాల్వంచ మండల కార్యదర్శి పూనెం రమేశ్, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకుడు రాయబారపు వెంకటేశ్వర్లు, ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ నాయకురాలు వి.పద్మ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాణం గుర్తు పై మీ అమూల్యమైన ఓటు వేయాలి

- బ్రాంచి ఉపాధ్యక్షులు పూకంటి ప్రభాకర రావు

నవతెలంగాణ-మణుగూరు

బ్యాలెట్ పై ఉన్న బాణం గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు ఊకంటి ప్రభాకర్ రావు కార్మికులను కోరారు. మంగళవారం కెసీఆర్ పాలన టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చొరవ ద్వారా కారుణ్య నియామకాలు పొందిన యువ కార్మికులు అధిక సంఖ్యలో ఉన్న



కొండాపురం భూగర్భ గని నుంచే మణుగూరు టిబిజికెయస్ ఎన్నికల విజయ శంఖరం ప్రారంభం చేయడం జరిగిందని, ప్రతి యువ కార్మికుడు రానున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టిబిజికెయస్‌ను ఏరియాలో అఖండ మెజారిటీతో గెలిపించాలని బ్రాంచి ఉపాధ్యక్షులు పూకంటి ప్రభాకర రావు పిలుపు నిచ్చారు. గని ఫిట్ సెక్రటరి నాగెల్లి అధ్యక్షతన మంగళవారం ఉదయం గేట్ మీటింగ్ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవుఫ్, నాయకులు నాగెల్లి, లక్ష్మన్, ప్రసాద్, చాంద్ పాషా, ఆర్ శ్రీనివాస్, టి.శ్రీనివాస రావు, రత్న, అజీజ్ బంగారి పవన్ కుమార్, మునిగెల నాగేశ్వర రావు, సి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- వైద్యాధికారి అరుణదేవి



నవతెలంగాణ-ముదిగొండ

ఇంటి ఆవరణతోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి అంకం అరుణాదేవి అన్నారు. మంగళవారం పిహెచ్సీలో వైద్యసిబ్బంది ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో చలి తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు అనారోగ్యానికి గురై అవకాశాలు ఉన్నాయన్నారు. శీతాకాలం చలి తీవ్రత పెరిగినందున, ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ఆరోగ్య సూత్రాలను ప్రజలకు తెలియజేస్తూ క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవన్నారు.అనంతరం పిహెచ్సీలో ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ గుండాల దుర్గమల్లేశ్వరి, హెల్త్ సూపర్వైజర్‌లు, వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



మండలంలో జారే విస్తృత పర్యటన

నవతెలంగాణ-దమ్మపేట



మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. మొదటగా మొద్దులగూడెం ఏకులపోతమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకుని, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని తుఫాను వలన ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు. మందలపల్లి గ్రామంలో తుఫాను వలన పంట నష్టపోయిన రైతులను కలుసుకొని ప్రభుత్వం ద్వారా తగు నష్టపరిహారం అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అల్లిపల్లి గ్రామంలో తుఫాను వలన పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం కావాలి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



వ్యవసాయ కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక నాయకురాలు పప్పుల మంగమ్మ, పిడతల వెంకమ్మ, గోపోజి గోపమ్మ అన్నారు. , ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పిండిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వ్యవసాయ కార్మికులకు రూ.10వేల జీవన భృతి, ఇళ్ల స్థలాలు కేటాయించి కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఇవ్వాలన్నారు. వ్యవసాయ రంగంలోని మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనాలను అమలు చేయలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 లక్షల మందికి పైగా కార్మికులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓట్లు వేయించుకునే యంత్రాలుగానే ఉపయోగిస్తుందని వారు ప్రభుత్వాలను దుయ్యబట్టారు. కూలి రేట్లు పెంచాలని పెంచేంతవరకు ధర్నా కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో దార మంగతాయి, దండిబోయిన తిరుపమ్మ, చామకూరి గంగమ్మ, పాలవాయి వెంకటమ్మ, పసలాది ఎల్లమ్మ, జాల మన్నెమ్మ, పులిగుజ్జుభూదేవమ్మ, షేక్ రజాబీ, జ్వాల నరసమ్మ, ఆమంచి లచ్చమ్మ, పాలవాయి వెంకటమ్మ పసలాది ఎల్లమ్మ కొండమీది సమ్మక్క పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-చండ్రుగొండ

పోస్టల్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పెన్షన సౌకర్యం కల్పించాలని ఏఐజీడీఎస్ సంఘం నాయకులు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం చండ్రుగొండ సబ్ పోస్టాఫీసు ఎదుట సంఘం బాధ్యులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ....జీడీఎస్ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. 8 గంటల పనిదినాలతో పాటు, అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాలన్నారు. జీడీఎస్ ఉద్యోగులకు టార్గెట్ల భారం తగ్గించాలని, పని ఒత్తిడిని తగ్గించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు వెంకటక్రిష్ణ, శ్రీనివాసరావు, గణేష్, ఫయాజుస్సేన్, లక్ష్మీభారతి, బాలగణేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకునికి పిహెచ్‌డి ప్రదానం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలం నందు కామర్స్ డిపార్ట్మెంట్ హెచ్ఓడీగా విధులు నిర్వహిస్తున్న సూదిరెడ్డి నరేందర్ రెడ్డికి కాకతీయ యూనివర్సిటీ పిహెచ్‌డీని అవార్డు ప్రదానం చేసింది. యూనివర్సిటీ కాలేజ్ అఫ్ కామర్స్, బిజినెస్ మేనేజమెంట్ కు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డి.సక్రీయా పర్యవేక్షణలో రోల్ ఆఫ్ ఐఆర్‌డిఏఐ రెగ్యులేటింగ్ హెల్త్ ఇన్సూరెన్స్ ఇండియా ఏ స్టడీ అనే అంశంపై పరిశోధన గాను సూదిరెడ్డి నరేందర్ రెడ్డి కి డాక్టరేట్ ఇవ్వటం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జాన్ మిల్టన్, వైస్ ప్రిన్సిపల్ డి.భద్రయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ డి.వీరన్న అధ్యాపకులు యస్.శ్యాం ప్రసాద్ కామేశ్వరరావు, శ్రీను, రమేష్ అభినందనలు తెలియజేశారు.

పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే మట్ట రాగమాయి దయానంద్



నవతెలంగాణ-వేంసూరు

తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను బుధవారం ఎమ్మెల్యే మట్ట రాగమాయి దయానంద్ మండలంలో పర్యటించి పంటలను పరిశీలించారు. దుద్దపూడి, కందుకూరు, భరణి పాడు, అడసర్లపాడు తదితర గ్రామాలలో పర్యటించారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉండటం సత్తుపల్లి నియోజకవర్గం అదృష్టమని అన్నారు. అనంతరం జయలక్ష్మి పురంలో ఐకెపి ద్వారా చేపట్టనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎంఎ రాజు, ఎండిఓ జి.రమేష్, ఐకెపి ఎపిఎం శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు బండి గురునాథరెడ్డి, వెల్ది జగన్ మోహన్ రావు, ఎంపీటీసీ రాఘవరెడ్డి రేగళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఉచితంగా ఆహారం పంపిణీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం ఏరియా హాస్పిటల్‌లో ఉచిత ఆహారం అనే కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్‌లోని పేషంట్ల సహాయకులకు ఉచిత భోజన ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అలాగే ఏరియా హాస్పిటల్ ఆర్ఎమ్ఓ రాజశేఖర్ పాల్గొని వారి చేతుల మీదుగా ఉచిత భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఫౌండేషన్ వారు ప్రతి నెల ఆహారాన్ని పేషంట్ల సహాయకులకు ఉచితంగా అందించడం మంచి కార్యక్రమమని అభినందించారు. ఆర్ఎంఓ రాజశేఖర్ మాట్లాడుతూ ఫౌండేషన్ సభ్యులు కరోనా నుంచి కూడా వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు మస్తాన్, ఉస్మాన్, ఖలీల్, ఇమామ్ పాల్గొన్నారు.

కొబ్బరి రైతుల విజ్ఞాన యాత్ర

- కొబ్బరి అనుబంధ ఉత్పత్తులు పరిశీలన

నవతెలంగాణ-అశ్వారావుపేట

కొబ్బరి అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో అశ్వారావుపేట, దమ్మపేట, సత్తుపల్లికి చెందిన పలువురు కొబ్బరి సాగు దారులు(రైతులు) విజ్ఞాన యాత్రకు ఆదివారం తమిళనాడు తరలి వెళ్ళారు. పొల్లాచిలోని కొబ్బరి క్షేత్రాలు, అనుబంధ ఉత్పత్తుల పరిశ్రమలను సందర్శిస్తున్నారు. కొబ్బరి నుంచి ఎన్ని రకాల ఉప ఉత్పత్తులు ఉన్నాయో పరిశీలిస్తున్నారు. కొబ్బరి చిప్స్, కొబ్బరి పాలు, కొబ్బరి పొడి, నీరా, కొబ్బరి నీళ్లను ఏడాది పాటు నిల్వ ఉంచేలా పాకెట్స్, సీసాల ద్వారా ఎలా విక్రయాలు చేస్తున్నారో పొల్లాచిలోని కొబ్బరి బోర్డు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో కాయర్ బోర్డు ప్రాంతీయ మేనేజర్ టీవీ సాబ్, కొబ్బరి అనుబంధ ఉత్పత్తుల పరిశ్రమ ఎం.డి కామరాజ్, సి.డి.బి ఎ.డి రఘోత్తం, సాంకేతిక అధికారి గోపి రాజు, పలువురు రైతులు ఉన్నారు.



గుజ్జు లక్ష్మీనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన తాత భాస్కరరావు

నవతెలంగాణ-తల్లాడ

వైరా జెడ్పీటీసీ నంబూరు కనకదుర్గ భర్త గుజ్జు లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం సీపీఐ(ఎం) జిల్లా నాయకులు తాతా భాస్కరరావు సందర్శించి లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, గోపాల్పేట సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు, కుమ్మినేని శ్రీనివాసరావు, కొమ్మినేని రాంబాబు, బెల్లంకొండ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లిలోని రైతువేదికలో మూకమామిడి ఎఫ్పీవో కరుటూరి కృష్ణ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్లు ఎం.ఆకాష్, తేజ రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తెలంగాణ అగ్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్ రవితేజ, లీడ్బ్యాంకు ఆఫ్ ఇండియా శశిధర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు పాల్గొనగా రైతులకు పాలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఉచిత బస్ సర్వీస్‌పై సాంస్కృతిక కళాకారులచే అవగాహన

నవతెలంగాణ-ఇల్లందు

కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో మంగళవారం ఉచిత బస్ సర్వీస్ పై సాంస్కృతిక కళాకారులచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో ఇంచార్జ్ దేవయ్య, టాగూర్ పాల్గొన్నారు. ఆధార్ కార్డు చూపించి రాష్ట్రమంతటా మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చు అని తెలిపారు. కళాకారులు కాంపల్లి బాలు. స్నేహ, నీల, కుమారి, నందు ముసా నరేందర్, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.



తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

- 18 బ్రాంచ్ లకు తాళాలు
- పోస్ట్ ఆఫీస్ ఎదుట నిరసన

నవతెలంగాణ కల్లూరు

గ్రామీణ తపాలా ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం తపాల ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు నిరవధిక సమ్మె చేపట్టారు. మండలంలో 21 గ్రామీణ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లు ఉండగా 18 పోస్టాఫీసులో పనిచేసే సిబ్బంది నిరవధిక సమ్మెకు దిగారు. కల్లూరు పోస్ట్ ఆఫీస్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సందర్భంగా ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఉపాధ్యాయుల రమేష్, సత్తుపల్లి డివిజన్ ప్రచార సహాయ కార్యదర్శి దేవరపల్లి వెంకటేష్, మాట్లాడుతూ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, 8 గంటల వేతనం ఇవ్వాలని, సీనియర్ 12, 26, 36, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, మెడికల్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, పదవి విరమణ సమయంలో గ్రాడ్యుటీ 1.20 లక్షల నుండి 5 లక్షల పెంచాలని, 2016లో కమలేష్ చంద్ర ఇచ్చిన సిఫార్సులను అమలు చేయాలని తదితర డిమాండ్ సాధన కోసం దశలవారీగా ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి స్పందన లేదని ఆరోపించారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

ముక్కోటి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రియాంక

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ముక్కోటి వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సెక్టార్లకు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. మంగళవారం భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి మహోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 22వ తేదీ సాయంత్రం తెప్పోత్సవం, 23వ తేదీ ఉదయం స్వామివారి ఉత్తర ద్వారా దర్శనం కార్యక్రమాలు వీక్షణకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ ఏర్పాటు చేయాలని అధికారుల ఆదేశించారు. ఆయా శాఖల అధికారులకు కేటాయించిన విధులు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. గోదావరి లోతును తెలియజేయు విధంగా ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భద్రాచలం విచ్చేయు భక్తులకు స్వామివారి ప్రసాదాలు అందించడానికి వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. రెండు లక్షల లడ్డూలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ నెల 18 వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. దేవస్థానం, స్నానాల ఘాట్ వంతెన, కరకట్టలను విద్యుద్దీకరణ చేయాలని చెప్పారు. మొత్తం మండపాన్ని 7 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్ కు బారి కేడింగ్ చేయాలని చెప్పారు. 22, 23 రెండు రోజులు అత్యంత ముఖ్యమైన రోజులని అధికారులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సురక్షిత మంచినీరు, ఆహార పదార్థాలను తనిఖీ చేయాలని మిషన్ భగీరథ, పౌరసరఫరాలు, ఆహార తనిఖీ అధికారులను ఆదేశించారు. అనుమతించే వ్యక్తులకు పాసులు జారీ చేయాలని చెప్పారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దేవాలయ పరిసరాల్లో ఆరు అత్యవసర వైద్య చికిత్సా కేంద్రాలు ఏర్పాటుతో పాటు 25 మంది డాక్టర్లు, 85 మంది పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర సేవలకు బెడ్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. 22, 23 తేదీల్లో మద్యం అమ్మకాలు నిలిపివేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. సమీప రాష్ట్రంలో జిల్లాకు సరిహద్దునున్న ప్రాంతంలో. మద్యం అమ్మకాలు నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే 22, 23 తేదీల్లో మాంసపు విక్రయాలు నిలుపుదల చేయాలని చెప్పారు.

పార్కింగ్, ట్రాఫిక్ ఆంక్షలు ఆర్టీవో, పోలీసులు పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్ రాజు, డీఈఆర్ఓ రవీంద్రనాథ్, దేవస్థానం ఈవో రమాదేవి, భద్రాచలం ఆర్డీవో మంగీలాల్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తర ద్వార దర్శనం, దేవస్థానం, తెప్పోత్సవం జరుగు ప్రాంతాలను పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మండపంలో భక్తులు తిలకించేందుకు ఎల్ఈడి టివిలు ఏర్పాటు చేయాలని చెప్పారు.



ముక్కోటి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో బుధవారం నుంచి జరిగే వైకుంఠ ఏకాదశి అధ్యాయనోత్సవాల్లో బాగంగా నిర్వహించే ముక్కోటి ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా మంగళవారం పరిశీలించారు. ముందుగా కలెక్టర్ గోదావరి నదిలో నిర్వహించే తెప్పోత్సవం ప్రదేశం, గోదావరి నది పరిసర ప్రాంతాలను, స్నాన ఘట్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ తాగునీరు 24 గంటలు అందుబాటులో ఉండాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆయా శాఖలను ఆదేశించారు. గోదావరి ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో గల దుకాణాలను తొలగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆమె ఈ సందర్భంగా మండల అధికారులను ఆదేశించారు. ఉత్తర ద్వార దర్శనం జరిగే ప్రదేశంను పరిశీలించి నిర్వహణ ఏర్పాట్ల పై ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గర్భాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పురోహితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం సీతా కుటీర ప్రదేశాన్ని సందర్శించి పర్ణశాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ మధుసూదన్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఆర్డీవో మంగీలాల్, ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పిటిసి తెల్లం సీతమ్మ, తాసిల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ముత్యాలరావు, సీఐ దోమల రమేష్, మిషన్ భగీరథ డిఈ యేసు బాబు, ఇరిగేషన్ డిఈలు నాగేశ్వరరావు, మధుసూదన్, విద్యుత్ శాఖ ఏఈ మోహన్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ రాజ్ సుహాస్, మిషన్ భగీరథ ఏఈ రాము, ఈజీఎస్ ఏపీవో సుకన్య, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ మిషన్ భగీరథ నీరు అందించాలి

నవతెలంగాణ-చెర్ల



మిషన్ భగీరథ పైప్ ద్వారా నిరుపేదలందరకు తాగునీరు అందించాలని సిపిఎం పార్టీ జోన్ కన్వీనర్ మచ్చ రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి మెమోరాండం ఇచ్చి మాట్లాడారు. మేజర్ గ్రామపంచాయతీలో మిషన్ భగీరథ పైప్లైన్ ద్వారా లెనిన్ కాలనీ ఆదివాసీ గ్రామానికి మిషన్ భగీరథ పైప్ లైన్ తాగునీరు, ఇప్పటివరకు రావటం లేదని కనీసం పైపులు కూడా వేయలేదని ఆయన వాపోయారు. తక్షణమే తాగునీరు పైప్ లైన్ వెయ్యాలని కోరారు. మిషన్ భగీరథ పైప్ లైన్ చర్ల నుంచి పూసుగుప్ప వరకు లైన్ ఉంది కానీ మధ్యలో గ్రామాలకి పైప్ లైన్ వెయ్యకపోవడం ఆశ్చర్యంగా ఉంది. గ్రామపంచాయతీ అందరికీ నీళ్లు అందిస్తామని అంటున్నారు కానీ లెనిన్ కాలనీలో తాగునీరు అందించలేకపోతున్నారని ఆయన విమర్శించారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా తాగునీరు సమస్య ఏర్పడకుండా మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సంబంధిత అధికారులు దష్టి సారించాలని ఆయన సూచించారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న లెనిన్ కాలనీకి నీరు సక్రమంగా అందకపోవడం తగు సోచనీయమని ఆయన మండిపడ్డారు. వీరి అవసరాల కోసం ఓట్ల కోసం నాయకులకు లెనిన్ కాలనీ వాసులు కావాలి కానీ వారి ఇబ్బందులు ఇబ్బందులు పాలకులకు అవసరం లేదా అని ఆయన ప్రశ్నించారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గాని, సెక్రటరీ గాని లెనిన్ కాలనీ ఆదివాసీ గ్రామంపై ఎటువంటి పట్టింపు లేని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. వెంటనే మిషన్ భగీరథ పైప్ లైన్ పైపులు నిర్మించి తాగునీరు అందించాలని ఆయన సూచించారు. గ్రామంలో ఉన్నటువంటి సమస్యలన్నిటిని వెంటనే తీర్చాలని కోరారు. లేని పక్షాన మళ్లీ పోరాటానికి సిద్ధంగా ఉంటామని అన్నారు. అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజల పక్షాన పోరాటం చేసేది సీపీఎం కనుక ఓడిపోయిన గెలిచిన ప్రజలలో మమేకమై పోరాటాలకు సిద్ధపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు శ్యామల వెంకట్, గ్రామస్తులు తాటి గాంధీ, తిరుపతిరావు, ముత్తయ్య, వెంకటేశ్వర్లు, నరసింహారావు, లక్ష్మయ్య ,వీరయ్య చలపతి తదితరులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'తో మా బతుకులు చిద్రం

- ప్రైవేటు ప్రజా రవాణా నిర్వాహకులకు గండం
- ఉపాధి కల్పించాలని తహసీల్దార్‌కు వినతి
- సమస్య పరిష్కరించాలని

కార్మిక జేఏసీ డిమాండ్

నవతెలంగాణ-ఇల్లందు



నూతనంగా కొలువు తీరిన రాష్ట్ర ప్రభుత్వం 6గ్యారంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నది. ఇటీవల మహిళకు రాష్ట్రమంతటా ప్రయాణించడానికి ఉచిత బస్ పథకం ప్రారంభించింది. దీంతో ఆటో, టాటా మ్యాజిక్, జీపు, కారు డ్రైవర్‌ల బతుకులు చిద్రమయ్యాయి. దశాబ్దాల నుండి ఇటీవల వరకు ఇల్లందు నుండి గుండాల, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ లకు సుమారు 70 వరకు టాటా మ్యాజికులు జీపులు, వివిధ రూట్లలో 200 వరకు ఆటోలు నడిచేవి. లోకల్ ఆటోలు మరో సుమారు 600 వరకు ఉన్నాయి. పిల్లలను వివిద పాఠశాలలకు తీసుకువెళ్లే ఆటోలు సుమారు 50 వరకు ఉంటాయి. వయసుతో సంబంధం లేకుండా మహాలక్ష్మీలందరికీ ఉచిత బస్సు ప్రయాణం ఉండడంతో ప్రైవేటు వాహనాలవైపు ఎవరూ చూడటం లేదు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆయన నిలిచిపోయాయి ఉపాధి కరువైంది. వారి పరిస్థితి దుర్భరంగా మారింది. ఒక్కక్కరు పదిహేను నుండి ఇరవై వేల రూపాయలు ఈఎంఐలు కట్టాలి. కుటుంబ పోషణ, రోడ్ ట్యాక్స్, ఇన్సూరెన్స్ తదితర చెల్లింపులు ప్రతీ నెలా చెల్లింపులుంటాయి. ఇవన్నీ కట్టే పరిస్థితులు లేక బతుకు ఆగమవుతుంది. ఒక్కో డ్రైవర్ డిగ్రీ పీజీలు చేసి ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి పొందుతున్నారు. మహా లక్ష్మీ పథకంతో వీరంతా రోడ్డున పడ్డారు.

ఉపాధి కల్పించాలని తాసిల్దార్ కు వినతి

ఉచిత బస్సు ప్రయాణాలతో ఉపాధి కోల్పోయామని తమకు ప్రత్యామ్నయ అవకాశాలు కల్పించాలని ప్రయివేటు రవాణా కార్మికులు మంగళవారం తహశీల్దార్ రవి కుమార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం తమ సమస్యలను తాసిల్దార్ వివరించారు. వీరికి కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఐఎఫ్టీయు జిల్లా నేతలు అబ్దుల్ నబి, యాకూబ్ షావలి లు మాట్లాడుతూ మోటార్ రంగ కార్మికులను ప్రభుత్వం ఆదు కోవాలని కోరారు. ఉపాధి లేక ఇల్లు గడవలేక కుటుంబాలు ఆగమవుతున్నాయని వారి పరిస్థితిని ఆలోచించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ నాయకులు తాళ్లూరి కృష్ణ, బోయిన శేఖర్, తోట శివ, రాంబాబు, రామకృష్ణ, నరేష్, సుదర్శన్, రాము, సీతారాములు, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న పినపాక ఎమ్మెల్యే

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం గ్రామంలో తరతరాలుగా వెలసిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ చుక్క గణేష్ రెడ్డి వారికి సాదరంగా ఆహ్వానం పలికి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిమ కలిగిన తల్లి శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు అని రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం తల్లి చల్లని దీవెనలతో కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లంకా శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ భద్రాచలం నియోజకవర్గం ఉపాధ్యక్షులు శివకుమార్ ఆలయ కమిటీ అధ్యక్షులు చుక్క గణేష్ రెడ్డి, మరియు కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు సంపత్ రాము, సందీప్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కేటీపీఎస్‌కు సహాయ సహకారాలు అందిస్తా

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ఎమ్మెల్యేను కలిసిన కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్స్

నవతెలంగాణ-పాల్వంచ

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కేటీపీఎస్ 5, 6 దశల కేటీపీఎస్ ఏడవ దశ చీఫ్ ఇంజనీర్స్ ఎం.ప్రభాకర్ రావు, పి వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస బాబులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి పులుపు బొకే తో అభినందించారు. ఈ సందర్భంగా కూననేని సాంబశివరావు మాట్లాడుతూ కేటిపిఎస్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ కు కావలసిన సహాయ సహకారాలు నా వంతుగా అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఈలు ఎస్ఎంఎస్ శేఖర్ జాస్తి శ్రీనివాసరావు, వై. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ వల్ల నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-జూలూరుపాడు



తుఫాన్ వల్ల నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మంగళవారం మండల తహసీల్దార్‌కు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ మాట్లాడారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు ఏదులాపురం గోపాలరావు, సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా జూలూరుపాడు, సుజాతనగర్ సంయుక్త మండల కార్యదర్శి భానోత్ ధర్మ తదితరులు ఉన్నారు.

తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి

ఇల్లందు : తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం డివిజన్ నాయకులు షేక్ ఉమర్ డిమాండ్ చేశారు. మంగళవారం పత్తి, మిర్చి పంటలను పరిశీలించారు. తడిచిన ధాన్యాన్ని పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బ్యాంకు రుణాలు రద్దుచేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తోలం వెంకటేశ్వర్లు, మోడెందెం పదం గోపయ్య పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి సాయన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని తడిసిన అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రగతిశీల రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు సున్నం వీరభద్రం మాట్లాడుతూ తుఫాను కారణంగా తడిసిపోయిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తడిసిన అన్ని రకాల పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేయాలని నష్టపోయిన రైతులకు మిర్చికి రూ 1 లక్ష, వరి పంటకు రూ 50 వేలు, పత్తి పంటకు 50 వేలు ఇతర పంటలకు కూడా 50 వేల చొప్పున ఇవ్వాలని అన్నారు. మండలంలో ధరణి కారణంగా జరిగిన అవకతవకలను తాతలు ముత్తాతలు నాటి భూములను అక్రమంగా ఒకరి భూమిని మరొకరికి ఎక్కించారని ఇలాంటి అవకతవకలను సరి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కొరస రామ్ చిట్టి, ముద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) గ్రామ శాఖ నాయకుడు గోపికి విప్లవ జోహార్లు

చర్ల : మండల పరిధిలోని సత్యనారాయణపురం సీపీఐ(ఎం) శాఖ నాయకుడు గుడివాడ గోపి అనారోగ్యంతో అకాల మరణం చెందాడు. పార్టీ రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కారం పుల్లయ్య, బ్రహ్మాచారి పాల్గొని నివాళులర్పించారు. గ్రామంలో తనదైన శైలిలో చురుకైన పాత్ర పోషిస్తూ సిపిఎం పార్టీ పట్ల విధేయుడుగా ఉండేవాడని కీర్తించారు. పోడు భూములు పోరాటంలో గ్రామ సమస్యల్లో పోరాటం చేసిన వ్యక్తి అలాంటి వ్యక్తి మన మధ్యలో లేకపోవడం పార్టీకి తీరని లోటని గోపి ఆశయ సాధనకై పోరాటం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జోహార్లు తెలిపిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి కారం నరేష్, మండల నాయకులు మచ్చ రామారావు, రాంపండు, తాటి నాగమణి, శ్యామల వెంకటేశ్వర్లు పెద్దారపు శ్రీను తదితరులు ఉన్నారు.

మాటూరు పీహెచ్‌సీలో ఘనంగా ఆశా డే

నవతెలంగాణ-మధిర

మధిర మండల పరిధిలోని మాటూరు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నందు వైద్యాధికారి డాక్టర్ వీరబాబు ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి గృహాన్ని సందర్శించి డ్రై డే ఫ్రైడే మీద కుటుంబాలకు అవగాహన కల్పించి, నిలువ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాశ్మీర్ ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే..

తొలుత స్థానిక ఎన్నికల సమరం

- అనంతరం లోక్‌సభ పోరు
- వేసవిలో అమర్‌నాథ్ యాత్ర
- ఆ తర్వాతే శాసనసభ పోల్స్

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో 2024 సెప్టెంబర్ 30వ తేదీ లోగా శాసనసభ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే సుప్రీంకోర్టు తీర్పును ముందుగానే ఊహించిన ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన అన్ని ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేస్తోంది. వాస్తవానికి ఈ సంవత్సరం ప్రారంభం నుండే ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన నుండి ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వరకూ పనులన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. వాతావరణం, భద్రతాపరమైన సమస్యలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని ఎలక్షన్ కమిషన్ చెబుతోంది. అయితే ముందుగా పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు, అనంతరం వేసవిలో సుమారు రెండు నెలల పాటు జరిగే అమర్‌నాథ్ యాత్ర...ఇవన్నీ ముగిసిన తర్వాతే శాసనసభకు ఎన్నికలు జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉన్నదని, అయితే ఎన్నికల తేదీలపై నిర్ణయం తీసుకోవాల్సింది ఎలక్షన్ కమిషన్ మాత్రమేనని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. అయితే లోక్‌సభ ఎన్నికలతో పాటు శాసనసభకు ఎన్నికలు జరిగే అవకాశం లేదని మాత్రం బీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. భద్రతాపరమైన సమస్యలతో పాటు వనరులు, సాంకేతికత, సిబ్బంది లభ్యత వంటి విషయాలలో ఉన్న పరిమితులను వారు కారణంగా



చూపుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తయినప్పటికీ శాసనసభ ఎన్నికలకు ముందే పంచాయతీలకు, పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాల్సి ఉన్నదని వారు చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికలతో పాటు శాసనసభకు కూడా ఎన్నికలు జరపడం సాధ్యం కాదని తెలిపారు.

పంచాయతీల కాలపరిమితి జనవరితో పూర్తవుతుంది. రిజర్వేషన్ల కారణంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఇప్పటికే జాప్యం జరిగింది. ఆర్టికల్ 370 రద్దును సుప్రీంకోర్టు సమర్ధించడంతో ఓబీసీ రిజర్వేషన్లు సహా రాజ్యాంగంలోని అన్ని నిబంధనలు జమ్మూకాశ్మీర్‌కు కూడా వర్తిస్తాయి.

రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జీడీ శర్మ కమిషన్ ఇప్పటికే నివేదిక అందజేసింది. దానిని అమలు చేయాల్సి ఉంది' అని ఓ సీనియర్ నేత వివరించారు. ఇక త్వరితగతిన ఎన్నికలు నిర్వహించడానికి మరో అవరోధం అమర్‌నాథ్ యాత్ర. ఇది వేసవిలో జరుగుతుంది. ఈ యాత్ర 50-60 రోజుల పాటు కొనసాగుతుంది. జూలై, ఆగస్ట్ నెలల మధ్య అమర్‌నాథ్ యాత్ర ముగిసే అవకాశం ఉంది. ఆ తర్వాతే యాత్ర కోసం నియమితులైన భద్రతా సిబ్బంది తమ విధులు ముగించుకొని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే అవకాశం ఉంది.

అక్రమ వలసదారుల డేటా సేకరించలేం

సుప్రీం కోర్టు ముందు కేంద్రం వివరణ

న్యూఢిల్లీ : దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వలసదారుల డేటాను సేకరించడం సాధ్యం కాదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఏ రాజ్యాంగ చెల్లుబాటుపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతుంది. కేసు విచారణ సందర్భంగా కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ సెక్షన్ సిటిజన్‌షిప్ యాక్ట్‌లోని అసోంకు చెందింది. అయితే, యాక్ట్ ప్రకారం.. 17,861 మందికి పౌరసత్వం ఇచ్చినట్టు కేంద్రం కోర్టుకు తెలిపింది. ఫారినర్స్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు 1966-1971 మధ్య కాలంలో 32,381 మంది విదేశీయులుగా గుర్తించినట్టు పేర్కొంది.

అసోంలో 1966 జనవరి 1 నుంచి 1971 మార్చి 25 వరకు ఎంతమంది బంగ్లాదేశ్ పౌరులకు భారత పౌరసత్వం ఇచ్చారని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని 'సుప్రీం' ప్రశ్నించడంతో పాటు డేటాను కోరింది. అలాగే అక్రమ చొరబాట్లను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నది. దీనిపై కేంద్రం స్పందిస్తూ ఎలాంటి ఎలాంటి పత్రాలు లేకుండా రహస్యంగా దేశంలోకి వలసదారులు అక్రమంగా ప్రవేశిస్తున్నారని పేర్కొంది. అక్రమ వలసదారులను గుర్తించడం, వారిని నిర్బంధించడం, తిరిగి వారి దేశాలకు పంపించడం సంక్లిష్టమైన ప్రక్రియ అని పేర్కొంది.

అలాంటి పరిస్థితిలో దేశంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న అక్రమ వలసదారుల గురించి డేటాను సేకరించడం సాధ్యం కాదని తెలిపింది. 2017 నుంచి 2022 మధ్య కాలంలో 14,346 మంది విదేశీయులను తిరిగి వారి దేశాలకు పంపినట్టు కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం, అసోంలో వంద ఫారినర్స్ ట్రిబ్యునల్స్ పని చేస్తున్నాయని, 31 అక్టోబర్ 2023 వరకు 3.34 లక్షల కేసులు పరిష్కారమయ్యాయని తెలిపింది. ఫారినర్స్ ట్రిబ్యునల్ ఆదేశాలకు సంబంధించిన 8,461 కేసులు గౌహతి హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. ఈ సందర్భంగా అసోంలో చొరబాట్లను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. సరిహద్దుల్లో చొరబాట్లను నిరోధించేందుకు ఫెన్సింగ్ వేస్తున్నట్టు వివరించింది.

అసెంబ్లీ ఎన్నికల్లో

సోషల్ మీడియా ప్రకటనలపై బీజేపీ భారీ ఖర్చు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రకటనలపై బీజేపీ భారీగా ఖర్చు చేసింది. ఇటీవలే ఈ మూడు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ సోషల్ మీడియా ప్రకటనల కోసం కాంగ్రెస్ కంటే అధికంగా ఖర్చు చేసిందని లోక్‌నీతి-సెంటర్ ఫర్ ది స్టడీ సొసైటీస్ పేర్కొంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఖర్చు చేసిన డబ్బుపై అధ్యయనం చేసింది. రెండు పార్టీల అధికారిక రాష్ట్ర ఖాతాలలో తేడా స్పష్టంగా కనిపించింది.(వ్యక్తిగతంగా నాయకుల ఖాతాలను, పార్టీ కంటెంట్‌ను పోస్ట్ చేసే ఇతర అనధికారిక ఖాతాలను లెక్కించలేదు). మధ్యప్రదేశ్‌లో రెండు పార్టీల మధ్య ఖర్చులో అతి చిన్న తేడా కనిపించింది. 'ఎంపీలో ఎన్నికలకు ముందు 90 రోజులలో, బీజేపీ చేసిన ఖర్చు కాంగ్రెస్ కంటే ఎక్కువ' అని ది హిందూలో ప్రచురించిన కథనంలో పేర్కొంది. రాష్ట్రంలో బీజేపీ రూ.94 లక్షలు ఖర్చు చేయగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్‌లో కాంగ్రెస్ రూ.92 లక్షలు ఖర్చు చేసింది. అయితే, ఇవి రాజకీయ ప్రకటనలుగా



వర్గీకరించగల కంటెంట్‌ను పోస్ట్ చేసే ఖాతాలు మాత్రమే కాదు. అలాంటి టాప్ టెన్ ఖాతాలు కలిపి మధ్యప్రదేశ్‌లో రూ.1.1 కోట్లు ఖర్చు చేసినట్టు అధ్యయనం పేర్కొంది.ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికలకు ముందు 90 రోజులలో బీజేపీ అధికారిక ఖాతా రూ.79.7 లక్షలు ఖర్చు చేయగా, కాంగ్రెస్ రూ.4.7 లక్షలు ఖర్చు చేసింది. రాజస్థాన్‌లో ఎన్నికలకు 90 రోజుల ముందు బీజేపీ రూ.94 లక్షలు, కాంగ్రెస్ రూ.2.18 లక్షలు ఖర్చు చేశాయి. నెగెటివ్ అండర్ టోన్‌లతో కూడిన ప్రకటనల కోసం కాంగ్రెస్ కంటే బీజేపీ ఎక్కువ ఖర్చు చేసిందని అధ్యయనం స్పష్టం చేసింది.

రూ.56 వేల కోట్ల అప్పుల్లో పౌరసరఫరాలశాఖ

రూ.11 వేల కోట్ల నష్టాలు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వంద రోజుల్లో రూ.500 గ్యాస్ సిలిండర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్ర పౌరసరఫరాలశాఖ రూ.56 వేల కోట్ల అప్పులు, రూ.11 వేల కోట్ల నష్టాల్లో ఉందని ఆ శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పౌరసరఫరాలశాఖకు సహకరించకపోవడంతోనే అది అప్పులు, నష్టాల పాలైందన్నారు. ప్రజలకు 1.8 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారు. ఒక కిలో బియ్యాన్ని రూ.39కు కొనుగోలు చేసి ఉచితంగా ఇస్తున్నామని వివరించారు. పేదలు ఉపయోగించుకోకుంటే నిరుపయోగం అవుతుందన్నారు. మొక్కుబడిగా కాకుండా లోపాలు ఎక్కడున్నాయో వెతకాలని సూచించారు. ప్రజల నుంచి సమాచారం సేకరించాలని కోరారు. పేదలకు ఇచ్చే బియ్యం తినే విధంగా ఉండాలే తప్ప వేరే విధంగా దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. రైస్ మిల్లర్ల నుంచి బియ్యం సేకరణలో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నిస్తారు. రైతుల నుంచి పౌరసరఫరాలశాఖ ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యం వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లో రూ.500కు గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. వరికి రూ.500 బోనస్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరికి ఒక కిలో బియ్యమే ఉచితంగా ఇచ్చిందనీ, మిగితా ఐదు కిలోలు కేంద్రం ఇచ్చిందని తెలిపారు. లబ్దిదారుల నుంచి బియ్యం దారి మళ్లకుండా తినగలిగే బియ్యాన్నే ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అన్ని విషయాలపై మళ్లీ సమీక్షించాలని కమిషనర్‌ను ఆదేశించారు. రైతులకు డబ్బులు వెంటనే అందే విధంగా చూడాలన్నారు. రైస్ మిల్లర్ల వద్ద రూ.18 వేల కోట్ల విలువైన ధాన్యం, పౌరసరఫరాల సంస్థ వద్ద 1.17 లక్షల మెట్రిక్క టన్నుల ధాన్యం ఉందని వివరించారు.

రేషన్ కార్డుదారుల్లో 89 శాతం మందే బియ్యం తీసుకుంటున్నారని తెలిపారు. కొత్త రేషన్ కార్డులివ్వాలనే డిమాండ్‌ను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ చెప్పారు.

పాక్ ఆర్మీ బేస్‌పై ఆత్మాహుతి దాడి

23 మంది మృతి



పెషావర్ : పాకిస్థాన్ ఆర్మీ బేస్‌పై ఆత్మాహుతి దాడి జరిగింది. ఆఫ్ఘన్ సరిహద్దులోని ఖైబర్ ఫక్తుంక్వా ప్రావిన్స్‌లో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఈ దాడిలో 23 మంది మరణించిగా, మరో 27 మందికి తీవ్ర గాయాలైనట్టు అధికారులు తెలిపారు. పాకిస్థాన్ తాలిబన్‌తో సంబంధం ఉన్న తెహ్రీక్-ఇ-జిహాద్ పాకిస్థాన్ ఈ దాడికి పాల్పడినట్టు వెల్లడించారు. ఖైబర్ ఫక్తుంక్వా ప్రావిన్స్‌లోని డేరల్ ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలో పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక సైనికస్థావరంపై పేలుడు పదార్థాలతో నిండి ఉన్న ఆత్మాహుతి వాహనం పేలినట్లు అధికారులు తెలిపారు. మూడు గదులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, నిద్రలో ఉన్నవారంతా అలాగే మత్యువాత పడ్డారని అన్నారు. శిథిలాల నుంచి మృతదేహాలను బయటకు తీయాల్సి ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని చెప్పారు. వారంతా సాధారణ దుస్తులు ధరించి ఉండటంతో సైనికులా కాదా అనేది గుర్తించాల్సి ఉందని అన్నారు. ఈ ఘటనపై పాకిస్థాన్ ఆర్మీ స్పందించాల్సి వుంది.

ఢిల్లీలో అత్యంత కనిష్టానికి ఉష్ణోగ్రతలు..

న్యూఢిల్లీ : ఢిల్లీలో ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయి. గత రెండు రోజులుగా సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం ఉదయం కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే రెండు డిగ్రీలు తక్కువగా 6.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఉదయం 8.30 గంటల సమయంలో తేమస్థాయి 100శాతంగా నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత (6.5 డిగ్రీల సెల్సియస్) సోమవారం నమోదైంది. ఇది సాధారణ ఉష్ణోగ్రత కన్నా మూడు పాయింట్లు తక్కువగా ఉంది. ఈ సీజన్‌లో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రత కూడా కావడం గమనార్హం. ఈ ఏడాది డిసెంబర్ మొదటి పది రోజులలో సగటు గాలి నాణ్యత సూచిక 321.10 గా ఉంది, ఇది గత ఆరేళ్లలో కనిష్టంగా ఉంది. 2020 సంవత్సరంలో, డిసెంబర్ మొదటి పది రోజులలో సగటు గాలి నాణ్యత సూచిక అత్యధికంగా 368.10గా ఉంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం, ఢిల్లీ సగటు గాలి నాణ్యత సూచిక సోమవారం 317 గా నమోదై వెరీ పూర్ కేటగిరీలో ఉంది.

నా గెలుపు లక్షలాది మంది ఆకాంక్ష

అసమానత్వం ఉన్నంతకాలం పోరాటం తప్పదు

- చట్టసభల్లో ప్రజల గొంతుకనవుతా : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు
- ఖమ్మంలో భారీ విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది ఉద్యమ పార్టీ తరపున తాను గెలవాలని కోరుకున్నారని, వారి ఆకాంక్షే కొత్తగూడెంలో తన గెలుపని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కూనంనేని సాంబశివరావు గెలుపును పురస్కరించుకొని ఖమ్మంనగరంలో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీ గార్డెన్స్‌లో ఆపార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో కూనంనేని మాట్లాడారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై వారి గొంతుక వినిపిస్తానన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన చూసిన తరువాత ఎలాగైనా ఈ దుర్మార్గపు పాలనను అంతం చేయాలని ప్రజలు భావించారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ భావజాలం అధికంగా ఉన్న ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి ఏకపక్ష విజయం లభించిందన్నారు.

బొగ్గుగని ప్రాంతాల్లో కమ్యూనిస్టుల పోరాట ప్రాంతాల్లో ఘనసీయమైన ఆధిక్యత లభించిందన్నారు. కాంగ్రెస్, సీపీఐ పొందికతతో సానుకూల ఫలితాలొచ్చాయన్నారు. ఒక స్థానం తీసుకొని పొత్తు కుదుర్చుకునే విషయంలో కొంత తటపటాయించినా.. కమ్యూనిస్టుపార్టీ ఉద్యమ అభిమానులు, శ్రేయోభిలాషులు చట్టసభల్లో కమ్యూనిస్టు గొంతుక కావాలంటే తప్పదని సూచించారని, వారి ఆకాంక్షలకనుగుణంగానే ఫలితం వచ్చిందని తెలిపారు. సీపీఐ(ఎం) సైతం మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని బలపరిచిందని, సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి కాంగ్రెస్‌ను బలపరిచే విషయాన్ని బహిరంగానే వెల్లడించారన్నారు.

ఓట్లు తగ్గినా భావజాలం పదిలమేనని, కమ్యూనిస్టుల శక్తిని మారిన ఎన్నికల రాజకీయాల్లో ఓట్లతో పోల్చవద్దని సూచించారు. కమ్యూనిస్టులెప్పుడూ రాజకీయ వృత్తిని పవిత్రంగానే చూస్తారని, పదవుల కోసం, ఆర్థిక వ్యవహారాల కోసం రాజకీయాలు చేయరని, ప్రజల పక్షానే రాజకీయాలు చేస్తారన్నారు. రాజకీయాలంటే ఏహ్య భావం కలుగుతుందన్నారు. అందుకే కమ్యూనిస్టు పార్టీ దామాషా ప్రాతిపదికన ఎన్నికలు జరగాలని డిమాండ్ చేస్తున్నదన్నారు. ప్రజాప్రతినిధిగా కమ్యూనిస్టుపార్టీ శాసనసభ్యునిగా బాధ్యతయుతమైన వివక్షంగా పనిచేస్తామని, ప్రజల పక్షాన నిలబడతానని తెలిపారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఈ సందర్భంగా కూనంనేనిని పలువురు అభినందించారు. సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, చాంబర్ ఆఫ్ కామర్స్, గ్రానైట్ అసోసియేషన్, కాంగ్రెస్, సీపీఐ(ఎం), టీడీపీ, వివిధ పార్టీల నేతలు, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పూలమాలు, శాలువాలతో సన్మానించారు.

ఈ సభలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వరరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్పాషా, పట్టణానికి చెందిన ప్రముఖులు డాక్టర్ సి. గోర్కీ, చెరుకూరి కృష్ణమూర్తి, చిన్నికృష్ణారావు, వేజర్లసురేష్, నవీన్, పోట్ల మాధవరావు, గరికపాటి వెంకట్రావు, ఉప్పుల వెంకటరమణ, డాక్టర్ యలమంచలి రవీంద్రనాద్, డాక్టర్ బాగం కిషన్‌రావు, డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, డాక్టర్ సి.భారవి, ఎన్‌టీయూ నాయకులు సామినేని సురేష్, సీపీఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మెన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాలు, ఎస్‌కె. జానిమియా, కొండవర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విపక్షాల వైఫల్యం వల్లే బీజేపీ విజయం

- ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్, మిజోరం మినహా మిగతా మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిందని ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. విపక్ష పార్టీల వైఫల్యం వల్లే మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచిందన్నారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని కర్రోళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ ఓంకార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అనుసరించిన ఒంటెద్దు పోకడలతో ఇండియా కూటమిలోని వామపక్ష లౌకిక పార్టీలతో సమన్వయం చేసుకోకుండా ముందుకెళ్లిందని చెప్పారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత లౌకిక ప్రజాస్వామ్య శక్తులపై ఉందని అన్నారు. ఎంసీపీఐ(యూ), ఆర్ఎంపీఐ కలిసి ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ (సీసీసీ) సమావేశం ఈనెల 17 నుంచి 20 వరకు చెన్నైలో నిర్వహిస్తామనీ, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి ప్రజావిజయమని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. కాంగ్రెస్ గుణపాఠంగా తీసుకుని పరిపాలించాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాస్వామిక, లౌకిక శక్తులతో ఐక్యత ఏర్పాటు చేసుకుని ముందుకుసాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వనం సుదాకర్, గోనె కుమారస్వామి, వరికుప్పల వెంకన్న, వస్కుల మట్టయ్య, పెద్దారపు రమేష్, కుంభం సుకన్య, హెచ్ రెడ్డి హంసా రెడ్డి, మంద రవి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిని త్వరగా తగ్గించండి

కాప్-28 సూచన



దుబాయ్ : నిరంతరాయంగా జరుగుతున్న బొగ్గు ఉత్పత్తిని త్వరితగతిన తగ్గించాలని వాతావరణ మార్పులపై ఐరాస ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్‌లో భాగస్వాములుగా ఉన్న దేశాల 28వ సదస్సు (కాప్28) సూచించింది. బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిపై పరిమితులు విధించాలని కోరింది. బొగ్గు వినియోగంపై కఠిన వైఖరి తీసుకున్న కాప్28 చమురు, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాల ఉత్పత్తి, వినియోగంపై మాత్రం మెతక వైఖరి అవలంబించింది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గమనాలను వేగవంతంగా తగ్గించాల్సిన అవసరం ఉన్నదని సదస్సు ఓ తీర్మానంలో నొక్కి చెప్పింది. ఇందుకోసం చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. 2050 నాటికి లేదా ఆ లోపే శిలాజ ఇంధనాల ఉత్పత్తి, వినియోగాన్ని క్రమేపీ తగ్గించుకోవాలని సదస్సు కోరింది. కాప్28 సదస్సు సంపన్న, వర్ధమాన దేశాల విషయంలో పరస్పర విరుద్ధంగా వ్యవహరిస్తోందని నిపుణులు విమర్శించారు. ఓ వైపు శిలాజ ఇంధనాల వాడకాన్ని క్రమేపీ తగ్గించుకోవాలని చెబుతూ మరోవైపు బొగ్గు వినియోగాన్ని వేగవంతంగా తగ్గించాలని సూచిస్తోందని చెప్పారు. కాగా దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా జరిగే దేనినీ తాము అంగీకరించబోమని సదస్సుకు హాజరైన భారత ప్రతినిధులు స్పష్టం చేశారు. ఉద్గమనాల తగ్గింపునకు శాయశక్తులా కృషి చేస్తున్నామని, లక్ష్యాలను చేరుకునే దారిలోనే పయనిస్తున్నామని తెలిపారు.

ఉత్తమ సేవకులు, సంస్థలకు అవార్డులు

- ధరఖాస్తులకు క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్రిస్మస్ పండుగ-2023 సందర్భంగా విద్య, వైద్య, సామాజిక, సాహిత్య, కళా రంగాల్లో 30 సంవత్సరాలకుపైగా ప్రతిభ కనబరిచిన, ఉత్తమ సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు అవార్డులను ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ (మైనార్టీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ తెలిపింది. ఈ మేరకు కార్పొరేషన్ ఎండీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ ఫారాలను నేరుగా కార్యాలయం నుంచి గానీ, లేదా కార్పొరేషన్ వెబ్‌సైట్ నుంచి గాని పొందవచ్చని పేర్కొన్నారు. పూర్తి చేసిన నామినేషన్లను సంబంధిత జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి కార్యాలయంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీలోపు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 040-2339 1067లో సంప్రదించవచ్చు.

పెట్టుబడి సాయం రూ.15 వేల కంటే తక్కువేస్తే ఊరుకోం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై నిరంజన్ వ్యాఖ్యల్ని ఖండిస్తున్నాం :ఎన్వీ సుభాష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికలకు ముందు అధికారంలోకొస్తే రైతులకు పంట పెట్టుబడి సాయం కింద రూ. 15 వేలు వేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందనీ, రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి తక్కువ వేసినా ఊరుకోబోమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ. సుభాష్ హెచ్చరించారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిపై టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్ చేసిన వ్యాఖ్యల్ని ఖండించారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నాటకలో మాదిరిగానే మన రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక రేపోమాపో చేతులెత్తేస్తుందని విమర్శించారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఒక్క తెలంగాణలోనే కాంగ్రెస్ పార్టీ గెలిచిందని తెలిపారు. తెలంగాణలోనూ తుమ్మితే ఊడిపోయేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోతే... ప్రజలే బండకేసి కొడతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీకి మంచి ఫలితమే వచ్చిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హవా ముందు కాంగ్రెస్ కొట్టుకుపోతుందని పేర్కొన్నారు.

కొత్త ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కుట్రలు

- డీజీపీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కుట్రలు చేస్తున్నారనీ, వారిపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ కోరింది. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఆ రెండు పార్టీల ఎమ్మెల్యేలపై డీజీపీ రవిగుప్తాకు టీపీసీసీ ఈ ప్రధాన కార్యదర్శులు కైలాష్ నేత, చారకొండ వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆరునెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ఎమ్మెల్యేలు తమ ప్రభుత్వంపై కుట్ర పన్నుతున్నారని చెప్పారు. అందులో భాగంగా బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. అందుకే డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రకటనలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని డీజీపీని కోరినట్టు తెలిపారు.

ఫేక్ గ్యారంటీ కార్డులను దళారులకు అమ్ముకుంటున్నారు

- టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ కార్డుల మాదిరిగానే కొంత మంది దళారులు ఫేక్ గ్యారంటీ కార్డులను సృష్టించి అమ్ముకుంటున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంలో ప్రజలను మోసం చేసే వారిపై కేసులను నమోదు చేయాలని కోరారు. మంగళవారం హైదరబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు.

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీలపై విచారణ వేగవంతం చేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, లక్ష్మణ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్పీఎస్సీలో జరిగిన ప్రశ్నాపత్రం లీకేజీలపై విచారణను వేగవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన వారిని శిక్షించాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రశ్నాపత్రం లీకేజీపై దర్యాప్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించి లీకేజీ కారకుల వెనుక ఎవరున్నా బయటికి తీయాలని తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ ఛైర్మెన్, సభ్యులు రాజీనామాలు చేస్తే ఆమోదించకుండా పూర్తిగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ద్వారా రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు టీఎస్‌పీఎస్సీపై నమ్మకం రావాలంటే పూర్తి విచారణ జరపాలని కోరారు. కొత్త బోర్డు ద్వారా గ్రూప్స్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిరుద్యోగులకు భరోసా కల్పించే విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి వారికి అండగా ఉండాలని కోరారు.





సాయుధ దళాల నుండి మొదటి మహిళా సహాయకురాలిగా...

భారత వైమానిక దళానికి చెందిన ప్రధాన అధికారి స్క్వాడ్రన్ లీడర్ **మనీషా పాధి.** భారతీయ సాయుధ దళాల నుండి ఎయిడ్-డి-క్యాంప్ (ఏడీసీ)గా నియమితులైన మొదటి మహిళగా చరిత్ర సృష్టించారు. మిజోరంలోని ఐజ్వాల్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మిజోరాం గవర్నర్ చేతుల మీదుగా ఇటీవలే ఆమె ఈ ప్రతిష్టాత్మక గౌరవ బిరుదును అందుకున్నారు. ఆ సందర్భంగా ఆమె పరిచయం నేటి మానవిలో...

2015లో స్క్వాడ్రన్ లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మనీషా ఇప్పుడు గవర్నర్ హరిబాబు కంభంపాటికి సహాయకురాలిగా నియమితురాలయ్యారు. తద్వారా తన అద్భుతమైన కెరీర్‌కు కొత్త అధ్యాయాన్ని జోడించారు. ఇది ఆమె జీవితంలో ఓ ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. లింగ అడ్డంకులను ఛేదిస్తుంది. భారత సాయుధ దళాలలో మహిళాభివృద్ధికి ఉదాహరణగా నిలిచింది. దేశంలో ఎయిడ్-డి-క్యాంప్ టైటిల్ అంటే ఓ గొప్ప గౌరవం.

లింగ వివక్షను విచ్ఛిన్నం చేస్తూ

ఇది ఒక అధికారి యోగ్యతను, విధేయతను, విధి పట్ల అంకితభావానికి గుర్తింపు. అలాంటి గుర్తింపు పొందడం మనీషా వ్యక్తిగత విజయాన్ని మాత్రమే కాకుండా పురుషాధిపత్య రంగాలలో లింగ వివక్షను సైతం విచ్ఛిన్నం చేస్తుంది. ఇటీవల రాష్ట్ర గవర్నర్‌ల కోసం ఇద్దరు సహాయకులు నియమించారు. భారత సాయుధ దళాల నుండి ఒకరికి, పోలీసు శాఖ నుండి ఒకరికి ఈ బాధ్యతలు అప్పగించారు. మిజోరం గవర్నర్ ఏడీసీగా మనీషా నియామకం ఆమె అసాధారణ నైపుణ్యానికి, అంకితభావానికి నిదర్శనం. ఆమె వివిధ





వైమానిక దళ స్థావరాలలో ఉండి విధి పట్ల తన నిబద్ధతను, అసాధారణ నైపుణ్యాలను ప్రదర్శించింది.

అంకిత భావానికి ప్రతిబింబం

ఐఏఎఫ్ అడ్మినిస్ట్రేటివ్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న స్క్వాడ్రన్ లీడర్ పాధి బీదర్, పూణే, భటిండాలోని వైమానిక దళ స్థావరాల నుండి మిజోరంలోని ఎయిడ్-డి-క్యాంప్ బాధ్యతల వరకు ఆమె ప్రయాణం దేశానికి సేవ చేయాలనే ఆమె అంకితభావాన్ని ప్రతిబింబి స్తున్నాయి. సాయుధ దళాల నుండి భారతదేశంలో ఇటువంటి గౌరవనీయమైన పదవిని పొందిన మొదటి మహిళగా ఆమె కీర్తిర ఘడించింది. ఈ ఏడాది నవంబర్ 29న ఆమెకు ఈ గౌరవ బిరుదు ప్రదానం చేశారు.,

తండ్రి స్ఫూర్తితో...

ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లాలోని బెర్హంపూర్‌కు చెందిన మనీషా తన కుటుంబంలో రెండవ తరం అధికారి. ఆమె తండ్రి మనోరంజన్ పాధి స్ఫూర్తితో ఆమె ఈ రంగంలోకి ప్రవేశించారు. తండ్రి 2020లో పదవీ విరమణ పొందే నాటికి ఆయన గౌరవప్రదమైన ఫ్లయింగ్ అధికారిగా ఉన్నారు. ప్రస్తుతం గవర్నర్‌కు సహాయకురాలిగా కూతురి నియామకం పట్ల ఆమె తండ్రి అపారమైన గర్వాన్ని వ్యక్తం చేశారు. ఎన్నో కఠినమైన సందర్భాలను ఆమె ఎదుర్కొని ఎదిగిన క్రమాన్ని ఈ సదర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

ఎన్నో సవాళ్లను స్వీకరించింది

ఇప్పుడు ఆమెకు వచ్చిన ఈ అవకాశం అంత సలుభంగా వచ్చింది కాదని ఆయన వివరించారు. మనీషా తాను ఎంచుకున్న రంగంలో విజయం సాధించేందుకు ఎన్నో సవాళ్లను స్వీకరించినట్లు ఆయన వివరించాడు. మనీషా ఐఏఎఫ్‌లో వృత్తిని ఎంచుకుంటే, ఆమె సోదరుడు పౌర జీవితాన్ని ఎంచుకున్నాడు. ప్రస్తుతం అతను నెదర్లాండ్స్‌లో పనిచేస్తున్నాడు. మనీషా భువనేశ్వర్‌లోని సీవీ రామన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి. ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఆమె 2015లో ఐఏఎఫ్‌లో చేరారు. ఆమె భర్త మేజర్ దేపక్ సింగ్ కర్కీ. ప్రస్తుతం ఆయన ఇండియన్ ఆర్మీలో పనిచేస్తూ పంజాబ్‌లో ఉన్నారు.

మహిళా సాధికారతకు మద్దతు

గవర్నర్ కంభంపాటి మాట్లాడుతూ 'ఆమె నియామకం ఆమె జీవితంలో ఒక మైలురాయి మాత్రమే కాకుండా లింగ అడ్డంకులను ఛేదించి, విభిన్న రంగాలలో రాణిస్తున్న మహిళలకు నిదర్శనం. ఈ విజయాన్ని జరుపుకోవడం, అన్ని రంగాలలో మహిళా సాధికారతకు మద్దతు ఇవ్వడం ప్రస్తుత సమాజంలో చాలా అవసరం' అని ఆయన నొక్కి చెప్పారు. గత నెల నుండి ఆమె గవర్నర్ సహాయకురాలిగా వ్యవహరిస్తున్నారు. ఇక ఆయనతో పాటు అధికారిక పర్యటనలు చేస్తారు.

అతిగా వాడితే..?

చెవి దగ్గర ఎక్కువ సేపు పెట్టుకుని, అదే పనిగా ఫోన్ మాట్లాడుతుంటే రేడియేషన్ ప్రభావం చూపిస్తుందని నిపుణులు హెచ్చరికలు చేస్తుంటారు. దానిని తగ్గించడానికి, కాల్స్ మాట్లాడటానికి సులువుగా ఉంటుందని కారణమేదైనా సరే... ఇయర్‌పాడ్స్ వాడకం పెరిగింది. ఈ మధ్య ఎవరిని చూసినా చెవుల్లో ఇయర్ పాడ్స్ పెట్టుకుని కనిపిస్తున్నారు. కొందరికైతే, వారి వారి వృత్తి రీత్యా, అవసరాల రీత్యా వీటి వాడకం తప్పనిసరి అయింది. అయితే వీటి వల్ల చెవి పోటు, చెవి సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా విపరీతంగా పెరిగిందని సర్వేలు చెబుతున్నాయి. వీటి వాడకం ఎలాంటి అనర్థాలు తీసుకొస్తుందో, కొంతమేరైనా నివారించేందుకు ఏం చేయాలో తెలుసుకుందాం...

- ఇయర్ ఫోన్, ఇయర్ పీస్, ఇయర్ బడ్, ఎయిర్ ప్యాడ్, బ్లూటూత్ ఆపరేటింగ్... ఇలా పేర్లు ఏవైనా వీటిని కర్ణబేరికి అత్యంత దగ్గరగా చెవిలోనే పెట్టుకోవడం వల్ల చెవిలో ఫంగస్, బ్యాక్టీరియాలు పేరుకుని దురద, నొప్పి, చెవిలో చీము కారడం, పోటు, చెవిలో జోరుగా వాలుతున్నట్టు గుయ్ మని ఏదో సౌండ్ వచ్చినట్టు వివిధ రకాల బాధలు ఎదురవుతాయి.
- ఇయర్ ఫోన్లు పెట్టుకోవడంతో చెవిలోకి గాలి దూరే అవకాశం తగ్గిపోతుంది. దీంతో చెవిలో ఫంగస్ అతిగా పెరుగుతుంది. వైద్యులు చెబుతున్న దాని ప్రకారం వివిధ రకాల చెవి వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య గతంతో పోలిస్తే నాలుగు రెట్ల కంటే ఎక్కువ పెరిగింది.
- ఇయర్ ఫోన్లు వాడటం వల్ల వినికిడి శక్తి కోల్పోతాం. సాధారణంగా వయసు రీత్యా ప్రతిఏటా కొంత మేర వినికిడి శక్తిని సహజంగానే కోల్పోతాం. దీనికి పరిష్కారం లేదు. ఇదంతా చాలదన్నట్టు మనం చేతులారా చిన్న వయసులోనే బలవంతంగా వినికిడి కోల్పోయేలా ప్రవర్తిస్తే వైద్యులు చేయగలిగింది కూడా ఏమీ ఉండదు. ఇలా వచ్చే చెవుడుకి చెవిటి మిషన్లు కూడా పనిచేయవు.
- కొన్ని నిమిషాల పాటు ఇయర్ ఫోన్స్ వాడినప్పుడు వాటిని స్పిరిట్ లేదా శానిటైజర్‌తో శానిటైజ్ చేయాలి. లేదంటే చెవి బాధలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హెడ్ ఫోన్స్ వాడటం మొదలుపెట్టి ఎంతకాలమైంది, వాటిని ఎప్పుడైనా క్లీన్ చేసినట్టు గుర్తుందా అని ప్రశ్నించుకుంటే మీరు ఎంత ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నారో మీకే అర్థమవుతుంది.
- ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ట్యాబ్‌లు ఏవైనా సరే వాటికి అంతర్గత స్పీకర్లు ఉంటాయి. వాటి ద్వారా వచ్చే సౌండ్ సరిపోతుంది. ఇయర్ ఫోన్లు పెట్టుకుని మరీ వినాల్సిన పనిలేదు. ఇయర్ ఫోన్లు పెట్టుకోదలిస్తే తక్కువ సౌండ్‌తో వినాలి.
- ఇయర్ ఫోన్లు రోజుకు నాలుగు నిమిషాలకు మించి వాడరాదని వైద్యులు చెబుతున్నారు. అంతేకాదు మీరు మొహమాటానికి పోయి ఎవరికీ మీ ఇయర్ ఫోన్లు ఇవ్వకండి. ఇలా ఒకరిది ఒకరు మార్చుకుంటే ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఎక్కువ. ఇయర్ ఫోన్లు వాడేవారి చెవుల్లో బ్యాక్టీరియా ఏడు రెట్లు ఎక్కువ పెరుగుతుంది. మరి మీరు ఇలా వేరే వారి ఇయర్ బడ్స్ వాడారో అది మీకు కూడా అంటుకుంటుంది.



పారదర్శకత ఏదీ?

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పని చేయాల్సిన ఎన్నికల సంఘాన్ని పూర్తిగా మోడీ ప్రభుత్వం లొంగదీసుకునేలా చీఫ్ ఎలక్షన్ కమిషనర్, కమిషనర్ల నియామక బిల్లు ఉన్నదని సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. రాజ్యసభలో మంగళవారం బిల్లుపై జరిగిన చర్చలో సీపీఐ(ఎం) తరఫున మాట్లాడారు. ఈ బిల్లు సుప్రీంకోర్టులోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆదేశాలను రద్దు చేయడానికి, ఎన్నికల కమిషన్‌ను నియంత్రణలో ఉంచడానికి ఉద్దేశించబడిందని విమర్శించారు. కాశ్మీర్ తీర్పు తరువాత, ప్రభుత్వం సుప్రీంకోర్టును ప్రశంసించిందని, మరుసటి రోజు అదే కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తోందని దుయ్యబట్టారు. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఉత్తర్వు ఎన్నికల కమిషన్ విశ్వసనీయత, నిష్పాక్షికత, స్వతంత్రతను నిర్ధారించే లక్ష్యంతో ఉందన్నారు. ప్రభుత్వం దానిని తారుమారు చేస్తోందని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్‌కు ప్రత్యేక కార్యాలయం అవసరమా? దాన్ని మూసేసి న్యాయ మంత్రిత్వ శాఖలో పెడితే సరిపోతుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘాన్ని మరో ప్రభుత్వ శాఖగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలను సృష్టిస్తుందని హెచ్చరించారు. దేశంలో ఎన్నికల రంగం ప్రస్తుతం డబ్బు, అధికారంతో నియంత్రించబడుతున్నదని విమర్శించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు రూ.60 వేల కోట్ల ఖర్చు చేశాయని, ఇందులో సింహభాగం బీజేపీ ఖర్చు చేసిందని అన్నారు. 2024లో ఇది చాలా రెట్లు పెరుగుతుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ నిజానికి ఎన్నికల కుంభకోణమని, పారదర్శకంగా లేదని బ్రిట్టాస్ అన్నారు.

రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ

(మొదటిపేజి తరువాయి)

ఎన్నికల్లో జైపూర్‌లోని సంగనేర్ వంటి సురక్షితమైన స్థానం నుంచి బీజేపీ మొదటిసారిగా భజన్ లాల్ శర్మను బరిలోకి దింపింది. సిట్టింగ్ ఎమ్మెల్యే అశోక్ లాహోటీకి టిక్కెట్ ఇవ్వకుండా, భజన్‌లాల్ శర్మను అభ్యర్థిగా నిలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పుష్పేంద్ర భరద్వాజ్‌పై 48081 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

భజన్ లాల్ శర్మ రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి 1993లో పోస్ట్ గ్రాడ్యుయేట్ (ఎం.ఏ పొలిటిక్స్) చేశారు.

పెండింగ్‌లో రెండు కేసులు...

భజన్‌లాల్ శర్మపై ఐపీసీ సెక్షన్ల కింద రెండు కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 353 కింద కేసు నమోదై ఉన్నాయి. (ప్రభుత్వ ఉద్యోగి విధిని నిర్వర్తించకుండా నిరోధించడానికి దాడి లేదా క్రిమినల్ శక్తులకు సంబంధించినది). రెండవ కేసు భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 149 కింద నమోదై ఉన్నది. (ఒక సాధారణ వస్తువును ప్రాసిక్యూషన్ చేయడంలో నేరానికి పాల్పడిన చట్టవిరుద్ధమైన అసెంబ్లీలోని ప్రతి సభ్యునికి సంబంధించినది).

కొత్త సీఎం ఆస్తులు ..

రాజస్థాన్ కొత్త సీఎం భజన్ లాల్ శర్మ మొత్తం ఆస్తులు రూ. 1.40 కోట్లు, అప్పులు రూ. 35 లక్షలు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆస్తుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్ ప్రకారం మొత్తం నికర విలువలో రూ. 1,15,000 నగదు కాగా, ఆయన వద్ద దాదాపు రూ.11 లక్షల డిపాజిట్లు ఉన్నాయి. మూడు తులాల బంగారం ఉంది, దాని విలువ రూ.1,80,000. అతనికి రూ. 2,83,817 విలువైన ఎల్ఐసీ , హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌ల రెండు బీమా పాలసీలు ఉన్నాయి. కొత్త ముఖ్యమంత్రి పేరు మీద టాటా సఫారీ కారు ఉన్నది. దీని ధర రూ.5 లక్షలుగా అఫిడవిట్ లో పేర్కొన్నారు. ఇది కాకుండా, టీవీఎస్ విక్టర్ మోటార్ సైకిల్ ఉంది, దీని ధర రూ. 35,000.

అంజనీకుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

(మొదటిపేజి తరువాయి)

ఐపీఎస్, రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. అత్యంత నిజాయితీపరుడు, ముక్కుసూటిగా వ్యవహరించే పోలీసు అధికారిగా పేరు పొందిన శ్రీనివాస్‌రెడ్డిని కొంతకాలం మాత్రమే లా అండ్ ఆర్డర్ పోస్టింగ్‌లలో గత ప్రభుత్వాలు కొనసాగించాయి. ఎలాంటి పైరవీలు, రాజకీయ ఒత్తిళ్ల, సిఫారసులకు తలొగ్గకుండా చట్టపరిధిలోనే వ్యవహరించటానికి మొగ్గు చూపే శ్రీనివాస్‌రెడ్డికి కీలకమైన శాంతిభద్రతల పోస్టులను అప్పగించటానికి గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సాహసించేవారు కాదనే అభిప్రాయం ఉన్నది. అయితే, అందరి ఆలోచనలు తలకిందులు చేస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. శ్రీనివాస్‌రెడ్డికి సీపీ బాధ్యతలను అప్పగించటాన్ని పలువురు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

రాష్ట్రంలో మరో కీలకమైన కమిషనర్ పోస్టు సైబరాబాద్ పగ్గాలను సైతం నిజాయితీపరుడు, సమర్థవంతమైన ఐపీఎస్ అధికారిగా పేరు పొందిన అవినాశ్ మహంతికి అప్పగించి పోలీసు వర్గాల్లో ప్లస్ మార్కులనే ప్రభుత్వం కొట్టేసింది. గతంలో రాష్ట్ర డీజీపీగా పని చేసి దేశంలోనే నిజాయితీపరులైన ఐపీఎస్ అధికారులలో ఒకడిగా పేరు పొందిన ఎ.కె మహంతి కుమారుడు అవినాశ్ మహంతి. రాష్ట్రంలో మాదక పదార్థాలను కఠినంగా అణచివేయడానికి ఉద్దేశించిన నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్‌గా మరో సిన్సియర్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్యను నియమించటం కూడా మంచి చర్యల్లో ఒకటిగా పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

అంజనీకుమార్, సి.వి ఆనంద్ పోస్టింగ్‌లపై ఉత్కంఠ

ఎన్నికల ఫలితాల వెల్లడి సందర్భంగా ఈనెల 3న కోడ్ ఉల్లంఘించారనే ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురైన డీజీపీ అంజనీకుమార్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవటంతో ఆయనకు కొత్త సర్కారు ఎలాంటి బాధ్యతలను అప్పగిస్తుందోనన్న ఆసక్తి నెలకొన్నది. డీజీపీగా రవిగుప్తాను ఎన్నికల కమిషన్ నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీజీపీ హోదాలో రాష్ట్రంలో ఏసీబీ డీజీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ పోస్టులు మాత్రమే మిగిలాయి. అయితే, అంజనీకుమార్‌తో పాటు ఎన్నికల సమయంలో నగర పోలీసు కమిషనర్ పదవి నుంచి తప్పించబడిన డీజీపీ స్థాయి అధికారి సి.వి ఆనంద్ సైతం పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. వీరిద్దరికి ఏ పోస్టింగ్ దక్కుతుందోననే ఉత్కంఠ ఐపీఎస్ వర్గాల్లో నెలకొన్నది.

ప్రస్తుత డీజీపీ రవి గుప్తాను ఎన్నికల కమిషన్ నియమించినప్పటికీ వివాదరహితుడు, తన పని తాను చేసుకుపోయే అధికారిగా పేరుపొందిన రవి గుప్తాను ఆ పోస్టు నుంచి ప్రభుత్వం తప్పించకపోవచ్చునే అభిప్రాయం అధికారిక వర్గాల నుంచి వినిపిస్తున్నది. అదే సమయంలో ఏపీ క్యాడర్‌కు చెందిన అంజనీకుమార్ అంశం రాష్ట్ర హైకోర్టు పరిశీలనలో ఉండటం కూడా గమనార్హం.

బీజేపీకి చరిత్ర తెలియదు

(మొదటిపేజి తరువాయి)

తీసుకెళ్తున్నాం" అని రాహుల్ స్పష్టం చేశారు. దేశంలోని ప్రధాన సమస్యల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బీజేపీ నెహ్రూపై ఆరోపణలు చేస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. పార్లమెంట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు "పండిట్ నెహ్రూజీ తన జీవితాన్ని ఈ దేశానికి అంకితమిచ్చారు. దేశ ప్రజల కోసం ఏండ్ల తరబడి జైల్లో ఉన్నారు. "పేదలకు దక్కాల్సినవి దక్కుతాయి... ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ సీఎం అభ్యర్థి కూడా ఓబీసీనే. వారు కూడా ఓబీసీ సీఎం అని ప్రకటించారు. అయితే వారిలో ఎంత శాతం మంది నిర్మాణంలో ఉన్నారనేది ప్రశ్న? పీఎం మోడీ ఓబీసీ కేటగిరీ. అయితే 90 మందితో ప్రభుత్వం నడుస్తోంది. వారిలో ముగ్గురు మాత్రమే ఓబీసీకి చెందినవారు. వారి కార్యాలయాలు మూలన ఉన్నాయి. నా ప్రశ్న సంస్థాగత వ్యవస్థలో ఓబీసీలు, దళితులు, గిరిజనుల భాగస్వామ్యం గురించి. వారు ఈ సమస్య నుంచి దేశప్రజల దృష్టి మరల్చడానికి జవహర్‌లాల్ నెహ్రూ, ఇతరుల గురించి మాట్లాడుతున్నారు" అని అన్నారు.

2024 లో సెలవులు ఖరారు

(మొదటిపేజి తరువాయి)

సెప్టెంబర్ 16 (ఈద్ మిలాద్ ఉన్ నబీ), అక్టోబర్ 2 (గాంధీ జయంతి), అక్టోబర్ 12, 13 (విజయదశమి), అక్టోబర్ 24 (దీపావళి), నవంబర్ 25 (గురునానక్ జయంతి), డిసెంబర్ 25, 26 (క్రిస్మస్)గా నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవో నెంబరు 1633ను విడుదల చేశారు. ఈమేరకు అన్ని ప్రభుత్వ శాఖలకు సమాచారం పంపారు.

భవిష్యత్తును కాపాడండి

(మొదటిపేజి తరువాయి)

పరిస్థితులలోనూ ఆమోదయోగ్యం కాదు' అని తెలిపింది.

తన లాంటి లక్షలాది మంది చిన్నారులు వాతావరణ వైపరీత్యాల కారణంగా తమ జీవితాలను, తల్లిదండ్రులను, నివాసాలను కోల్పోతున్నారని కంగుజామ్ ఆవేదన వ్యక్తం చేసింది. 'ఇది అసలైన వాతావరణ అత్యవసర పరిస్థితి. యుద్ధాల కోసం లక్షలాది డాలర్ల సొమ్మును ఖర్చు చేసే బదులు దానిని ఆకలిని అంతం చేసేందుకు ఖర్చు చేయండి. విద్య కోసం ఖర్చు చేయండి. వాతావరణ మార్పులతో పోరాడటానికి ఖర్చు చేయండి. మనకు పీల్చేందుకు స్వచ్ఛమైన గాలి కావాలి. తాగేందుకు స్వచ్ఛమైన నీరు కావాలి. నివసించేందుకు సురక్షితమైన గ్రహం కావాలి. ఇవన్నీ కోరడం మా ప్రాథమిక హక్కులు' అని ఆమె వివరించింది.

కాప్28లో యువత ప్రదర్శించిన ఉత్సాహాన్ని అభినందిస్తున్నానని, కంగుజామ్‌ను మరోసారి



కరతాళధ్వనులతో అభినందించాల్సిందిగా ఆహుతులను ప్రోత్సహించానని కాప్28 డైరెక్టర్-జనరల్ అంబాసిడర్ మజీద్ అల్ సువైదీ వ్యాఖ్యానించారు. కాగా యూఏఈలో ఐరాస చర్చల వద్ద నిరసనలు తక్కువగానే జరిగాయి. వివిధ సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు నిరసన ప్రదర్శనలు జరపకుండా నిషేధం విధించడమే దీనికి కారణం.

ఎవరీ కంగుజామ్?

కంగుజామ్ 2011 అక్టోబర్ 2న జన్మించింది. చైల్డ్ మూవ్‌మెంట్ సంస్థను స్థాపించింది. ఆరు సంవత్సరాల వయసులోనే ఉద్యమించింది. ప్రపంచంలో వాతావరణ మార్పులపై పోరాడుతున్న కార్యకర్తలలో ఆమే అతి చిన్న వయస్కురాలు. స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో 2019లో జరిగిన ఐరాస వాతావరణ సదస్సులో ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగించింది. తమ భవిష్యత్తును కాపాడేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని వారిని కోరింది. వాతావరణ మార్పులపై పోరాడుతున్న కంగుజా మ్‌ను అనేక అవార్డులు వరించాయి. 2019లో వరల్డ్ చిల్డ్రన్ పీస్ ప్రైజ్ లారెట్, రైజింగ్ స్టార్ ఆఫ్ ఎర్త్‌డే నెట్‌వర్క్, 2020లో గ్లోబల్ చైల్డ్ ప్రాడిగీ అవార్డ్, ప్రతిష్టాత్మక టీఎన్ ఖుషూ మెమోరియల్ అవార్డ్, 2021లో ఫార్చ్యూర్ 30 అండర్ 30 స్పెషల్ మెన్షన్స్, ఢిల్లీ ప్రభుత్వం నుండి అంతర్జాతీయ మహిళా దినోత్సవ అవార్డు ఆమె సొంతమయ్యాయి.

వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ఆమె 2018 జూలైలోనే ప్రచారోద్యమం ప్రారంభించింది. 2019లో వాతావరణ కార్యకర్త గ్రేటా తున్‌బర్గ్ స్ఫూర్తితో మన దేశంలో వాతావరణ మార్పులపై చట్టాన్ని తీసుకొచ్చేలా ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి ఆకర్షించేందుకు పార్లమెంట్ భవనం వెలుపల ఓ వారం రోజులు గడిపింది.

కార్పొరేట్లకు మోడీ మెహర్బానీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఐదేండ్లలో బడా కార్పొరేట్లకు రూ.10,57,326 కోట్లు మాఫీ చేసినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు మంగళవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖరడ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2018-19లో రూ. 2,36,265 కోట్లు మాఫీ చేయగా, అందులో రూ.1,29,765 కోట్లు ప్రభుత్వ బ్యాంకులు, రూ.15,966 కోట్లు ప్రయివేట్ బ్యాంకులు మాఫీ చేశాయి. రూ. 3,023 కోట్లు విదేశీ బ్యాంకులు మాఫీ చేశాయి. 2019-20లో రూ. 2,34,170 కోట్లు మాఫీ చేయగా, రూ.1,34,189 కోట్లు ప్రభుత్వ, రూ.21,199 కోట్లు ప్రయివేట్, రూ.3,750 కోట్లు విదేశీ బ్యాంకులు మాఫీ చేశాయి. 2020-21 రూ. 2,02,781 కోట్లు మాఫీ చేయగా, అందులో రూ.96,232 కోట్లు ప్రభుత్వ రూ.28,867 కోట్లు ప్రయివేట్, రూ.1,948 విదేశీ బ్యాంకులు మాఫీ చేశాయి. 2021-22 రూ.1,74,966 కోట్లు మాఫీ చేయగా, అందులో రూ.58,875 కోట్లు ప్రభుత్వ, రూ.9,037 కోట్లు ప్రైవేట్, రూ.1,613 కోట్లు విదేశీ బ్యాంకులు మాఫీ చేశాయి. 2022-23లో రూ.2,09,144 కోట్లు మాఫీ చేయగా, రూ.67,045 కోట్లు ప్రభుత్వ రూ. 41,194 కోట్లు ప్రయివేట్, రూ.1,138 విదేశీ బ్యాంకులు రుణాలు మాఫీ చేశాయి.

మాయమైపోతున్నారు..

(మొదటిపేజి తరువాయి)

పోలిస్తే 2018లో 5.6 శాతం పెరిగింది. ఆచూకీ తెలియకుండా పోయిన చిన్నారులలో ఆయా రాష్ట్రాల అధికారులు కొందరి ఆచూకీ తెలుసుకున్నప్పటికీ గణాంకాలలో తేడా మాత్రం అధికంగానే ఉంది. భారత్‌లో జరిగిన నేరాలపై ఎన్‌సీఆర్‌బీ ఈ నెల 3న తన వార్షిక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం గత సంవత్సరంలో 20,380 మంది బాలురు, 62,946 మంది బాలికలు, 24 మంది ట్రాన్స్‌జెండర్లు (మొత్తం 83,350 మంది) కనిపించకుండా పోయారు. మొత్తంమీద 20,254 మంది బాలురు, 60,281 మంది బాలికలు, 26 మంది ట్రాన్స్‌జెండర్ల (మొత్తం 80,561 మంది) ఆచూకీ లభించింది.

ఆచూకీ తెలియకుండా పోయిన చిన్నారులకు సంబంధించి పాటిస్తున్న ప్రామాణిక నిబంధనల ప్రకారం...మైనర్ బాలుడు లేదా బాలిక కన్పించడం లేదన్న సమాచారం అందుకున్న తర్వాత పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి, నిర్ధారించుకుంటారు. ఐపీసీ సెక్షన్ 363 (కిడ్నాప్) కింద కేసు నమోదు చేస్తారు. 2022లో కిడ్నాప్‌కు గురైన 76,069 మంది పిల్లల్లో 62,099 మంది బాలికలే. కిడ్నాప్‌కు గురైన వారిలో (ఐదు సంవత్సరాలలో కలిపి) 51,100 మంది మైనర్ల ఆచూకీ తెలియలేదు. వీరిలో 40,219 మంది అంటే 78.7 శాతం మంది బాలికలు. కన్పించకుండా పోయిన పిల్లల కేసుల్ని కిడ్నాపింగ్ కేసుల కేటగిరీలో చేరుస్తారు. ఈ కేటగిరీ కింద 2020లో 29,364, 2019లో 29,243, 2018లో 24,429 కేసులు నమోదయ్యాయి. అదృశ్యమైపోయిన చిన్నారుల విషయంలో మరింత దృష్టి సారించాలని ఢిల్లీ మాజీ పోలీస్ కమిషనర్ ఎస్ఎన్ శ్రీవాత్సవ చెప్పారు. వీధుల్లో తిరిగే చిన్నారులు కిడ్నాపర్లకు లక్ష్యంగా మారుతున్నారని, వారిని అపహరించి విక్రయించడమో, వ్యభిచారంలోకి దించడమో లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వాడుకోవడమో జరుగుతోందని తెలిపారు. ఆచూకీ తెలియని చిన్నారులను వెతికి పట్టుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కన్పించకుండా పోయిన చిన్నారుల ఆచూకీని కనిపెట్టడంలో విజయం సాధించిన పోలీస్ సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించాలని అన్నారు. కాగా ఇలాంటి కేసుల విచారణలో తొలి 24 గంటలే కీలకమని స్వచ్ఛంద సంస్థ శక్తి వాహినిలో పని చేస్తున్న సామాజిక కార్యకర్త రిషి కాంత్ చెప్పారు.

అదృశ్యమవుతున్న చిన్నారుల సంఖ్య పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో అధికంగా ఉంది. గత సంవత్సరం బెంగాల్‌లో అత్యధికంగా 12,455 మంది ఆచూకీ తెలియకుండా పోగా 11,352 మంది చిన్నారులతో మధ్యప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. 2021, 2020, 2019, 2018 సంవత్సరాలలో మాత్రం మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా బెంగాల్ ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. 2022లో కనిపించకుండా పోయిన వారిలో ఇప్పటి వరకూ ఆచూకీ దొరకని చిన్నారుల సంఖ్య విషయంలో కూడా పశ్చిమబెంగాల్ తొలి స్థానంలో, మధ్యప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి. బీహార్, ఢిల్లీ రాష్ట్రాలలో కూడా అదృశ్యమైన పిల్లల సంఖ్య ఎక్కువగానే ఉంది.

ఓయూ ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు..!

యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రమోషన్స్

- కక్షపూరితంగా వ్యవహరించారంటున్న పలువురు ప్రొఫెసర్లు
- కమిటీ ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం
- మొత్తం ప్రమోషన్స్‌పై పునఃసమీక్ష జరగాలని డిమాండ్

నవతెలంగాణ-ఓయూ

సమాజానికి విద్యాబోధనలు చెప్పి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అధ్యాపకులు.. ప్రమోషన్స్ కోసం పెడదోవ పడుతున్నారు. ఓయూలో అక్రమ మార్గాల్లో ఉద్యోగోన్నతుల పొందుతున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇది ఓయూ ప్రతిష్టాత్మక దిగజార్చటమే కాకుండా అధ్యాపకులపై సమాజంలో ఉన్న గౌరవానికి మచ్చగా మారింది. దీనిపై గత ప్రభుత్వం వేసిన కమిటీ నిజాలను ఎంతవరకు నిగ్గుతేల్చుతుందోనన్న చర్చ నడుస్తోంది.

ఓయూ వీసీగా ప్రొఫెసర్ రవీందర్ బాధ్యతలు చేపట్టాక మూడు సార్లు ప్రొఫెసర్లకు ప్రమోషన్స్ కల్పించారు. ఆగస్టు మూడో వారంలో నిర్వహించిన ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు జరిగాయని, అర్హులైన వారిని పక్కన పెట్టి.. స్వయంగా పెద్దలే అక్రమంగా ప్రమోషన్స్ పొందారంటూ ఓయూ ఔటా ఆధ్వర్యంలో అప్పటి విద్యాశాఖ మంత్రి, ఉన్నత విద్యా మండలితోపాటుగా సెక్రటరీల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో నవంబర్ 15న ఉన్నత విద్యామండలి ముగ్గురు సభ్యులతో జీఓ నెంబర్ 293 ద్వారా విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. 15 రోజుల్లో కమిటీ రిపోర్టు ఇవ్వాలని కోరింది. తరువాత జరిగిన పరిణామాలతో కమిటీ చైర్మెన్‌గా ప్రొ.లింబాద్రి స్థానంలో మాజీ వీసీ ప్రొ.టి.తిరుపతిని నియమిస్తూ నవంబర్ 28న జీఓ నెంబర్ 294ను జారీ చేశారు. కమిటీ విచారణ కొనసాగుతోంది. ఓయూ ఔటతో పాటు పలువురు అధ్యాపకులు కమిటీని స్వాగతించారు. అక్రమంగా ఉద్యోగోన్నతులు పొందిన వారి సమాచారాన్ని పూర్తి స్థాయిలో, ఆధారాలను కమిటీకి అందజేస్తామని అధ్యాపకులు అంటున్నారు. గతంలో సీనియర్ ప్రొఫెసర్స్ ఉద్యోగోన్నతులకు నోటిఫికేషన్ ఇచ్చి సకాలంలో నిర్వహించకపోవడంలోనే ఏదో దాగుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కక్షపూరితంగా తనకు గిట్టని ప్రొఫెసర్స్‌కు సీనియర్ ప్రొఫెసర్ ఉద్యోగోన్నతులు రాకూడదనే ఉద్దేశంతో సకాలంలో ఇంటర్వ్యూలు నిర్వహించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఒక ప్రొఫెసర్ న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు.



కమిటీ ఎలాంటి రిపోర్టు అడిగినా అందజేస్తాం
ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ

దర్యాప్తు కమిటీ ఏ రిపోర్టు, సమాచారాన్ని అడిగినా అందజేస్తాం. మాకు ఇప్పటి వరకు కమిటీకి చెందిన ఎలాంటి పేపర్స్ రాలేదు.

కావాలనే ప్రమోషన్ ఇవ్వలేదు
ప్రొ.బి.నారాయణ- ఎకనామిక్స్ విభాగం

అన్నీ ఉన్నా ఇంటరాక్షన్‌కు పిలిచి ఉద్దేశపూర్వకంగానే నాకు సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్ ఇవ్వలేదు. ఉద్యోగోన్నతి వస్తే డీన్ అయితే తనకు ఇబ్బందులు వస్తాయని, ముందు జాగ్రత్తగా ఎంపిక కమిటీని వీసీ ప్రభావితం చేసి అడ్డుపడ్డారు. అన్ని పత్రాలు దర్యాప్తు కమిటీకి ఇచ్చి న్యాయం చేయాలి. ప్రస్తుత వీసీ యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా పబ్లిష్ చేసిన ఆర్టికల్స్ సమర్పించి ఎంపిక కమిటీని తప్పుదోవ పట్టించి ప్రమోషన్ తీసుకున్నారు.

అన్యాయం చేశారు : డా.కె.శ్రీనివాస్ నాయక్

అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్ కావటానికి యూజీసీ నిబంధనల ప్రకారం 10 పరిశోధన పత్రాలు ఉన్నాయి. ఒక పీహెచ్‌డీ అవార్డ్ చేశాను. అన్నీ ఉన్నా ఇవ్వలేదు. నాకు అన్యాయం చేశారు. కమిటీ అన్నీ పరిశీలించి మాకు న్యాయం చేయాలి.

బాధ్యత గల వారికి హూందాతనం లేదు : ప్రొ.టి.కృష్ణారావు

బాధ్యత గల పోస్ట్‌లో ఉంటూ హూందాతనం లేకుండా వ్యవహరిస్తున్నారు. ఓయూ వీసీ ఆర్టికల్స్, నా ఆర్టికల్స్ 3వ వ్యక్తితో పరిశీలించాలి. ఓయూ వీసీకి ఆర్టికల్స్ లేవు. నాకు అన్యాయం జరిగింది. నేను న్యాయ స్థానానికి వెళ్తా. సీనియర్ ప్రొఫెసర్స్ ఉద్యోగోన్నతులను పునఃసమీక్షించి లోపాలను సవరించి న్యాయం చేయాలి. ఓయూ వీసీ, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి కక్ష పూరితంగానే నా అప్లికేషన్‌ను పక్కన పెట్టారు.

ఓయూ ఖ్యాతిని రక్షించాలి : ప్రొ. ఏవీ.రాజశేఖర్

2023 నుంచి ఇప్పటి వరకు ఓయూలో జరిగిన సీఏఎస్ ఉద్యోగోన్నతులకు సంబంధించిన అప్లికేషన్స్ అన్నింటినీ పునః పరిశీలించాలి. గతంలోనే పాలకమండలి సభ్యులకు, విద్యాశాఖ సెక్రటరీకి, ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశాను. స్పందించిన నవీన్ మిట్టల్, ప్రొ.అప్పారావు.. తాను కోరిన విధంగా రిమార్క్స్ ఇవ్వాలని వర్సిటీ అధికారులకు చెప్పారు. కమిటీ ముందు హాజరు కావడానికి సిద్ధం.

అర్హతలు లేని వారికి ప్రమోషన్స్

అర్హతలు లేని వారికి ప్రమోషన్ ఇచ్చారు. ఓయూ వీసీకి 10 పేపర్‌లలో 5 పేపర్‌లు మాత్రమే యూజీసీ కేర్ లిస్టులో ఉన్నాయి. మిగతా 5 పేపర్‌లలో కూడా ఒక పేపర్ ప్లాగారిజం, ఇంకొక పేపర్ దొరకడం లేదు. వీసీతోపాటు నాడు డీన్‌గా ఉన్న ప్రొ.బాలకిషన్ అర్హతలు లేకపోయినా ప్రమోషన్ పొందారు. దీనిపై అధికారులు, నాటి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. వారు కమిటీ ఏర్పాటు చేశారు. సదరు కమిటీ నిజానిజాలు నిర్ధారణ చేస్తుందని భావిస్తున్నాం.

అడ్డదారిలో ప్రమోషన్ పొందిన వారిని తొలగించి చర్యలు తీసుకోవాలి. ఓయూ వీసీ ప్రమోషన్ విషయంలో కూడా చాలా అవకతవకలు జరిగాయి. అన్నింటి పైనా పూర్తి విచారణ జరగాలి.



ఓయూ ఔట అధ్యక్షులు ప్రొ.మనోహర్

ప్రమోషన్లను వెనక్కు తీసుకోవాలి

ప్రొపెసర్లకు అన్ని నిబంధనల ప్రకారం అర్హతలు ఉన్నా ఉద్దేశపూర్వకంగా, కక్ష పూరితంగా తిరస్కరించారు. దీనిలో ఓయూ వీసీ, మరొక ప్రొఫెసర్‌వి ఆర్టీఐ ద్వారా పబ్లికేషన్స్ తీసుకున్నాం. నిబంధనల ప్రకారం ఆ ఇద్దరు అర్హులు కారు. గవర్నర్, గత ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి, ప్రొ.లింబాద్రికి ఆధారాలతో కూడిన పత్రాలు అందజేశాం. వీరిద్దరి ప్రమోషన్స్ రద్దు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. తిరస్కారానికి గురైన ముగ్గురు ప్రొఫెసర్‌లను కమిటీ పరిశీలించి న్యాయం చేయాలి.



ప్రొ.బి.సురేందర్‌రెడ్డి

నేపాల్‌పై భారత్ ఘన విజయం

52 పరుగులకే ప్రత్యర్థి ఆలౌట్ : ఆసియా కప్-2023



దుబాయ్ : అండర్-19 ఆసియా కప్-2023 టోర్నీలో భారత యువ జట్టు ఘన విజయం సాధించింది. నేపాల్‌ను పది వికెట్ల తేడాతో ఓడించి... సెమీస్ రేసులో ముందుకు దూసుకెళ్లింది. మంగళవారం నేపాల్‌తో తలపడ్డ భారత జట్టు టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పేసర్ రాజ్ లింబాని ఏడు వికెట్లతో చెలరేగాడు. 9.1 ఓవర్లలో కేవలం 13 పరుగులు మాత్రమే ఇచ్చి బ్యాటర్లపై పూర్తి ఆధిపత్యం కనబరిచాడు. లింబానికి తోడుగా.. ఆరాధ్య శుక్లా రెండు, అర్షిన్ కులకర్ణి ఒక వికెట్‌తో రాణించారు. ఈ ముగ్గురు అద్భుత ప్రదర్శన కారణంగా.. నేపాల్ 22.1 ఓవర్లలోనే చాపచుట్టేసింది.

ఓపెనర్లే పూర్తి చేశారు

భారత బౌలర్ల విజంభణ కారణంగా 52 పరుగులకే ఆలౌట్ అయింది. ఇక స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టును ఓపెనర్లు ఆదర్శ్, అర్షిన్ కులకర్ణి విజయతీరాలకు చేర్చారు. ఆదర్శ్ 13 బంతుల్లో 13 పరుగులతో అజేయంగా నిలవగా.. అర్షిన్ 30 బంతుల్లోనే 43 పరుగులు రాబట్టి భారత్ విజయాన్ని ఖరారు చేశాడు. ఇక ఈ గెలుపుతో భారత జట్టు సెమీస్ బెర్తును అనధికారికంగా ఖాయం చేసుకుంది. మరోవైపు.. గ్రూప్-'ఏ'లో భాగమైన పాకిస్తాన్ మంగళవారం అఫ్గనిస్తాన్‌తో పోటీపడుతోంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ జట్టు 48 ఓవర్లలో 303 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ గెలిస్తే సెమీస్ చేరడం లాంఛనమే! దీంతో మరోసారి దాయాదులు భారత్- పాక్ మ్యాచ్ చూసే అవకాశం అభిమానులకు దక్కుతుంది.

దుబాయ్ వేదికగా జరుగుతున్న ఈ మెగా ఈవెంట్లో గ్రూప్-'ఏ'లో ఉన్న భారత్ తొలుత అఫ్గనిస్తాన్‌తో తలపడింది. ఈ మ్యాచ్‌లో అఫ్గన్‌ను ఏడు వికెట్ల తేడాతో ఓడించిన ఉదయ్ సహారన్ సేన.. రెండో మ్యాచ్‌లో మాత్రం ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ చేతిలో ఎనిమిది వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో సెమీస్ చేరాలంటే.. లీగ్ దశలో తమ ఆఖరి మ్యాచ్లో తప్పక గెలవాల్సిన స్థితిలో నిలిచింది.

ఐపీఎల్ 2024 వేలంలో 333 మంది ఆటగాళ్లు



న్యూఢిల్లీ : దుబాయ్ వేదికగా ఈ నెల 19న జరిగే ఐపీఎల్ 2024 వేలంలో పాల్గొనబోయే ఆటగాళ్ల జాబితాను ఐపీఎల్ గవర్నింగ్ బాడీ విడుదల చేసింది. ఈ వేలంలో మొత్తం 333 మంది ఆటగాళ్లు పాల్గొననున్నారు. ఇందులో 214 మంది భారత ఆటగాళ్లు కాగా.. 119 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. మొత్తం జాబితాలో 116 మంది క్యాప్డ్ ప్లేయర్స్ కాగా.. 215 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్స్, ఇద్దరు అసోసియేట్ దేశాల ఆటగాళ్లు ఉన్నారు. ఈ జాబితాలో 23 మంది ఆటగాళ్లు రూ. 2 కోట్ల బేస్ ధర విభాగంలో పేర్లు నమోదు చేసుకోగా.. 13 మంది రూ.1.5 కోట్ల బేస్ ధరలో తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. ఈ వేలం భారతకాలమానం ప్రకారం.. డిసెంబర్ 19న మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమవుతుంది. కాగా, 10 ఐపీఎల్ జట్లకు అవసరమైన 77 స్థానాల కోసం 333 మంది పోటీ పడనున్నారు. రూ.2 కోట్ల బేస్ ప్రైస్‌లో హర్షల్ పటేల్, శార్దూల్ ఠాకూర్, ఉమేష్ యాదవ్ ఉన్నారు. ఇక రూ.1.5 కోట్ల బేస్ ప్రైస్ లో 13 మంది ప్లేయర్స్ ఉండటం విశేషం. రూ.2 కోట్ల బేస్ ప్రైస్ తో ముగ్గురు ఇండియన్స్ కాకుండా.. హ్యారీ బ్రూక్, ట్రావిస్ హెడ్, రైలీ రూసో, స్టీవ్ స్మిత్, గెరాల్డ్ కొయెట్జీ, ప్యాట్ కమిన్స్, క్రిస్ వోక్స్, జోష్ ఇంగ్లిస్, లాకీ ఫెర్గూసన్, జోష్ హేజిల్‌వుడ్, స్టార్క్, ముజీబుర్ రెహమాన్ లాంటి ప్లేయర్స్ ఉన్నారు.

స్టార్క్, కమిన్స్ ప్రత్యేక ఆకర్షణ

2015లో చివరిసారి ఓ ఐపీఎల్ మ్యాచ్ ఆడిన ఆస్ట్రేలియా స్టార్ పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఈసారి మళ్లీ ఐపీఎల్ వేలంలో తన పేరు నమోదు చేసుకున్నాడు. అతనితోపాటు వరల్డ్ కప్ గెలిచిన ఆస్ట్రేలియా టీమ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఇక ఆస్ట్రేలియా కప్పు గెలవడంలో కీలకపాత్ర పోషించిన ట్రావిస్ హెడ్, న్యూజిలాండ్ ఓపెనర్ రచిన్ రవీంద్రలాంటి వాళ్లపైనా అందరి దృష్టి నెలకొంది.

గుజరాత్ టైటన్స్ దగ్గరే ఎక్కువ డబ్బు

ఐపీఎల్ 2024 సీజన్ కు ముందు తమ కెప్టెన్ హార్దిక్ పాండ్యాను ముంబైకి ఇచ్చేసిన గుజరాత్ టైటన్స్ దగ్గరే అందరి కంటే ఎక్కువ డబ్బు ఉండటం విశేషం.

ఆ ఫ్రాంచైజీ దగ్గర అత్యధికంగా రూ.38.15 కోట్లు ఉన్నాయి. ఇక లక్నో సూపర్ జెయింట్స్ దగ్గర అందరి కంటే తక్కువగా రూ.13.15 కోట్లు మాత్రమే ఉన్నాయి.



కళ్యాణ్‌రామ్ నట విశ్వరూపం చూస్తారు

నందమూరి కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా నటిస్తోన్న లేటెస్ట్ పీరియాడిక్ స్పై థ్రిల్లర్ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ట్యాగ్ లైన్. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా దర్శక, నిర్మాతగా రూపొందిన ఈ చిత్రం ఈనెల 29న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

ఈ నేపథ్యంలో మంగళవారం చిత్ర యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో హీరో కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ, 'మంచి కథ, విజువల్స్, మ్యూజిక్ ఉండి.. దానికి తగ్గ టీమ్ వర్క్ చేసినప్పుడు ఆడియెన్స్ థియేటర్స్‌కి వద్దన్నా వస్తారని 'బింబిసార' సమయంలో చెప్పాను. దాన్ని మీరు నిజం చేశారు. అదే కోవలో డెఫనెట్‌గా ఈ సినిమా కూడా మంచి కథ, కథనాలతో మీ ముందుకు వస్తుంది. విజువల్స్ ఎలా ఉంటాయనేది ట్రైలర్‌లో చూశారు. కథను తయారు చేసుకున్న శ్రీకాంత్, అద్భుతమైన విజువల్స్ అందించిన సౌందర్ రాజన్, అలాగే వెంకట్ మాస్టర్, రామకృష్ణ మాస్టర్, కాస్ట్యూమ్ డిజైనర్ రాజేష్, 1940 బ్యాక్ డ్రాప్‌లో చేయాల్సిన ఈ సినిమా కోసం ఓ కొత్త ప్రపంచాన్ని తయారు చేసిన గాంధీకి థ్యాంక్స్. వీటన్నింటినీ కలిపి ఇలా చూస్తే బావుంటుందని ఆలోచించి ఖర్చుకి వెనుకాడకుండా సినిమాను గొప్పగా రూపొందించిన అభిషేక్ నామాకి ధన్యవాదాలు. ఈనెల 29న ఈ సినిమా మీ ముందుకు వస్తుంది. నా మాట తీసుకోండి.. రాసుకోండి.. సినిమా చాలా బావుంటుంది' అని తెలిపారు.

'బింబిసార 2' వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మే నుంచి మొదలవుతుంది. తమ్ముడు ఎన్టీఆర్ సినిమా 'దేవర' గురించి చెప్పాలంటే.. 'ఆర్ఆర్ఆర్' వంటి సినిమా చేసిన తర్వాత ఓ యాక్టర్‌కి, డైరెక్టర్‌కి, ప్రొడక్షన్ హౌస్‌కి ఎంతో బాధ్యత ఉంటుంది. చిన్నపాటి తప్పు జరిగినా ఎవరూ ఊరుకోరు. మేం తెలిసి తప్పు చేయం. బాధ్యతగా తీసుకుని ఎంత కష్టపడతామో మాకు తెలుసు. వి.ఎఫ్.ఎక్స్‌కి చాలా సమయం పడుతుంది. ఎందుకంటే మేం ఈ మూవీ కోసం ఓ కొత్త ప్రపంచాన్ని చూపించబోతున్నాం. దయచేసి ఓపిక పట్టండి. త్వరలోనే గ్లింప్స్ డేట్‌ను టీమ్ అనౌన్స్ చేస్తుంది.

- కళ్యాణ్ రామ్

'డెవిల్ ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుంది. రెండేళ్ల పాటు కళ్యాణ్ రామ్ మరో సినిమా ఏదీ చేయకుండా వర్క్ చేశారు. ట్రైలర్‌లో ఆయన్ని చూసింది తక్కువ. రేపు థియేటర్స్‌లో ఆయన విశ్వరూపాన్ని చూస్తారు. యాక్షన్, పెర్ఫామెన్స్ అదిరిపోతుంది. ఈ ఏడాది 'వీరసింహా రెడ్డి' వంటి బ్లాక్ బస్టర్‌తో స్టార్ట్ అయ్యింది. ఈనెల 29న 'డెవిల్' వంటి బ్లాక్ బస్టర్‌తో కంప్లీట్ అవుతుంది' అని దర్శక, నిర్మాత అభిషేక్ నామా అన్నారు.

నవచిత్రం

క్రేజీ కాంబోలో పాన్ ఇండియా యాక్షన్ సినిమా





శృతిహాసన్, అడివిశేషు

అడివి శేష్, శృతి హాసన్ కాంబినేషన్ ఓ మెగా పాన్-ఇండియా యాక్షన్ డ్రామాలో నటించబోతున్నారని మేకర్స్ మంగళవారం అనౌన్స్ చేశారు.

అడివి శేష్ 2022లో చేసిన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ బయోపిక్ 'మేజర్' బ్లాక్‌బస్టర్ విజయంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. టైటిల్ ఇంకా రివీల్ చేయని ఈ లేటెస్ట్ ప్రాజెక్ట్ అడివిశేష్‌కు రెండో స్ట్రయిట్ హిందీ మూవీ కానుంది. ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ముఖ్యమైన వివరాలు, క్యారెక్టర్ పోస్టర్‌లు, టైటిల్‌తో సహా సినిమాకి సంబంధించిన కీలకమైన విషయాలన్ని రాబోయే రోజుల్లో ప్రేక్షకులకు పరిచయం చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ఈ మెగా ప్రాజెక్ట్‌ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. యునైటెడ్ స్టేట్స్‌లో పుట్టి పెరిగిన షానెల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. అడివి శేష్ 'క్షణం', 'గూఢచారి'తో సహా పలు తెలుగు బ్లాక్‌బస్టర్‌లకు గతంలో డీవోపీగా పనిచేసిన షానీల్‌కు దర్శకుడిగా ఇది తొలి చిత్రం. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు అధికారికంగా ఎంపికైన 'లైలా' అనే ప్రశంసలు పొందిన షార్ట్ ఫిల్మ్‌కు ఆయన దర్శకత్వం వహించారు.

సినిమాలోని ప్రతి ఫ్రేమ్, డైలాగ్, సన్నివేశాన్ని హిందీతో పాటు తెలుగులో విడివిడిగా చిత్రీకరిస్తున్నాం. ప్రతి భాష, సాంస్కృతిక ప్రత్యేకత బట్టి దీనిని విభిన్నంగా ట్రీట్ చేస్తున్నాం' అని మేకర్స్ అనౌన్స్ మెంట్‌లో పేర్కొన్నారు.

ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహ-నిర్మాత. అడివి శేష్, షానీల్ డియో కలిసి కథ, స్క్రీన్ ప్లే సమకూర్చారు.

వేట మొదలైంది..



రజనీకాంత్

తన బర్త్‌డే సందర్భంగా సూపర్‌స్టార్ రజనీకాంత్ సోమవారం అభిమానులకు కొత్త సినిమా టైటిల్ రూపంలో అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రానికి 'వేట్టయాన్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. 'వేట మొదలైతే.. ఏ మృగమైనా పడిపోవాల్సిందే..' అంటూ టైటిల్ గ్లింప్స్‌లో తన స్టయిల్‌లో రజనీ చెప్పిన డైలాగ్ అందర్నీ విశేషంగా అలరిస్తోంది.

ఇది రజనీకాంత్ నటిస్తున్న 170వ సినిమా. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా, మంజూ వారియర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అసలైన హర్రర్ సినిమా



శ్రీరామ్

హీరో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఈనెల 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం హీరో శ్రీరామ్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

- హర్రర్ సినిమాల విషయంలో నాకో భయం ఉంది. అదేంటంటే పేరుకి హర్రర్ సినిమా అంటారు. కానీ అందులో అనవసరమైన కామెడీ, రొమాన్స్, సాంగ్స్‌ను ఇరికిస్తుంటారు. హర్రర్ జోనర్ అంటే హర్రరే ఉండాలి. థియేటర్‌లో మనం చూసేటప్పుడు ఉలిక్కిపడేలా ఉండాలి.
- సాయికిరణ్ దైదా ఈ కథ చెప్పగానే నచ్చింది. కొత్త దర్శకుడు అయినప్పటికీ ఆయనకి ఎంతో క్లారిటీ ఉంది. ఆయన తీసిన 'స్మోక్' అనే షార్ట్ ఫిల్మ్ చూసి ఆయన ప్రతిభపై నమ్మకంగా కలిగింది. నిర్మాత యశ్వంత్ ఈ కథను నమ్మి సినిమా చేశారు. ఇది ఖచ్చితంగా థియేటర్‌లో చూసి అనుభూతి చెందాల్సిన అసలైన హర్రర్ సినిమా. ఈ కథ 1930, 1990, ప్రస్తుతం ఇలా మూడు కాలాల్లో జరుగుతుంది. ఒక ఇల్లు, ఒక కుటుంబం అన్నట్టుగా సినిమా ఉండదు. ఇందులో చాలా కథ ఉంటుంది.
- 'పిండం' అనే టైటిల్‌తో కూడా కథ ముడిపడి ఉంటుంది. అయితే కొందరు 'పిండం' నెగటివ్ టైటిల్ అంటున్నారు. పిండం అనేది నెగటివ్ టైటిల్ కాదు.. పాజిటివ్ టైటిల్. పుట్టుకలోనూ, చావులోనూ పిండం ఉంటుంది. తల్లి కడుపులో పెరిగే బిడ్డను పిండం అంటారు. అలాగే మనిషి చనిపోయాక వారి ఆత్మశాంతి కోసం పెట్టే భోజనాన్ని పిండం అంటారు. ఒకటి జీవితాన్ని ఇస్తుంది. ఇంకొకటి మరణం తర్వాత కూడా ఆనందాన్ని ఇస్తుంది. అందుకే ఇది పాజిటివ్ టైటిల్. పైగా ఇది కథకి సరిగ్గా సరిపోయే టైటిల్.
- నేను గతంలో చేసిన మిగతా హర్రర్ సినిమాలతో పోలిస్తే ఈ సినిమా వైవిధ్యంగా ఉంటుంది. ఇది కేవలం హర్రర్ మాత్రమే కాదు.. ఇదొక ఎమోషనల్ డ్రామా. ప్రతి పాత్రకి ప్రాధాన్యత ఉంటుంది. శ్రీనివాస్ అవసరాల, ఈశ్వరీరావు అద్భుతంగా నటించారు. నేను, జి.వి.ప్రకాష్ కలిసి తమిళ్‌లో 'బ్లాక్ మెయిల్' అనే మూవీ చేస్తున్నాం. అలాగే 'సంభవం' అనే ఇంకో సినిమా చేస్తున్నాను. ప్రస్తుతం ఆరు ప్రాజెక్ట్‌ల్లో నటిస్తున్నాను.



చేనేత కార్మికులకు అంకితం

విరాజ్ అశ్విన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'జోరుగా హుషారుగా'. పూజిత పొన్నాడ కథానాయిక. అను ప్రసాద్ దర్శకుడు. శిఖర అండ్ అక్షర ఆర్ట్స్ ఎల్‌ఎల్‌పీ పతాకంపై నిరీష్ తిరువిధుల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 15న విడుదల కాబోతోంది. సోమవారం సాయంత్రం ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది.

ముఖ్య అతిథులుగా హాజరైన దర్శకుడు వశిష్ట, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ సినిమా సక్సెస్ అవ్వాలని విష్ చేశారు.

విరాజ్ మాట్లాడుతూ,'ఇదొక మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్. చేనేత కార్మికుల కుటుంబం నుంచి వచ్చిన సంతోష్‌గా నేను ఇందులో కనిపిస్తాను. నా క్యారెక్టర్ తప్పకుండా అందరికీ కనెక్ట్ అవుతుంది. చేనేత కార్మికుల కష్టాలను చూపించాం' అని చెప్పారు. 'ఈ చిత్రాన్ని చేనేత కార్మికులకు అంకితం ఇస్తున్నాం. చేనేత కార్మికుడిగా ఇందులో నటించడం నా అదృష్టం. పోచంపల్లి చేనేత కార్మికుల గురించి చాలా చక్కగా ఇందులో చూపించాడు దర్శకుడు అను ప్రసాద్. ఇదొక గ్రేట్ కాన్సెప్ట్' అని సాయి కుమార్ అన్నారు. దర్శకుడు అను ప్రసాద్ మాట్లాడుతూ,'ఇది నా మొదటి చిత్రం. రిలీజ్ విషయంలో బెక్కం వేణుగోపాల్ అందించిన సహాయం మర్చిపోలేం' అని తెలిపారు.'ఓ మంచి సినిమా తీసినందుకు చాలా గర్వంగా ఉంది. అందరూ ఎంజాయ్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది' అని నిర్మాత నిరీష్ చెప్పారు.

పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో..



బి.ఆర్.సభావత్ నాయక్

"9వ తరగతిలోనే ప్రపంచ విప్లవానికి ఐకాన్‌గా నిలిచిన చేగువేరా గురించి తెలుసుకున్నాను. అప్పటి నుంచి ఆయన బయోపిక్ సినిమాగా తీయాలని కల. డబ్బులు లేవు, సపోర్టు లేదు. తోపుడు బండిపై చిన్నచిన్న తినుబండారాలు అమ్ముతూ పైసా పైసా కూడబెట్టాను. పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో నా లక్ష్యం మరింత బలపడింది. 20 ఏళ్ల శ్రమ ఫలించింది. ఆయన గౌరవం ఏమాత్రం తగ్గకుండా చేగువేరా బయోపిక్ 'చే' సినిమాను తీశాను. సినిమా ప్రచార చిత్రాలను చేగువేరా తనయ డాక్టర్ అలైదా గువేరా స్వయంగా విడుదల చేసి మా చిత్ర యూనిట్‌ను అభినందించడం మాకెంతో గర్వకారణం. సెన్సార్ వాళ్ల కూడా సినిమా చూసి ఇంప్రెస్ అయ్యారు. ఈనెల 15న థియేటర్‌లలోకి 'చే'ను విడుదల చేస్తున్నాం' అని దర్శకుడు బి.ఆర్ సభావత్ నాయక్ అన్నారు.

క్యూబా పోరాటయోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన చిత్రం "చే" - లాంగ్ లైవ్ ట్యాగ్ లైన్. ఈనెల 15న ఈ సినిమా థియేటర్‌లలో విడుదల కాబోతోంది.

ఈ సందర్భంగా జరిగిన చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌లో జనసేన నాయకురాలు రాయపాటి అరుణ, సీనియర్ జర్నలిస్టులు ప్రభు, భరద్వాజ్, నటుడు, ఈసీ మెంబర్ మాణిక్, నటుడు, పబ్లిసిటీ డిజైనర్ వివారెడ్డి, 'ప్రత్యర్థి' మూవీ డైరెక్టర్ శంకర్ తదితరులు ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

నవ ఉదయం సమర్పణలో నేచర్ ఆర్ట్స్ బ్యానర్ పై బీఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్ పోషిస్తూ, దర్శకత్వం వహించారు. సూర్య, బాబు, దేవేంద్ర సంయుక్తంగా నిర్మించిన ఈ మూవీకి రవిశంకర్ సంగీతం అందించారు. ఈ సినిమా వీరాంజనేయ పిక్చర్స్ సంస్థ ద్వారా 100కు పైగా థియేటర్‌లలో విడుదలకు సిద్ధమైంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886